
C

వెళ్ళకే వెళ్ళకే



సి.నారాయణరెడ్డి

ci

వ్యాసవాహిని

(సాహిత్య వ్యాసాలు)

★

డా॥ సి. నారాయణరెడ్డి, ఎం. ఏ., పిహెచ్. డి.

★

ప్రతులకు:

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

సికింద్రాబాదు, మచిలీపట్టణం.

ప్రథమ ముద్రణ
వేయి ప్రతులు

డిశంబరు
1965

వెల
రు. 2-50

ముద్రణ: జ్యోతిప్రెస్,
హైద్రాబాద్-20.

ఈ పదేళ్లలో నేను అప్పుడప్పుడు వ్రాసిన వ్యాసాలూ, చేసిన ఆకాశవాణి ప్రసంగాలూ ఏరి ఈ సంపుటిగా ప్రచురిస్తున్నాను.

వీటిల్లో కొన్ని సాహిత్యవిద్యార్థులకు ఉపయుక్తమైనవి ఉన్నాయి; కొన్ని సరదాగా చదువుకోవడానికి యుక్తమైనవీ ఉన్నాయి. స్థాయినిబట్టి చూసినా ఈ తారతమ్యం స్పష్టంగా కనిపిస్తుంది. పల్లవదశలో ఉన్నవి కొన్ని; పంటకెదిగినవి మరికొన్ని.

ఈ వ్యాసాలను ఇంతట్లో పుస్తకరూపంలో ప్రచురించాలనే దృష్టి నాకు లేదు. మిత్రులు, సాహితీబంధువులు శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారి ప్రోత్సాహమే నన్ను ఈ పనికి పురికొల్పింది. ఈ వ్యాసాల కూర్పులోనేకాక అచ్చుతీర్పులోగూడ రవీంద్రనాథ్ గారి సలహాలు నాకు ఎంతో ఉపకరించినవి. బుద్ధికీ, హృదయానికీ పూలవంతెన వేసుకున్న రవీంద్రనాథ్ గారి సౌహార్దానికి నా అక్షరాంజలి.

మొదట వీటి ప్రచురణకూ, ప్రసరణకూ వీలుకలిగించిన భారతి, స్రవంతి, ఆంధ్రప్రభ పత్రికా సంపాదకులకు, ఆకాశవాణి నిర్వాహకులకు కృతజ్ఞుణ్ణి.

నారాయణరెడ్డి

హైదరాబాదు
26—1—1966

REHOIC320

నన్నెచోడుని కవితాశక్తి

నన్నయ తరువాత ఆతడేర్పరచిన రాచబాటను కాదని తన దారి తా నవలంబించి దానిని ఘంటామార్గముగా మలచుకొన్న కవిరాజశిఖా మణి నన్నెచోడుడు. ఎంతకును నన్నయ్య దృష్టి కళానిష్ఠము. అతని కవిత ప్రసన్నకథాకలితార్థయుక్తి పరిపుష్టము. మరి నన్నెచోడుని కవిత 'వస్తు'నిష్ఠులము. నన్నెచోడుడు మాటిమాటికి వస్తుకవితను ప్రస్తా వించెను. భారవిని నస్తుకవితను భారవియనెను. ఉబ్బటుడు సంస్కృత ములో "కుమారసంభవమ్ము నలంకారము గూఢవస్తుమయకావ్యము"గా చెప్పెనటను. "సమస్త వస్తుకవీశ్వర నూత్న కావ్యరుచిర రత్న వీథి" యెట్లుండవలెనో విపులీకరించెను. తానుసైతము "జంగమ మల్లయ వర మునందుగనిన వస్తుకవిత"ను ప్రాయుచున్నట్లు పేర్కొనెను. ఇన్నిమారు లీవస్తుకవితను ప్రస్తుతించినను స్పష్టముగా దానిని నిర్వచించలేదు. కావ్యము "దశప్రాణంబుల సప్రాణంబై నవరసభావ భరితంబై షట్త్రింశ దలంకారాలంకృతంబై" రమణీయముగా నుండవలెనని మాత్రము వాకొనెను. అనంతర ప్రబంధములకు నిర్భంధగుణములైన. అష్టాదశ వర్ణనముల పట్టిక యిచ్చెను.

"వనజలకేళీ రవిశశి
తనయోదయ మంత్రగతిరతక్షితిపరణాం
బునిధి మధు ఋతు పురోద్వా
హ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్"

ఈ లక్షణములన్ని పరిశీలించిచూ నన్నెచోడుని దృక్పథము కొంత విశదమగును. నన్నయ్య రమణీయోక్తులతో కథను అందముగా కవ్వారతాంబూలమువలె మలచి అందించెను. మిత వర్ణనలతో అలతియలతి అలంకారములతో కావ్యకన్యకను కణ్వాశ్రమ ములోని శకుంతలవలె ప్రవర్తించెను. నన్నెచోడు డట్లుగాక తన కవితా

యువతికి షట్త్రింశదలంకారములను కైసేసి, అష్టాదశవర్ణనావసనము చుట్టి రాచవారింటి పెండ్లికూతురుగా తీర్చి దిద్దెను. మున్యాశ్రమ కన్యా సాధుతాసౌందర్యములు నన్నయ కవితలో వెన్నవలె పేరి కనిపించును. రాచవారి అమ్మాయి నిక్కు-నొక్కులు, బిబ్బోక హేవాకములు నన్నె చోడుని కవితలో ''కన్నులు మిఱుమిట్లు వోవంగ'' కనిపించును.

నన్నెచోడుని కుమారసంభవము ఇంచుమించుగా స్వతంత్ర కావ్యము. కాళిదాసు కుమారసంభవమునకు ఇది అనుకృతియుకాదు, అనుసృతియుకాదు. అవతారికలో నన్నెచోడుడు కాళిదాసును పేర్కొన్నను అతని కుమారసంభవము ఊసెత్తలేదు. పైగా ఉద్భటుని కుమార సంభవమును గూఢవస్తుమయ కావ్యముగా ప్రశంసించెను. ఈ కావ్య మింతవరకును లభించలేదు. నన్నెచోడునినాటికది అందుబాటులో ఉం డెడిదేమో? ఈకావ్యమును తాననుసరించినట్లు నన్నెచోడు డనలేదు. ఉద్భటుడు కుమారసంభవమే కాక కావ్యాలంకార సంగ్రహమను లక్షణ గ్రంథమును గూడ వ్రాసినాడు. అతడీ గ్రంథములో తన కుమారసంభ వమునుండి కొన్నిశ్లోకములను లక్ష్యములుగా ఉదాహరించెను. ఆ శ్లోక ములకు నన్నెచోడుని పద్యములకు తారతమ్యపరీక్షచేసి ఉద్భటుని కృతికి నన్నెచోడుని కృతి అనుకృతికాదని మానవల్లి రామకృష్ణకవిగా రభిప్రాయపడినారు. ఇంతవరకున్న ఆధారములనుబట్టి నన్నెచోడుని కావ్యము మూలికమైనదని నిర్ధరించవచ్చును.

నన్నెచోడునికి కథాగతిపైన దృష్టిపల్చన. శివపారమ్యము నుద్ఘా టించుటకు కథాసూత్రమునకు ఋతి కల్గినను సరకుసేయలేదు. కాళిదాసు హిమాలయ వర్ణనముతో కావ్యమారంభించగా నన్నెచోడుడు సతీశివుల వనకేళితో మొదలుపెట్టెను. కాళిదాసు

''అథావమానేన పితుః ప్రయుక్తా
దక్షస్యకన్యా భవ పూర్వపత్నీ
సతీ పతీ యోగవిసృష్ట దేహా
తాంజన్మనే శైలవధూం ప్రపేదే''

అను శ్లోకమున సూచించిన దక్షాధ్వరధ్వంస సతీదహనాది పూర్వ వృత్తాంతమును నన్నెచోడుడు ఒక ఆశ్వాసము మొత్తము వర్ణించెను. కథాసూత్రమున కణుమాత్రము బలముకూర్చని గజాననోత్పత్తిని ప్రవేశ పెట్టెను. ద్వితీయాశ్వాసాంతము శివపారవ్యము నుగ్గడించుచు సతీదేవి యిచ్చిన ఉపన్యాసము మరియు అన్యదేవతాహేళనముతో నింపెను. గతగద్యుడైన దక్షునిచేత లయగ్రాహి లయహారిణీ వృత్తములతో త్ర్యక్షుని పొగిడించెను. మూడవ ఆశ్వాసములో అసలు కథవైపు అక్షులు మరలెను. శివాధిక్యమును ప్రతిపాదించుటకు మూలకథను మార్చిన నిదర్శనములు కావ్యమునిండకలవు. కాళిదాసు ప్రకారము తారకతా డితులైన బృందారకులు ఇంద్రపురస్సరులై స్వయంభువును చేరుదురు. నన్నెచోడుని చూపు తెన్ను భిన్నముగదా!. ''ఇట్లు పరమేశ్వరుండు తపోవృత్తిం దగిలి జగద్వ్యాపారంబు లారయకునికించేసి తారకాసురుం డను ఘోరాసురుండేచి'' విజృంభించగా వానికోటువడి సురలు విరించిని దర్శింతురు. దేవతలు పండ్రెండు శ్లోకములలో పద్మగర్భుని ప్రస్తుతించి నట్లు కాళిదాసు వ్రాసెను. నన్నెచోడుడు ''నానావిధస్తుతిరవంబు'' లను ఒక్కమాటతో చేతులు దులుపుకొనెను. నన్నెచోడుడెంతగా వర్ణనా ప్రియుడైనను కథాసూత్రమును బొత్తిగా విస్మరించలేదు. రతీవిలాప వసంతసాంత్వనములకు కాళిదాసు ఒక సర్గమొత్తము కేటాయించి నాడు. నన్నెచోడు డీ ఘట్టమును కొలది పద్యములలో ముగించినాడు. కాళిదాసు అంత విపులముగా రతీరోదనమును వర్ణింపవలసిన అవసరము లేదనిపించును. ఈ ఘట్టము ప్రధాన కథకు అంతగా బలము చేకూర్చునదికాదు. ఈ పట్టున మనదృష్టి శివుడేమైనాడు, పార్వతి యేమిచేసినది అని ఉరకలు పెట్టునేకాని రతీదేవి ఎంత సేపేడ్చినదనువైపు

పోదు. శివపార్వతుల సంయోగమే ముందుకానున్న జగల ఘట్టము. పార్వతి తపస్సును కాళిదాసు రసవత్తరముగా వర్ణించినాడు. ఆమె సర్వకాల సర్వావస్థలయందు తపస్సమాధిలో నిల్చెనని రెండు మూడు శ్లోకములలో కాళిదాసు సూచించగా నన్నెచోడుడు వస్తుకావ్యవాది కావున దాదాపు ఏబది పద్యములలో షడ్ఋతువర్ణనము చేసెను. పార్వతిది ఒకనాటి తపస్సుకాదు. ఆమె తపస్సమాధిలోనుండగా వర్షములు వసంతములు గడచిపోయినవి. ఆమె సుదీర్ఘతపస్సునకీ సుదీర్ఘవర్ణనము పోషకమనియే నాఅభిప్రాయము. రానురాను నన్నెచోడుడు రాత్రి, చంద్రోదయ, వేశ్యావాటీ, జార-చోర, విటవిటీవర్ణన మనవసరముగా చేసి నను అదియే తదనంతర ప్రబంధములకు మేతయైనది. నన్నెచోడుడు కథను ఉదాత్తరీతిలో నడిపించుటలో కాళిదాసుతో పోటీచేయలేకున్నను బహుముఖ వర్ణనలు చేయుటలో అతనికేమాత్రము వెనుకబడలేదు. ప్రబంధకవులలో ఒకరిద్దరు, పురాణ కావ్యకవులలో నాచనసోముడు తప్ప నన్నెచోడునితో తులదూగెడు అనల్ప కల్పనాశక్తి, అపూర్వ వర్ణనాయుక్తికల ఆంధ్ర కవులు అరుదు.

నన్నెచోడుని కవితాగుణములలో కల్పనాశక్తికే అగ్రతాంబూలము. చర్మచక్షువులు చించుకొన్నను కన్పించని ఊహాచిత్రములు, లోకమంత కలయదిరిగినను కన్పించని కల్పనాత్మకపటములు, నన్నెచోడుడు కన్నులనిండుగా చూచి వీనులవిందుగా వర్ణించెను. హిమవన్నగ వర్ణనములో కాళిదాసు కనబరచిన కల్పనాశక్తి సహృదయులకు అబ్బురము గొల్పుచుండును. నన్నెచోడుడు మంచుకొండను వర్ణించినపట్టున ప్రయోగించిన ఉత్ప్రేక్షలు, ఉపమానములు అతని అచుంబిత కల్పనాప్రతిభకు కొలమానములు.

"సలలితంబగు శశికాంతశిలరుచులు
నింద్రనీలోపలద్యుతు లెనసిపెడల
పటులెల్ల సితాసితపక్షయుగళ
సహితమై చూడనొప్పు మాసములవోలె"

హిమాద్రిపై పక్షులు లెగయుచున్నవి. కొండపై ఒకవంక చంద్ర కాంతములు, ఒకవంక ఇంద్రనీలములు. మధ్యలో ఎగసిపోవుచున్న పక్షులపై రెండువైపులనున్న రత్నముల కాంతులు పడినవి. ఒకే పక్షి రెండు రెక్కలు, ఒకటి తెల్లగా ఒకటి నల్లగా భాసించినవి. అవి పక్షులు కావు—ఎగసిపోవుచున్న మాసములు. అవి రెక్కలుకావు—కాలవాతూలముతో చలించుచున్న శుక్లపక్ష కృష్ణపక్షములు. మామూలుగా ఎగసిపోవు పక్షులను, సందర్భమును పురస్కరించుకొని మాసములుగా కల్పనచేసినాడు నన్నెచోడుడు. ఇతని ఊహావైచిత్రికి ఇంకొక నిదర్శనము.

"ఎసిన నిజాసితద్యుగ్రుచి
కనుగొన కవ్వైన మల్లికా ప్రసవంబుల్
దనరారు నల్లమల్లియ
లని కోసిరి కొంద అుత్పలాక్షులు ప్రీతిక."

ఈ పద్యము పుష్పాపచయ ఘట్టములోనిది. కుసుమ కోమలులు కుసుమములను కోయుచున్నపుడు కల్గిన భ్రాంతియిది. లోకములో తెల్లని మల్లెలు కొల్లలు కొల్లలు. నల్లనిమల్లె మందుకైనను దొరకదు. నీలోత్పలనేత్రలు పూలుకోయునప్పుడు వారి దృశ్యకాంతి మల్లెలపై సోకినది. ఆ కాంతి నల్లనిది. ద్యుగ్రుచులు అసితములుగా ఉండుట కవి సమయము; సహజముగూడ. ఇంకేమున్నది? నల్లమల్లియలను చూడగనే పల్లవాంగుల హృదయము వెల్లివిరిసినది. అత్యంత ప్రీతితో తెల్లమల్లెలనే నల్లమల్లెలని కోసి గంపలు నింపుకొనిరి. ఇది కేవలము భ్రాంతి. మల్లెలపైనుండి యీక్షణములు మరలిన మరుక్షణము వాని అసలురూపు బయటపడును. అనగా భ్రాంతి విచ్ఛిత్తి జరుగును. మల్లెలతోపాటు పల్లవాధరల మొగములుగూడ తెల్లబడును. ఉల్లాసము ఉప్పొన ఎగసిపోవును. నన్నెచోడుడు భ్రాంతితోనే ముగించినాడు. తద్విచ్ఛిత్తి వట్టి వాచ్యమని వదలివేసినాడు. లోకములోలేని నల్ల మల్లియలను సృష్టించి వానికి తాత్కాలికమైన అస్తిత్వమును ప్రసాదించినాడు.

కావ్యమున అప్రస్తుతముగా చేసిన చంద్రికా వర్ణనమున నైతము నన్నెచోడుని ఊహావైచిత్ర్యము మిన్నగా కన్పించును.

"తన సుతుడగు శశిమెయి కతి
గని చెచ్చెర కడిగి పుచ్చగానని దుగ్ధాం
బునిధి నభంబున కెగసెనో
యన చంద్రిక పర్వె సాంద్రమై విమలంబై"

వెన్నెల పాలవెల్లి పొంగినట్లుగా లోకమున వ్యాపించినది. ఇంత వరకు చెప్పి యూరకున్నచో అది గతానుగతికము. నన్నెచోడుని మిన్న తనము కన్పించక పోవును. పాలసంద్ర మెపుడు పొంగును? "చంద్రో దయారంభ కాలమున." ఇందుకు కారణము 'శాస్త్రము' చెప్పునేమో కాని సాహిత్యము చెప్పలేదు. నన్నెచోడుడుమాత్రము చెప్పినాడు. శస్త్రచికిత్స చేసి సహేతుకముగా చెప్పుట కవి పనికాదు. భావనాబల ముతో మనోరంజకముగా కవి చెప్పును. నన్నెచోడు డా రీతినే చెప్పి నాడు. చంద్రుడు పాలకడలి గారాబుపట్టి. అతడు అమృతాత్మకు డయినను ఏ పాపవశముననో అతని నుదుటిపై కళంకము సంప్రాప్తించి నది. దేవతలు అతనిలోని అమృతమును దోసిళ్ళకొద్ది తోడుకొని త్రాగువారే కాని అతని నొసటి మసిపూతను తుడిచివేయుటకు ప్రయ త్నించలేదు. ఎవరిస్వార్థము వారిది. తనకొడుకు దుర్దశ కన్నకడుపునకు దుర్భరముగా నున్నట్లు ఇతరుల కేల యుండును. కడలి తనకొడుకు ఫాల మందలి పంకమునుచూచి భరించలేకపోయినది. తన కరములతో కడిగివేయుటకు ఉవ్వెత్తుగా పొంగినది. ఎంతటి నిసర్గ రమణీయమైన ఊహాచిత్రమిది. ఇట్టి వైచిత్రి నన్నెచోడునికి వెన్నతోబెట్టినవిద్య యనిపించును. హరగిరిజ లఖిలామరపరివృతులై జలకేళిజరిపిన ఘట్టమున నన్నెచోడుడిట్టి కల్పనాత్మక వాక్చిత్రము నందించినాడు. హరుడు కను గీటగా సురసతు లింద్రునిపై నీరు చల్లిరట. అపుడతడు నీటిధాటికి తట్టు కొనలేక కనులు మూసికొనెను. మరి ఇంద్రునికి రెండుకనులు మాత్రమే మూయుటకాదుగదా. సహస్రాక్షుల రెప్పలెల్ల వ్రాలవిడిచి వానలో

తడిసిన పించముగల మయూరంమువలె ఉన్నాడట మహేంద్రుడు. ఇట్టి కల్పనలు కావ్యమంతట పురివిప్పిన నెమిళ్ళనలె కన్పించుచుండును.

నన్నెచోడుడు ఒకవైపు హిమాచలోత్తుంగ కల్పనలు చేయుచు మరొకవైపు పైరుపచ్చలపై జుమ్మని వీచి హాయిగొల్పు పైరగాలివంటి భావనలు కనబరచును. గ్రీష్మమును వర్ణించుచు నన్నెచోడు ఢీరకముగా భావించెను.

"తలచిన డెందము కందును
పలికిన నోరెల్లపొక్కు- ప్రభసూచిన రె
ప్పలు కమరుననగ పటుతర
విలయానలభాతి నెండ వేసవిగాచెన్"

వేసవియెండల చండిమ నెంత సుకుమారముగా వర్ణించినాడు. ఈ పద్యముకన్న ముందుగా వ్రాయబడిన "స్ఫురదురుదావపావకము, శోషితసింధుచయోదికంబు, సంహరిత పతంగ సంఘము" అను పద్యము లోని సమాసములు సాధించలేని అగ్ధపుష్టిని భావనామయమైన పై పద్యము సాధించినది. లోకమున నెండలో తిరిగినచో కాళ్ళు బొబ్బ లెక్కును. కాని నన్నెచోడుడు ఎండను తలచినంత మాత్రమున డెందము కందిపోవు ననును. అంతేకాదు "ఎండ" అను పదము ఉచ్చరించినంత మాత్రమునకే నోరు పొక్కిపోవునని బహుసుకుమారముగా భావించి నాడు. ఈ గ్రీష్మవర్ణనములోనే మరొక పద్యము సుకుమారభావనకు మకుటాయమానముగా నున్నది.

"ఆతపభీతి నీడలు రయంబున వ్రాకులక్రింద దూరెనో
ఆ తరులున్ తృషాభిహతులై తమ నీడలు తారతాగెనో
భాతి నసంగ నీడ లురుపాదపమూలములందడంగె గ్రీ
ష్మాతత మధ్యవాసరములందు చలింపకయుండు నెండలన్"

ఇందులో గ్రీష్మర్తువులోని మధ్యాహ్నపు టెండ వర్ణితము మధ్యాహ్న వేళ సూర్యుడు నెత్తిమీదకువచ్చును. నీడలు చెట్లక్రిందికి చేరును. ఈ యథార్థమును ఎంతో సుకుమారముగాభావించి హేతు జిజ్ఞాసువగుచున్నాడు నన్నెచోడుడు. చివరకు చిత్రమైన భ్రాంతిలోపడి నాడు. ఎండవేడిమి భరించలేక నీడలు పరుగెత్తుకొనివచ్చి చెట్లక్రింద దూరినట్లున్నవి. నీడలకుగూడ ఎండయనగా అంత భయమువేసినది. నిజమునకు నీడలకెండయెక్కడిది? ఒక నిమిషముసేపు దానిని మనము మరచిపోవలె. సరే. నీడలు తమకాప్తులైన తరువుల శరణుచొచ్చినవి. ఆ తరులెంత ముష్కరములు. దప్పితో అవితడబడుచున్నమాట నిజమే. అంతమాత్రమున శరణుచొచ్చిన దీనులను మోసగించవచ్చునా? అవి నిర్దయగా తమనీడలను తామే త్రాగివేసినవట. నీడలు నీళ్ళవలె కన్పించుటగూడ సహజమే. ఇంతటి పద్యనైనభావన నన్నెచోడునిది. కడకు తేలినదేమి? గ్రీష్మకాలమున మధ్యాహ్న వేళ నీడలు తరువుల మూలము లందు చాలసేపడగియున్నవి.

నన్నెచోడుడు కేవలము ప్రకృతిలోని బాహిరస్వరూపచిత్రణమే చేయలేదు. సినిమాబొమ్మనలె క్షణములో అనేక వికారములుదాల్చు చిత్తవృత్తులను మెత్తగా మెలకువతో చిత్రించినాడు. చిత్తవృత్తిని చిత్రించక కేవలము కాయికస్వరూపమును గీసినవాడు ఉత్తమకవుల జాబితాలోన చేరడు. మనస్తత్వ నిరూపణమున మన తెలుగుకవులలో తిక్కన, సూరనలు పేరుమోసినారు. వీరిర్వురికన్నముందే అట్టికీర్తిని తెలుగుకావ్యములందు ప్రవేశపెట్టిన జెట్టి చోడుడు. బహిరుముఖములుగా ప్రసరితములగు మనోవృత్తుల కీతడు శాబ్దికతను కల్పించినాడు. సంశయాత్మని చిత్తవృత్తుల నీతడు నిరూపించినతీరు చూడుము.

ఇంద్రుని ఆదేశముప్రకారము మదనుడు మహేశ్వరుని జయించుటకు బయలుదేరెను. అంతకుముందు రతీదేవి అతనిని వలచని ఎంతగానోవారిం చెను. "ఉగ్రనుగ్రలోచనోద్భూతవహ్నికి నెదిరినిలువ నీకు నెంతకొలది"

యని ఆక్షేపించెను. ''అతనికి నమ్మ్ పాశుపత మంటిన కండెడు పువ్వులమ్మ్మసీ'' కని యెత్తిపొడిచెను. అయినను స్వామికార్యధురంధరుడును, నిజవిజయ గర్వితుడునగు మదనమూర్తి పుష్పాయుధుడై, పుష్పరథారూఢుడై ఆమని చెలికానితో శుకపిక పరివారముతో జైత్రయాత్రసాగించెను. అంత నల్లనైపుల అకాలవసంత మలమికొనెను. మన్మథునికి మాకందవృక్ష మిామాదిరిగా కన్పించును.

''పలకెడు కారాకు లలితాస్థిచయముగా
సోలు కొమ్మ్మలు పలుకేలు గాగ
బాలపల్లవములు వ్రేలుకెంజడలుగా
పెనగు తీగలు దొడ్డఫణులు గాగ
కలకంఠనికరంబు గళమున కప్పుగా
పుష్పాడి మేని విభూతి గాగ
ఫలములు వరదానఫలములుగా ఆలి
మాలికల్ రుద్రాక్షమాలికలుగ
శంభుమూర్తిదాల్చి సహకారభూరుహ
చక్రవర్తి నవవసంతవేశ
నతిశయిల్లుచుండె—''

మామిడిచెట్టు మహాశివునిరూపులో కన్పించినది. మహాశివుని సర్వాంగములపోలికలు మాకందములో ముద్రితములైనవి. పండుటాకులు ఎముకలవలె, కొమ్మలు చేతులవలె, చిగుళ్ళు జడలవలె, కోకిలలు కంఠకాళిమవలె, పుష్పాడి విభూతివలె...దేనికది కన్పించి మొత్తము చెట్టును చూచువరకు మూడనకంటివాడు మూర్తీభవించినట్లయినది. కుసుమాస్త్రుని గుండె గుభేలుమన్నది. రతీదేవియన్నప్పుడు తాను లెక్కచేయలేదు. ఉగ్రలోచనుశక్తియా తనకు తెలియనిదికాదు. అయినను పెండ్లము ముందు పిరికిపడువాడుండునా? నిష్కంపముగా బయలుదేరినాడు. లోపల గుబగుబమనుచునేయున్నది. సంశయాత్మకునికేకదా రజ్జుసర్పభ్రాంతి. సందిగ్ధచిత్తుడైన చిత్తజునికి మామిడిచెట్టు మహాశివునివలె కన్పించినది.

''అక్కడగని మది నుదరిపడి మనోజు''హోసరిల్లినాడు. ఇదేమని కమురెప్ప లల్లార్చినాడు. మరునికి మరునిమునమున మామిడిచెట్టే మాదిరిగా కన్పించి నది.

''అలరుల మందహాసమున అన్నిన షట్పదమంజుగీతి రా
చిలుకల మురుమాటలను చెందలిరాకుల రాగలీల తో
కిల నినదంబులన్ బరిహి కేళభరంబున ముక్త పర్ణమే
ఖిల నభిరామయయ్యె సహకార లతాంగి మధుప్రసంగతిన్.''

మదనుని సంశయము మంచుపొరవలె కరిగిపోయినది. సహ కారము మొలనూలు జారిపోవుచున్న ముద్దరాలివలె కన్పించినది. మనసు లోని కలవరము మాయమైనది. ఇంతేకదా అనుకొన్నాడు. మంచహాస ముతో మరల మాకందమును తేరిపార జూచినాడు. అప్పుడు :

''తలిరెల్లి పూవుటమ్ములఁ
బలసిన పికకీరభృంగపరివారముతో
వలరాజుబోలి మామిడి
సలలితగతి నుత వసంతసంగతి నొప్పెన్.''

మరుడు విస్మితుడగును. ఆమ్రతరువు అచ్చము తనవలెనే కన్పిం చెను. చిగురు గొడుగులతో, పూవుటమ్ములతో, శుకపికభృంగ పరివార ముతో ముమ్మూర్తుల తనవలెనే అగుపించెను. ఇంకను 'తనవలెనే' యేమిటి? మరుడే మాకందము. మాకందమే మరుడు. ఈదృశముగా నన్నెచోడుడు సంశయాత్మని మనోవృత్తులను ముక్తసరిగా ముచ్చటగా చిత్రించినాడు.

ఆందోళిత మనస్సునొక్క- భిన్నావస్థలనుగూడ నన్నెచోడుడు విన్నాణముతో వర్ణించినాడు. కామదహనమైనది. శివనిష్ఠమైన పార్వతీ కామము మాత్రము నేలోసిన నిస్పువలె భగ్నమన్నది. ఆమెలో విరహ

తాపము ముంచుకొనివచ్చినది. గాయపడిన ఆమెయెదకు ప్రకృతిలోని ప్రతివస్తువు భయోత్పాదకమైనది. విరహావివర్ధకమైనది.

"ఫలులకు నుల్కా మందమలయానిలుడన్న భయంబు సెందు కో
యిలలకు బెగ్గడించు కడు నేచిన మావిడి సూడనోడు రా
చిలుకలకుల్కా కామునడని చెప్పిన తల్లడమందు నిండు వె
న్నెల గని సొమ్మబోవు ధరణీధరనందన కామవేదనన్."

ఆమె ధరణీధరనందన — అయిననేమి? మదనశక్తికి గొండబు
ద్ధైతము బెండులవలె తేలిపోనును. కుసుమాంగియైన ఆమె యెంత?
పై పవ్యమున ఆమెను భయపెట్టిన వస్తుసామగ్రి సూలమైనది. సర్వులకు
గోచరమయ్యెడిది. ఇక ఆమె రెండవతీరు అవస్థ.

"కలకలనవ్వినట్లు తమకంబున కర్ణవవిచ్చి భ్రూలతల్
సొలయగ జూచినట్లు తనివోవగ తెల్వియు కాగలింప చే
తులు పచరించునట్లు దయతో రతికేళికి నప్పలించు న
ల్లెలమి నటించుచుండె సతి కీశ్వరు రూ పెదురన్ ప్రసన్న మై."

ఈ రూపు మృగతృష్ణవంటిది. ఇది లోకమునకు కన్పించదు. పార్వతి మనోనేత్రమునకు మాత్రమే కన్పించునది.

మనస్సులో జరిగిన మార్పులను మాటలలో పొదుగుట ఒక గొప్ప నేర్పు. మనస్సులో వికారములు కలిగినప్పుడు దైహిక చేష్టలను వర్ణించుట, మానసిక దైహికచేష్టాసమన్వయమును చిత్రించుట శంకను గొప్ప నేర్పు.

మహేశ్వరుడు మదనబాణవిద్ధుడగును. ఆ క్షణములో అతని మదిలో కదలిన మధుర వాంఛలను, అతని శరీరములో విద్యుత్తువలె చొరబారిన సంభ్రమభావమును నన్నెచోడు డీ సీసములో పూసగ్రుచ్చినట్లు చెప్పినాడు.

"పులకాంకురమ్ములు తలలెత్తి మేను కం
పింప కోమలి కాగిలింపదలచు
రాగోత్కటమున సైరణలేక మానిని
కాయ్యున పైబడి కవయదలచు
లలితాంగి అవయవముల జూచి మది తని
వోవక చూడ్కుల త్రావదలచు
అధరోష్ఠ మదరంగ అంతఃస్మితాంశులు
తలుకొత్త నేమేని పలుకదలచు
తనమహత్త్వంబు తలపక తరుణిపొందు
వడయ కీడ్వడి తేకువ వాపదలచు
భావజాస్త్రాభిహతి మహాదేవు డొక్క
వ్రేలిమిడి పెంపుసెడి కడు విరలిగొనియె."

ఒక్కత్రుటిలో ఇన్నివిధములుగా కదలిపోయినాడు శంభుడు. తన మహత్త్వంబును మరచిపోయినాడు. తరుణిపొందుకై పరవళ్లు త్రొక్కిన దాతని మనస్సు. ఆమె అవయవ లావణ్యమును చూపులతోనే త్రాగ దలచెను. ఆమెతో అంతఃస్మితాంశులు తళుకొత్త ఏమేని పలుకదలచెను. చూపులతో త్రాగుట, ఏమేని పలుకుట...ఎంతటి సభ్యశృంగారము. ఈ పద్యమును మాటలతో వివరించుట అసాధ్యము. అది భావయిత్రీ ప్రతి భకు మాత్రమే ఆస్వాద్యము.

నన్నెచోడు డంతట ఊహాజనిత చిత్రినే ఆలంబనముగా స్వీకరించ లేదు. ఎల్లప్పుడు కల్పనాశక్తిని, ఊహాజనిత చిత్రిని కనబరచుట దప్పి గొన్నపుడెల్ల త్రాగుటకు తేనె యందించినట్లుగా నుండును. మధ్యమధ్య మంచినీరందినచో పానయోగ్యముగా నుండును. నన్నెచోడుడు ఈ తెన్నునే అనలంబించెను. కల్పనలకు, ఊహలకు అనకాశము కల్గని సంవర్భములందు ఉక్తివైచిత్రి నూతగా స్వీకరించినాడు. పొడిపొడి మాట లను చిత్రముగా త్రిప్పిత్రిప్పి చెప్పి చమత్కారమును ప్రతిపాదించినాడు. చిత్తవిద్రుతికి చమత్కారమే మొదటిమెట్టుకదా! వసంతర్తునర్ణనలో

నన్నెచోడుడు పలుపోకలు పోయినాడు. అలంకారములతో ఆడుకొన్నాడు. మాటబొమ్మలతో మాట్లాడినాడు. స్వభావోక్తులతో సరసమాడినాడు. ఊహలతో ఉయ్యాల లూగినాడు. అయినను ఉక్తివై చిత్రిని మరువలేదు. వసంతములో పూచిన వృక్షముల పట్టిక యివ్వనలె ననుకొన్నాడు. వట్టి పట్టిక యిచ్చుట కవి చేయవలసిన ఘనకార్యమా?

"పొన్నలుపూచె పొన్న లొగి పూవకముందఱ పూచె గోగు లా
పొన్నలు కొండగోగులును పూవకముందఱ పూచె బూరుగుల్
పొన్నలు కొండగోగులును బూరుగులు నొగ్గి పూవకుండగా
మున్న వనంబునన్ కలయ మోదుగు లొప్పుగ పూచె నామనిన్."

పద్యము ప్రారంభించినప్పుడు పొన్నలు మొదట పూచినవను అభిప్రాయము కలుగును. కాని ముగించువరకు మోదుగులే మొదట పూచినవని తేలిపోవును. ఇది సామాన్యమైన అభిప్రాయమును తిరుగుడుగా చెప్పు పద్ధతి. పద్యము "మోదుగులు పూచె"నని ప్రారంభించిన-చో సొగసుండదు. ఇంతేనా అనిపించును. "నేతి నేతి" యని చెప్పుటయే సుందరమైన రీతి.

మరుడు నిటలాంబకుని కోపవహ్నిలో మసియైపోయినాడు. మార దహనము నిమిషమాత్రమున జరిగినది. అప్పుడే ఎట్లు కాలిపోయినాడను సందేహము కల్గించు విధముగా జరిగినది. ఈ అభిప్రాయమును వ్యక్తీకరించుటకు నన్నెచోడునికి ఉక్తివై చిత్రి ఉపస్కారకమైనది.

"కని కోపించెనొ కానక
మును కోపించెనొ మహోగ్రముగ నుగ్రుడు చూ
చిన కాలెనొ చూడక యట
మును కాలెనొ నాగ నిమిసమున నఱగాలెన్."

నన్నెచోడుడు కుమార సంభవమున నవరసములను పోషించినాడు. శివపార్వతుల సంయోగ సందర్భమున శృంగారము, తారకునితో కుమార

స్వామి చేసిన యుద్ధఘట్టమున అద్భుత వీర భయానక బీభత్సములు, దక్షాధ్వరధ్వంస సందర్భమున రౌద్రము, రతీవిలాప ఘట్టమున కరుణము, శివతపోనిషను వర్ణించు పట్టున శాంతము సందర్భశుద్ధితో వర్ణించెను. శివపార్వతుల జలకేళీ సందర్భమున హరుడు కనుగీటగా సురపతు లింద్రు నిపై నీరుచల్లిరనుపట్టున సున్నితమైన హాస్యరసమును పోషించెను. దక్షాధ్వరధ్వంస ఘట్టమున ఇతడు ప్రదర్శించిన వికృతహాస్యము విలక్షణ మైనది. శివేతరదేవతాహేళనమున కీతడు వికృతహాస్యము నాలంబన ముగా తీసికొనెను.

"వాహనంబు నెక్కివచ్చి భయంబున
వడకి నేలబడ్డ వనజగర్భు
గమిచికొని మరాళకమువారె చెందమ్మి
గఱచికొని రయమున పఱచినట్లు"

ఇందులోని హాస్యము ఇంచుక వికృతమైనను గిలిగింతలు పెట్టు నట్టిది. హంసకు తామరతూడు ప్రియమైనది. తామరగర్భుని అది తొంచ రలో తామరతూడువలె ముక్కున కఱచికొని పోయినదన్న అసహజము కాదు.

"ఉరుతరాబ్ధీశుడయ్యును ఓడిపారె
వరుణు డలుకుచు నోడిక వాగువోలె
కలుములెడలైన నేమియు నిలువవనుట
తగభయాతురుడై నోర తడియులేక"

వరుణుడు అబ్ధీంద్రుడు. అయిన నతడు నిమ్నగవలె పరుగెత్తుకొని పోయినాడు. వరుణుడనగా వానదేవర. అయిన నతడు నోటిలో తడి లేకుండ పారిపోయినాడట. భయభ్రాంతులు కలిగినప్పుడు నోటిలో తడి యెండిపోవుట అనుభవ సిద్ధము. ఏ దేవతకో నోట తడిలేదని పేరొక్క న్నచో అది ఒకతీరుగా నుండెడిది. వర్షాధిదేవతయైన వరుణునికే ఈ యవస్థ పట్టినదనుటలో వ్యంగ్య గర్భితమైన హాస్యము తొంగిచూచినది.

ఈ శ్రేణిలోని పద్యములలో చివరిది; హాస్యభేదములలో చరమమైన అతిహసితమును కల్గించును.

"తనయొక్కాన మానిసి తా
ననయసునెక్కంగ మరచి యాతని తనమూ
పున నిడుకొని పఱచె భయం
బున ధనపతి తన్ను పిఱుద భూతములార్వన్"

కల్పనాశక్తికి పరిశీలనశక్తికి నింగికి నేలకుగల అంతరముండును. ఉన్నదున్నట్లుగా చెప్పుట కాల్పనికరీతికి సరిపడదు. ఎట్టైన ఊహ, అపూర్వ భావ చిత్రములు, అలౌకిక సుందరతాసందర్శనము కల్పనాశక్తికి తోబుట్టువులు. పరిశీలనశక్తి దీనికి బొత్తిగా భిన్నము. కవి లోకమును వ్యక్తులను బాగుగా పరిశీలించిచూచి యథాతథముగా చిత్రించ వలసియుండును. నన్నెచోడునిలో నిబిడ కల్పనాశక్తితోపాటు నిశిత పరిశీలనశక్తిగూడ కలదు. వసంతుడు తెచ్చిన పూవుతేరిని వర్ణించు పట్టున ఆతని సూక్ష్మ పరిశీలనశక్తి ప్రస్ఫుటమైనది.

"పంకరుహంబులు బండికన్నులు చంప
కంబులు నొగ లుత్పలంబు లిరుసు
కరవీరములు పలుకాడి జాదులు సను
గొయ్య లశోకముల్ గోడిపేంట
సింధువారంబులు సీలలు కేతకుల్
మెట్టులు మొల్లలు మెట్టుగుదెలు
పొగడలు పలుపులు పున్నాగములు పగ్గ
ములు సహకారముల్ పూనుగాడి
కురవకానీకమూలపుకోల కైర
వములు మునుకోల కోకముల్ వాహనములు
గా వసంతుండు సూతుడై పూవుతేర
నెరయ కుసుమాయుధంబులు నింపి తెచ్చె."

ఈ పద్యములో రథమునకు సంబంధించిన స్వల్పాతిస్వల్పమైన అంగములను సైతము చేర్చినాడు. లోకములోని ప్రతివస్తువునకు సంబంధించిన సర్వ వివరములు కవికి తెలిసియుండవలెను. నన్నెచోడు డే వస్తువును వర్ణించినను సమగ్ర పరిశీలనశక్తి వ్యక్తమగుచుండును.

మన పురాతనాంధ్రకావ్యము లన్నియు రూఢములుగా నిర్ణయింప బడిన కవిసమయములను పాటించినవే. నన్నెచోడుడు పాత కవిసమయములనే స్వీకరించెను. అయినను తన ప్రతిభచేత వానికి మెరుగులుదిద్ది క్రొత్త తీపిరి పోసెను.

"తఏవ పదవిన్యాసాఃతాఏవార్థ విభూతయఃతథాపి నవ్యం భవతి కావ్యం గ్రథనకౌశలాత్"

ఈ గ్రథనకౌశలము కల్గిన నన్నెచోడుడు మూగిపోయిన కవి సమయములను స్వీకరించి వానిని "మధుమాస ఇవ ద్రుమాఃi" చేసినాడు. విరహసంతప్తయైన గిరిజను ఆత్మసఖులు ఈ విధముగా ఊరడింతురు.

"బాల నీ వేనలి కాలోరగంబని
మలయానిలంబు నీవలన రాదు
కమలాస్య నీ కనుగవ చకోరములని
వెన్నెల సొరదు నీయున్న రాడకు
అబల నీ నెలుగు పికారావమని నీకు
చూతమ్ము కొమ్మలు చూపవెఱచు
చపలాక్షి నీ మొగ్గ- చంపకమను భీతి
అలులు నీ పొడగని అలయబాయు
వనిత నీకు ప్రాణవల్లభుండై మది
నొలసె శివుడు పాయకుండుననియు
వేదమరు శరములు నీ చెర రానోడు
పిని కేల నీవు వెఱచెదమ్మ."

జడను కాలసర్పముతో పోల్చుట కవి సమయము. పామునకు పవమానమాహారమనుటయు కవి సమయమే. ఈ రెండు సమయములను ఒకచోట చేర్చి ఊహించినాడు నన్నెచోడుడు.

ఒక క్రొత్తభావము వ్యక్తమైనది. మలయానిలమామెవైపు రాకుండుటకు కారణమామె వేణీభరము. సద్యఃస్ఫురణము కల్గించు భావము కాదిది. ప్రాచీనకవి సమయములను నెమరు వేసుకొన్నచో తప్ప దీనిలోని ఆత్మ ఆవిష్కృతము కాదు. ఈ దృశ్యముగనే ప్రతి పంక్తిలో ఒక కవి సమయమును ప్రవేశపెట్టి నూత్నత్వము ప్రతిపాదించినాడు. అందఱెరిగిన కవి సమయములనే అందముగా వాడినాడు. అతడుపయోగించుకొన్న రీతిలో ఉన్నది వైచిత్రి.

నన్నెచోడుడు కొన్నిచోట్ల వర్ణనలకొరకే వర్ణనలు చేసినట్లు కన్పించును. దక్షుడు శివనింపచేయుట సహించక సతీసాధ్వి కోపాగ్నిలో కాలిపోవుచుండును. ఆమె ''లక్కబొమ్మ నగ్గలమగువహ్ని చుట్టుకొని కాలురయంబున'' జ్వలించిపోయినదనుట సహించగలము. గాని ''ఆశోక వల్లి విరిపువ్వులమోద గ్రాలు కెందలిరులో'' అన్నట్లుగా అగ్ని జ్వాల లెగసినవి అనుట సహించలేము. మహోద్విగ్నయై అమె మండిపోవుచున్న ప్పుడు ఇంత తీయగా వర్ణించుట ఔచిత్య బాహ్యము. అన్ని తావులందు వర్ణనలు, అలంకారములు జొన్పిన-చో ఔచితికి చితిపేర్చినట్లగును. ఔచిత్య పోషణలేని-చో అలంకారములు, వృత్తులు, గుణములు కేవల బాహ్య శోభా హేతువులే. ఆత్మకానేరవు. అందుకే ''ఔచిత్యస్య రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం'' అని క్షేమేంద్రుని మతము. ఈ ఔచిత్యము పద, కావ్య, ప్రబంధ, రసాలంకారాది నిష్ఠమని క్షేమేంద్రుడు అభిప్రాయ పడెను. ఆనందవర్ధనుడు సైతము ''అనౌచిత్యాదృతే నాన్య ద్రసభం గస్య కారణ'' మనియు ''ప్రసిద్ధౌచిత్యబంధస్తు రసస్యోపనిషత్పరా'' అనియు వెల్లడించెను. ఈ ఔచిత్యమును నన్నెచోడుడు వర్ణనల విషయములో ఎట్లు నిరూపించినది మాత్రమే ఇక్కడ పొందుపరుతును.

"శివుతనయు బలపదాహతి
కవిసిన మెయి ధూళివోవ కడిగికొనంగా
తివిరి చను కరణి నిజనుతి
రవి రయమున పశ్చిమాంబురాశికి జనియెన్."

కుమారస్వామి తారకాసురునిపై జైత్రయాత్ర సాగించుచున్న ఘట్టము. అతని సైన్యములు నడువగా లేచిన ధూళి సూర్యుని మెయి నిండ నిండినది. ఆ దుమ్మును కడుగుకొనుటకై సూర్యుడు అపరాబ్ధికి వెడలుచున్నాడని నన్నెచోడుని ఉత్ప్రేక్ష. సూర్యాస్తమయ వర్ణనము నించుమించు పురాతనాంధ్రకవు లందరు చేసిరి. అయితే ఆ వర్ణనలు కథకు గానీ, ఆయా సన్నివేశములకుగానీ ఎంతవరకు మెరుగుపెట్టిన వనునది విచార్యము.

అల్లసానిపెద్దన మను చరిత్రలో సూర్యాస్తమయ వర్ణనలో ఒక చక్కని ఉత్ప్రేక్ష చేసెను. అయితే అది అన్యకాంతను త్రోసిపుచ్చిన పగమభాగవతోత్తముని మహాసురాధముడుగా చిత్రించినది. కామాంధురాలై కవయవచ్చిన వేల్పువెలదిపై సానుభూతి చూపునదిగా ఉన్నది. అందుచేత పెద్దన బోధించనున్న కథాంశమునకు దెబ్బతగిలినది. నన్నెచోడుడు చేసిన పై వర్ణన వర్ణనకోసమే చేయబడినదికాదు. పైగా ఈ పద్యములోని వర్ణన కుమారుని సైన్యోద్ధతికి దోహదకారిగా ఉన్నది.

అలౌకిక ప్రతిభావంతుడైన కవి ప్రకృతిని అనుకరించినను స్వచ్ఛంద తను విస్మరించడు. చిల్లపెంకులను సైతము స్వర్ణకణికలుగా చిత్రించును. కవి కేవలము సుందర వస్తువులనే వర్ణింపడు. సన్నివేశమునకు వన్నె దెచ్చినచో జుగుప్సావహాములైన విషయములనుగూడ మహోత్సాహ ముతో వర్ణించును. ఉత్తమ కవి బీభత్సనర్ణనము చేసినను సామాజి కులకు వెగటు కలుగదు. రమణీయతనే ప్రతిపాదించును. ధనంజయుడు దశరూపకములో ఈ విషయమే విశదీకరించినాడు.

''రమ్యం జుగుప్సితముదార మథాపి నీచం
ఉగ్రం ప్రసాదిగహనం వికృతంచ వస్తు
యద్వాప్య వస్తు కవి భావక భావ్యమానం
తన్నాస్తియన్న రసభావ ముపైతిలోకే''

కవి భావనాప్రపంచమున సమస్త వస్తుజాలము సౌందర్యమున కాలవాలము. నన్నెచోడకవి ఈ అభిప్రాయమున కాయువుపోసెను. బీభత్సరస ప్రతిపాదన సందర్భమున రమణీయతనే ప్రదర్శించెను. ఆ పట్టులలో రీతి సైతము వైదర్భియే. ఇతని ''రమణీయ భయానకమే'' తిక్కన పెక్కుతావుల అనుసరించెను.

''ఉరుపాశములు మృదుకరపాశములు గాగ
చక్రముల్ పృథుకటిచక్రములుగ
బాణముల్ నుతదృష్టిబాణమ్ములుగ కార్ముక
కమ్ములు భ్రూకార్ముకములుగాగ
మండలాగ్రము లాస్యమండలమ్ముగ కుంభి
కుంభముల్ గురుకుచకుంభములుగ
వజ్రముల్ సితదంతవజ్రములుగ తత్ప్ర
ఘట్టన పటురతి ఘట్టనముగ
విక్షతములు బహునఖక్షతములు గాగ
రక్తిరసము వొడము రాగరసము
గాగ సుభటవరుల కవిసి రణాంగన
ప్రౌఢి మెరసిచేసె పరవశులుగ.

ఈ పద్యము చదివినప్పుడు ఏదో యుద్ధమునువర్ణించినట్లుగా అని పించదు. శృంగారక్రీడ మాత్రమే స్ఫురించును.

మానవల్లి రామకృష్ణ కవిగారి అభిప్రాయముప్రకారము ఉద్భటుడు శ్లేషప్రియుడు. నన్నెచోడుడతని ననుకరించియున్న చో శ్లేషలను కొల్లలుగా

దిగుమతిచేసెడువాడే. రెండుమూడు తావులలోతప్ప చోడుడు శ్లేషను చవిచూపలేదు. పార్వతి శివునిగూర్చి తపస్వినిగా మారినది.

"మేని కుంకుమరాగంబు మెలత కొప్ప
మోవి తాంబూలరాగంబు మొగినవాసి
చాగుతరయయ్యె చూడ నాశైలతనయ
వీతరాగంబు ప్రకటించు విధమువోలె."

ఇందులో "వీతరాగము" ఉదాత్తమైన శ్లేష.

శక్తిమంతమైన సమాసచాలనము నన్నెచోడునికి నల్లేరుపై బండి నడక. అవతారికలో ఇతడు "జాను తెనుంగును"ను ప్రస్తుతించినను, దేశీయమార్గము చుంచుదువ్వినను, సంస్కృత ప్రభావమునుండి తన్ను తాను విడిపించుకొనలేకపోయినాడు. పసగల తెలుగుపలుకుబళ్ళను ఎంతగా ప్రయోగించుటకు ప్రయత్నించినను సుదీర్ఘ సంస్కృత సమాసములను గుప్పించక తప్పలేదు. అచ్చుమైన కవి ఆత్మ నిర్బంధములకు, నియమములకు దాసోహమనదు. కవిత్వము 'సివము' వలె ఆవహించినప్పుడు కవి తాను సంస్కృతపదము ప్రయోగించుచున్నాడా తెలుగునుడిని గిలుకుచున్నాడా ఆలోచించడు. నన్నెచోడుడు వర్షబుతువును మనోమండలములో సాక్షాత్కరించుకొనెను. వడగండ్లవంటి శబ్దములు లేఖినీముఖాన ఉద్గతములైనవి.

"గత సంతాపము, శీతలీకృత మహీకాంతాంగ మత్యుద్గత
స్మిత కుందోత్కర కేతకీ కుటజ రాజిభ్రాజి తామోద మూ
ర్జిత వల్లీ ప్రకరంబు వర్ధితశిఖిశ్రేణి ప్రమోదంబు ర
మ్యతరంబై కుతలంబనంబరగె వర్షారంభ మత్యున్నతిన్."

మన్మథుడు మహాదేవుని సందర్శించినప్పుడు నన్నెచోడుడు వేసిన సమాసములు మనోరంజకములైనవి.

"స్ఫురదాధార సరోజపీఠహృదయాంభోజాత రంధ్రార్పిత
స్మరణాయత్త సముద్ధితోజ్జ్వలతరాత్మ జ్యోతిరుద్భాంగరుక్
సరసస్ఫాటికరమ్య హర్మ్య కనక స్తంభంబో నాపర్యు అ
త్యురు జూటాకృతినున్న శంభుచెప వోనుల్కొన్ మనోజుం డెదన్."

సమాసముకన్న మిన్నయైన భావము-భావమును తలవన్నిన సమాసము. ఈరీతి సమాసరచనను తరువాత నాచనసోముడు, కృష్ణరాయలు, తెనాలి రామకృష్ణుడు అనుసరించిరి.

సమాసచాలసముతోనే సంతృప్తిపడక నన్నెచోడుడు సంవర్ధిచితముగా చక్కని తెలుగు పలుకుబడులను ప్రయోగించినాడు. "తుత్తుమురుగొని ప్రేలుట, ఒడలుమండుట, ఎలుకమీవ కోపమున ఇల్లేల్చుట, కనుగీటుట, నోరుపొక్కుట, ప్రక్కలువిఱుగ నగుట, వసివాళ్ళులువాడుట, పలుచనిపూతలు, కూలిచూలి, జున్నుదిన్నయొట్టియు, ఒక్కతలకు మొగములు రెండగుట, నోటికండ, పాలపాప, దండుగు, పందిరిపై ఉప్పుగండలెండబెట్టుట మున్నగు జాతీయములు, సామెతలు, పలుకుబళ్ళు కొల్లలుగా ప్రయోగించినాడు.

బహుముఖప్రజ్ఞాశాలియై, కవితారంగములో ఎన్నిపోకలుపోవలయునో అన్నిటిని రాజకీతోపోయిన నన్నెచోడుని తదనంతరాంధ్రకవులనేకులు అనుకరించినారు. అయినను అవతారికలో ఆంధ్రకవులను స్తుతిచేసినప్పుడు గూడ పల్కారు నన్నెచోడుని పేరైనఎత్తకపోవుట దురదృష్టము. తిక్కన రమణీయ భయానక చిత్రణము, మనస్తత్వనిరూపణము విషయములో నన్నెచోడుని అనుకరించెను. యుద్ధఘట్టములను చిత్రించుటలో తిక్కనకు నన్నెచోడు డెంతో ఉపయోగపడినాడు. పాలకురికి సోమనాథుడు పదప్రయోగములో, వ్యక్తీకరణములో నన్నెచోడుని దండిగా అనుకరించెను. నన్నెచోడుని "రోహణాచల" అను పద్యమును పండితారాధ్య చరిత్రములో "పర్వతప్రకరణము"న అనుకరించెను. పోతన

అంత్యానుప్రాసములు, అనుప్రాసములు నన్నెచోడుని పద్ధతిలోనే ప్రయోగించెను. నన్నెచోడుని

"పుష్కర షండములో గల
పుష్కర మూలములుగ బలముల గొనుచున్ స
త్పుష్కరతలముల మునుమిడి
పుష్కరముల బెఱికివైచు పుష్కరమునకున్"

అను పద్యమును చదివినపిమ్మట పోతన్నప్రాసిన క్రింది పద్యము చదివి నచో బింబప్రతిబింబ భావము స్ఫురించును.

"తోయములు బెమ్మి మాకీ
తోయము వేటాడ వెరవు దొరకదు ఘనచే
తోయత డప్పి జనించెను
తోయమువారలను లేరు దుస్సహమనఘా."

ఇంతేకాక నన్నెచోడుడు ప్రయోగించిన

"హారము లాశ్రితభాషా
సారము లాసకలవస్తు సంపూర్ణాలం
కారంబులు శ్రీవర్ణా
కారంబులు చెవులు సుకవి కావ్యమువోలెన"

వంటి పద్యములు పోతనాదులలో పలుచోట్ల కన్పించును. పైవారేకాక నన్నెచోడుని జక్కన, మంచన, నాచన, పింగళిసూరన, రామకృష్ణుడు మున్నగువారు అలతిగా అనుసరించిరి.

నన్నెచోడునిపై ఇతర కవుల ప్రభావము ప్రబలముగానేయున్నది. ఏ మహాకవియు తనకావ్యమును ఐంద్రజాలికునివలె అభూతసృష్టి చేయడు. అతనిసృష్టిలో కొంత విలక్షణత, అపూర్వత ఉండవచ్చును. నన్నెచోడుడు కాళిదాసు కుమారసంభవమును పేర్కొనకున్నను ఆ మహాకావ్యమునుండి

కొన్నిశ్లోకముల అర్థమును సంగ్రహించినాడు. కథ చాలవరకు అదేయని వేరుగా చెప్పనవసరము లేదు. కాళిదాసుప్రాసిన

"మధుద్విరేఫః కుసుమైకపాత్రే
పపౌప్రియాం స్వా మనువర్తమానః
శృంగేణ సంస్పర్శ నిమీలితాక్షీం
మృగీ మకండూయత కృష్ణసారః."

"దదౌ రసాత్పంకజరేణుగంధి
గజాయ గండూషజలం కరేణుః
ఆర్ధోపభుక్తేన బిసేనజాయాం
సంభావయామాస రథాంగనామా."

"గీతాంతరేషు శ్రమవారిలేశైః
కించిత్సముచ్ఛ్వాసిత పత్రలేఖం
పుష్పాసవాఘూర్ణిత నేత్రశోభి
ప్రియాముఖం కింపురుషశ్చుచుంబే."

అను మూడుశ్లోకములలోని భావమును నన్నెచోడు ఈవిధముగా అనుసరించెను.

"కరి యిచ్చె నరమేసి కరిణికి సల్లకీ
పల్లవ ముల్లంబు పల్లవింప
మృగ మర్ధి కబళించి మృగి కిచ్చె నంచు ద
ర్భాంకురంబులు చిత్త మంకురింప
హంస పెకుర్కువ నిచ్చె హంసికి నోరోర్నెర
ఎలమూడు మొగముల నెలమి మిగుల
భృంగముద్రావి తో భృంగికిదయనిచ్చె
మధుధార ముఖరాగ మదము దలక
కిన్నరుండు గ్రోలె కిన్నరి వీనుల
రాగరసము మేన రాగమెసగ
మధువిడంబనమున మగలును మగువలు
విరలిగొనిరి మదనపరవశమున."

ఇంకను పూర్వాపీతపస్సందర్భమున ఒకటిరెండు శ్లోకములను అనువదించెను. నన్నయనుసైతము నన్నెచోడుడు స్మరించలేదు. "మార్గసత్కవీశ్వరుల, దేశిసత్కవుల" అని మాత్రము వ్రాసెను. నన్నెచోడుడు నన్నయను అనుకరించిన పట్టులు బహుస్వల్పములు. ఎందుకనగా అతని తీరేవేరు. నన్నెచోడుని ఈ దిగువపద్యము నన్నయ భీష్ముని చరిత్రములోవ్రాసిన "అమల సుధారమ్యహార్మ్యతలముల" అను పద్యమునకు అచ్చమైన ప్రతిబింబముగా భాసించును.

కలహంసకలరవాకలితనిర్ఝరముల
సారససరసాబ్జషండములను
గోలంబరుతి లతాందోలంబులను శుక
మంజులస్వన పుష్పమండపముల
కలకంఠరణిత మాకందవనముల పా
రావతధ్వని మందిరస్థలముల
కేకి కలధ్వాన గిరికందరంబుల
ఆవుక నినద లీలాతలముల
అప్పటిప్పటి కనురాగ మగ్గలింప
కామరస మంతకంతకు గడలుకొనగ
నలి రమించిరి కైలాసనగము మీద
పరమసుఖలీల నా జగత్పతియు సతియు."

ఈ పద్యములోనిభావము, శయ్యారీతి నన్నయవే. ప్రాచీనమహాకవులలో నన్నెచోడునిదొక ప్రత్యేక పీఠము. తొలిసారిగా మతప్రతిపాదనము చేయుటకు కవిత్వమును సాధనముగా స్వీకరించినవాడితడే. ఇతని తరువాత సోమనాథాదులు దానిని బలపరచిరి. పురాణములు తెలుగులోనికి తర్జుమాచేయబడుయుగములో స్వతంత్రకావ్యశంఖమెత్తిన కవిరాజశిఖామణి నన్నెచోడుడు. కేవలము కథచెప్పుటయే కవిత్వధర్మము కాకూడదని, వర్ణనలతో, అలంకారములతో సహృదయాహ్లాదము కల్గించుటయే కావ్యోద్దేశమని ఎలుగెత్తిచాటి, జానుతెనుగునాదరించి, దేశి

సత్కవులను ప్రస్తుతించి కండగల గుండెగల కవిత్వముచెప్పిన కవిచూడుము నన్నెచోడుడు. అయితే ఇతని నాలుక పెదుసు; పలుకుబడి గడుసు. ఇత డెంత తియ్యగా చెప్పినను ఏదోకొంత చిరుచేదు స్ఫురించుచుండును. ఎంత సరళముగా భావమునందించినను ఏదోఒక అస్పష్టత పల్నాటికారమువలె హృదయరసనములకు చుట్టుమని తాకును. ఈ గుణములనలన ఇతనికి రావగినంత గౌరవము రాలేదు. ఇతని మతపాక్షికత తరువాతికవులకు రుచించకపోవుటవలన ఎవరును ఈతనికి అక్షరాభిషేకము చేయలేదు. ఇరువదవ శతాబ్దిలోనైనను విస్మృతకవుల పట్టికలోచేర్చి ఈ కవిరాజశిఖా మణిని ఆంధ్రలోకమున కందించిన మానవల్లి రామకృష్ణకవిగారు సదా స్మరణీయులు. నన్నెచోడుని కావ్యచంద్రుడున్నన్నినాళ్ళు మానవల్లివారి కీర్తిచంద్రిక తెలుగునాట వెలుగుపూతలు పూయును; జిలుగుకాంతులు కాయును.

—:o:—

ద్విపదలలో దివ్యకవిత

ఛందస్సాగరంలో ద్విపద అతి సామాన్య తరంగం. తాలోత్తాలంగా పొంగినడిచే శార్దూలమత్తేభాలముందు పైరగాడ్పువలె ప్రవహించే ద్విపదకు ప్రౌఢసాహిత్యకు లెవ్వరూ ప్రామాణికత నివ్వలేదు. పైగా "ద్విపద కావ్యంబు, ముదిలంజ, దిండిగంత"వంటి నిందాత్మకమైన నానుడులతో ద్విపదను కించపరచడానికి ప్రయత్నం జరిగింది. నిజానికి ద్విపద అచ్చమైన జాతీయఛందస్సు. జాతీయచ్ఛందస్సుకు ఆంధ్రసాహిత్యంలో ఏనాడూ తగినగౌరవం లభించలేదు. ఆదికవి నన్నయ వృత్తాలపై చూపిన ఆదరణ మాత్రాచ్ఛందస్సులపై అణుమాత్రము చూపలేదు. ద్విపదకు ఆమ్రేడితమైన తరువోజనుమాత్రము క్వాచిత్కంగా ప్రయోగించినాడు నన్నయ ఏర్పరచిన మార్గ కవితాఘంటామార్గాన్ని ధిక్కరించడమంటే మాటలుకాదు. అది అంతవరకు ఆంధ్రసాహిత్యలోకంలో సువ్యవస్థితమైంది. నన్నెచోడుడు జానుతెనుగుపై మమకారం కనబరచినా ఛందస్సు విషయంలో నన్నయ మార్గాన్నే అనుసరించినాడు. తిక్కన్న యించుమించుగా ఆ బాటనే త్రొక్కినాడు. ఇలాంటి పరిస్థితిలో పాలుకురికి సోమనాథుడు జానుతెనుగు తేరిపై ద్విపదాచ్ఛందస్సును విప్లవధ్వజంగా స్వీకరించి బయలుదేరినాడు. మొదట సంప్రదాయ సిద్ధంగా 'అనుభవసారము' వృత్తాలలో నడిపినాడు. తరువాత తన వ్యక్తిత్వం నిలుపుకోవడానికి ద్విపదలో మహాకావ్య నిర్మాణం చేయాలనుకున్నాడు. 'అల్పాక్షరముల ననల్పార్థ రచన'కు ద్విపదయే ఉత్తమ సాధన మని విశ్వసించినాడు. కన్నడంలో అంతవరకే చతుష్పదులలో, షట్పదులలో మహాకావ్యాలు వెలుస్తుంటే తెలుగు కవులు వృత్తాలను పట్టుకొని వ్రేలాడడం అతనికి రుచించలేదు. జానుతెనుగు విన్నాణాన్ని, తెలుగు పలుకుబడుల పొంకాన్ని

ద్విపదలో తొడిగితేనే శోభ అనుకున్నాడు. బసవ పురాణము, పండితారాధ్య చరిత్రము అనే రెండు మహాకావ్యాలు ద్విపదలో రచించినాడు. రెండుకాళ్ల ఛందస్సులో దండికావ్యాలు నిర్మించవచ్చునని నిరూపించినాడు. సోమనాథుడు చూపిన తెన్నును బుద్ధారెడ్డి, గౌరన అనుసరించినారు. ద్విపద కవిత్వానికి వీరు మువ్వురూ 'కవిత్రయం' వంటివారు.

ఈ మువ్వురు కవులు ప్రజలలో తమ కావ్యాలు ప్రచారం కావించడానికి పాటకు దగ్గరగా ఉండే ద్విపదను పరమ సాధనంగా స్వీకరించినా కేవలం ప్రచారమే పరమార్థంగా పెట్టుకొని కావ్యత్వాన్ని పలుచబడనీయ లేదు. మహాకావ్య లక్షణాలను అనువైన చోటులందు అతి నిపుణంగా అమరించినారు. వీరిలో బుద్ధారెడ్డి వాల్మీకి రామాయణాన్ని కొలది మార్పులతో అనువదించినాడు. అందువలన అతని స్వతంత్ర కావ్య నిర్మాణ పాటవానికి తగిన అవకాశం దొరకలేదు. సోమన, గౌరనలు మాత్రము ద్విపదలలో దివ్యమైన కవిత నందించినారు.

1. కావ్యానికి అలౌకిక కల్పనలతోపాటు స్వభావ సిద్ధమైన వర్ణనలుగూడా సౌందర్య హేతువులే. ప్రకృతస్థమైన అంశాలు అందరికీ కనిపిస్తవి. అందరికీ కన్పించే అతి సామాన్యమైన అంశాన్నే కవియైనవాడు అందంగా చెప్పుతాడు. అలాచెప్పి ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగిస్తాడు. సోమన బసవపురాణంలో తెలవెలవారు వేళ తొలికోడి కూతను ఇలా వర్ణిస్తాడు.

"తొలికోడి కనువిచ్చి నిలిచి మైపెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున కూలార్చి కంఠంబు విచ్చి
మక్కున నీకెలు చకొక్కల్వి కడుపు
వెక్కించి మెడసాచి నిక్క మిన్నూచి
కొకొక్కరో కుట్టని కూయకమున్న—"

ఇంతటి నిసర్గవర్ణన-ఆంధ్రకావ్య ప్రపంచంలో ఎక్కడోకాని కన్పించదు. పై వర్ణనలో కవి తాను స్వయంగా కల్పించినదేమీలేదు. ఇలాంటి సందర్భాలలో కల్పన బలవంతంగా దూరిస్తే కావ్యానైసర్గికశోభకు భంగం కలుగుతుంది. కోడికూతను — ఆంధ్రకవు లనేకులు అనేక రీతులలో వర్ణించినారు. కృకవాకు కూజితాలను ముద్దుగా వర్ణించినవానిలో ముక్కు తిమ్మన ముందుగా నిలుస్తాడు. ''వినవయ్యెన్ కృకవాకు కూజితము లుద్వేలంబులై సూర సూతనవోద్యత్ కరకుంచికా విఘటిత ధ్వాంతారరక్రక్రియాస్వనముల్'' అని పారిజాతాపహరణంలో అంటాడు. దీనిలో గొప్ప కల్పనవుంది. మెలకువ మలకలువేసే కల్పన. అనూరుడు సూర్యకిరణాలనే బీగాలతో చీకటి అనే తలుపులను తెరుస్తుంటే వచ్చే కిరకిరచప్పుళ్ళు కోడికూతలు అనడం అపూర్వ భావోల్బణాన్ని సూచిస్తుంది. అయితే యేమి? ఈ పద్యం విన్నతరువాత కోడి కూస్తున్నట్లుగా ప్రత్యక్షం కాదు. దాని కూత మనస్సులో ప్రతిధ్వనించదు. ఎందుచేతనంటే ఈ వర్ణనలో నిసర్గరామణీయకం లోపించి కృత్రిమ సౌందర్య లేపనం జరిగింది. సోమన వర్ణన చదువుతుంటే కోడిపుంజు ఎదుటనిల్చొని కూస్తున్నట్లని పిస్తుంది. ''కొక్కొక్కొరోకుట్టి''ని ధ్వన్యనుకరణంతోపాటు వర్ణన ముగియగానే మనస్సులో ముద్రితమైన ఆ కోడిపుంజు ఆకృతి, ధ్వనితమైన దాని కూజితం శాశ్వతంగా నిలుస్తవి. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానంలో ఇలాంటి నిసర్గ వర్ణనేచేస్తాడు. దానిలో పురవర్ణన మిలావుంది.

''తళతళమని పైడి తలుపులు, మించు
సెలరాల తిన్నెలు, నీడలుదోచు
నీలాలకంబొలు, నిర్మలస్ఫటిక
సాలభంజికలు, పచ్చల గవాక్షములు,
పగడంపువాచూరు, పద్మరాగముల
మొగడులు, వైడూర్యముల మందిరములు,

సలలితశశికాంత చంద్రశాలలును,
వెలది ముత్యంబుల వెలయు వాకిళులు
నవపుష్యరాగరత్నముల కుడ్యములు,
ప్రవిమల వజ్రసోపాన మార్గములు—''

ఇంతటితో పురవర్ణన ముగుస్తుంది. అష్టాదశ వర్ణనలలో పురవర్ణన మొకటి. ప్రబంధాలలో అది మొగం మొత్తేవిధంగా చేయబడింది. ప్రబంధయుగానికి గౌరన కొంచెం ముందువాడు. తాను తలచుకొంటే ఈ పట్టున పది పుటలు లాగేవాడే. కాని కథాదృష్టితో ముక్తసరిగా ముక్తా ఫలాలవంటి పదగుంభనంతో నగరవర్ణన ముగించినాడు. మొత్తం పట్టణ శోభను పది బంతులలో పసందుగా పట్టి చూపించినాడు.

2. ప్రతి కవీ చిత్రకారుడై ఉండాలి. కొందరు కవులు కేవలం ఛాయాగ్రాహకులుగానే ఉంటారు. మహాకవి చిత్రలేఖనం, ఛాయా గ్రహణం—ఈ రెండు కళలలో చేయి తిరిగినవాడై ఉంటాడు. అలా అని కుంచయో, క్యామెరాయో చేత్తో పుచ్చుకోవాలని నేనడంలేదు. మాటలతోనే మనయెదుట బొమ్మలను కట్టాలి. వాటికి రంగులు పెట్టాలి. ఆ బొమ్మలు కదిలేవిగా ఉండాలి. కదిలించేవిగా ఉండాలి. గౌరన ఎంత గొప్ప చిత్రకారుడో చూడండి. అస్తసూర్యుడు

''భవచండతాండవభ్రమణవేగమున
దివినుండి పడిన అందియమునుబోలె''

ఉన్నాడట. ఎంత చక్కని కుడ్యచిత్రం (Wall painting). సరస్సును ఇలాగే వర్ణిస్తాడు.

''..... చైత్ర
దర్పిత వనదేవతాకరస్ఫటిక
దర్పణంబునుబోలెదనరారుచున్నకొలను''

కళ్ళముందు సరోవరం అలా గంభీరంగా కళ్లు కదల్పకుండా కన్పిస్తున్నట్టని పిస్తుంది. నిశ్చలతకు కొలనును అద్దంతో పోల్చడం అద్వితీయం. చంద్ర మతి అగ్నిప్రవేశంచేస్తున్న ఘట్టంలో గౌరన మూడు బొమ్మలను వరుసగా వేసి సరసులను ముగ్ధులను చేస్తాడు. చంద్రమతీదేవి

"చెచ్చెర రాయంచ చెంగల్వ కొలని
జొచ్చిన గతి చిచ్చుజొచ్చి, యా నడుమ
కలయబూచిన కింశుకంబులలోన
చెలువారుచున్న రా చిలుక చందమున,
ప్రబల సంధ్యారాగ పటలంబునందు
సొబగొందు క్రొన్నెల సోగబాగునను"

విలసిల్లినదట. వీటిలో చెంగల్వ కొలనిలో తేలియాడే రాజహంస ఒక బొమ్మ. మోదుగుపూలలో చొచ్చిన రాచిలుక రెండవది. సంధ్యా రాగంలో తళతళ మెరిసే తరుణేందురేఖ మూడవబొమ్మ. అగ్నిజ్వాలలు చెంగల్వలవలె, మోదుగుపూలవలె, సంధ్యారాగంవలె ఉండడం, చంద్ర మతీ దేవి రాయంచవలె, రాచిలుకవలె, రాజరేఖవలె ఉండడం గౌరన భావనాశక్తికి, తత్ వ్యక్తీకరణ సాధనమైన చిత్రలేఖనా చాతురికి మచ్చుతునకలు.

పైనచూపిన చిత్రాలు నిశ్చలములు. అందుకే వీటిని కుడ్యచిత్రా లన్నాను. ఇక చలనచిత్రాలు తీయడంలోగూడా గౌరన ఆరితేరినవాడు. హరిశ్చంద్రుడు మాతంగ కన్యలను పరిణయ మాడుటకు నిరాకరిస్తాడు. వాళ్లు తమ ప్రవృత్తియైన విశ్వామిత్రునితో కొండెములు చెపుతారు. గౌరన క్యామెరా సవరిస్తాడు. విశ్వామిత్రుని ముఖంలోని ఒక్కొక్క భాగాన్ని ఎలా బొమ్మ తీస్తున్నాడో చూడండి :

"అలుకమై మిట్టి మీనై పడి కెరలి
ముఅముఅమని బొమల్ ముడిపాటుగదుర
చుఅచుఅ నిప్పు లఱుల నుప్పతిల్ల
పొటపొట చెమటమై పొడమ, నాసికము
పుటపుట కటములు పొరిపొరి నదర.
మొగమున జేవురు మురువు నటింప,
బుగబుగ నిగుడు నూర్పుల బొగలెగయ,
కటకటపడి, బొడుగఅచి హుమ్మనుచు"

విశ్వామిత్రుడు వివిధ మౌఖిక వికారాలతో భయంకరంగా మనముందు నిలుస్తాడు. ఒక్క నిమిషంలో ముడివడ్డ కనుబొమ్మలు, నిప్పులుమిసే కళ్లు, పుటపుట అదిరే కటాలు, జేవురించిన మొగం, బుగబుగ నిగిడే ఊర్పులూ, బొడు గరవడం, హుంకరించడం—యివన్నీ చకచకా ఫిల్మ్లాలా సాగిపోతూ కన్పిస్తవి. చివరికి వీటికి పర్యవసానంగా విశ్వామిత్రుడు మూర్తీభూత రౌద్రరసంగా కన్పిస్తాడు. అప్పుడు గౌరన చక్కని 'పాటు' తీస్తాడు. విశ్వామిత్రుడు 'వేడి వేలుపు దిగివచ్చి ద్వీపంబు లేడేర్చురీతి' "మూడగ్నులును మునిమూర్తి యైనట్లు" దుర్నిరీక్ష్యుడై పోతాడు. చేయితిరిగిన చేవగల్గిన కళావిదుడు తప్ప తదితరుడు ఇంతటి భావాన్ని ఇంతగా గుండెకుపట్టే విధంగా చెప్పలేడు. సోమన రెచ్చిన వృషభాన్ని ఇంత చక్కగానే వర్ణిస్తాడు. ముసిడి చౌడయ్య కథలో చౌడయ్య బసవని మట్టి నుద్దేశించి, "వెడలుము, వెడలుము వృషభేంద్ర" అనేసరికి వటవిటపాన్ని చీల్చుకొని వృషభరాజము పైకుబుకుతుంది. దానిని సోమన యిలా వర్ణిస్తాడు.

"నిలచి నిట్టించి ఘుణిల్ ఘుణిల్లనగ
నలరుచు అంకెలందంద వైచుచును
వాల మల్లార్చుచు కాల ద్రవ్వుచును
నేల గోరాడుచు నీడ కుర్కుచును

నడివీధి కెగయుచు నొడలు పెంచుచును
వడగొని పఱపుచు నిడు జంగలిడుచు
తగిలి గర్దించుడు తలకుచు మూతి
యిగిలించుకొని మొగం బెత్తిచూచుచును
చిఱుపెండ కెట్టుచు చిఱ్ఱు వొడ్చుచును
కుఱు జంగలిడుచు నిక్కులుచూచికొనుచు
ఊరక ల్వెట్టుచు ఉరగడింపుచును
మూకకు నెగయుచు ముస్సుముస్సనుచు''

3. కల్పనలలో మన ప్రబంధకవులు కనిష్ఠి కాధిష్ఠితులు. అయితే ద్విపద కవులు వారికి ఏమాత్రము తీసిపోలేదు. గౌరన కల్పనాచతురువు లకు వెన్నెల యిలా కనిపిస్తుందట:

''మనసిజుండనియెడు మటుమాయచొంగ
జనులపై మంత్రించి చల్లినయట్టి
మోహన భస్మంబు మురువున, విరహ
దాహకమై పర్వె తళుక్కు వెన్నెలలు''

వెన్నెల విరహులకు వేడిగా ఉంటుంది. ఇది సామాన్య ధర్మం. కవులూ, రసజ్ఞులూ అందరెరిగినదే. అంతవరకే వర్ణించి ఊరొక్కంటే గౌరన కల్పనా గౌరవము కన్పించేదికాదు. వెన్నెల, మన్మథుడు మంత్రించి జనులపై చల్లిన మోహన భస్మములాగుందట. మంత్రించి బూడిద చల్లడం మేటి దొంగలకు పరిపాటి. మన్మథుడిని మటుమాయ దొంగగా పోలుస్తాడు గౌరన. మాయలెరిగిన దొంగ ఎవరికీ కన్పించకుండా తన పని నెరవేర్చు కొని వెళ్ళిపోతాడు. మనసిజుడుకూడా అనంగుడు కావడం మూలాన ఎవరికీ అగుపించకుండా చివురుటాకు బాకులు విసురుతుంటాడు. ఇంత యెత్తు ఊహించి గౌరన ఈ కల్పన చేసినాడు. భస్మం వెన్నెలలాగే తెల్లగా ఉండడం ఈ కల్పనా సారస్యాన్ని ఇమ్మడింపజేసింది.

4. అనేక కావ్యాలలో వర్ణనలు అజాగళస్తనాలవలె కన్పిస్తాయి. తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదమన్నట్లు వర్ణన లొకదారీ, కథ మరో దారీ నడుస్తుంటాయి. మహాకవి చేసిన ప్రతి కల్పన, ప్రతి వర్ణన, ఔచిత్య సహితంగా ఉంటుంది. అంతేకాదు, కథాసూత్రానికి పులుగడిగిన ఆణ్ముత్యాలను సమకూరుస్తుంది. కథకు జిగీబిగీ సమకూర్చే శక్తిమంతమైన ఉత్ప్రేక్షలు పలకడంలో సోమన ఉద్దండుడు. మాదాంబ అనే శివ భక్తురాలుంటుంది. ఆమె గర్భంలో నందికేశ్వరుడు బసవని అవతారంగా ప్రవేశిస్తాడు. ఆమె గర్భచిహ్నాలను సోమన ఇలా వర్ణిస్తాడు:

అమృతాంశుడగు పుత్రు డతివ గర్భమున
నమరియుండుట నొక్కొ చెప్పొకలిగాదు.
పాండురాంగుని మూర్తి పడతి గర్భమున
నుండుటనో మెలరొంచి మైదీగ.
కాలకంధరు మూర్తి కడుపుననునికి
నో లలితాంగి చన్నొనలు నలుపెక్కె.
యోగీంద్రహంసు డయ్యువిదగర్భమున
రాగిల్లుటనో నడ వేగంబు సడలె"

ఈ చరణాలలో గర్భనతి సాధారణలక్షణాలు నిర్ణించబడ్డాయి. అకలి కాక పోవడం, ఒళ్ళు తేల్లబడడం, చూచుకాలు నలుపెక్కడం, నడక సడలి పోవడం,— ఇవి సామాన్యలక్షణాలే. అయితే సోమన ఈ లక్షణాలను ఉత్ప్రేక్షించడంలో పనితనం కనబరుస్తాడు. నందికేశ్వరుడు అమృతాంశుడు. అతని అవతారమే గర్భస్థశిశువు. అమృతాంశుడు కడుపులోవుండడంవల నే అకలి కావడంలేదట. ఇలాగే చెబుతూ చివరకు హిమాచలంవంటి ఎత్తయిన ఉత్ప్రేక్షి చేస్తాడు. మాదాంబ నడక సన్నగిల్లడానికి కారణం ఆమెకడుపులో యోగీంద్ర హంసుడు రాగిల్లుతుండడమేనట. నందికేశ్వరుడు యోగీంద్రులలో తలమానికం. యోగి అయినవాడు శమదమాదులవలన నిశ్చలంగా ఉంటాడు. యోగులలో ఇంద్రునివంటి వాడు నందికేశ్వరుడు. అంతేకాదు. యోగీంద్రులలో హంసవంటివాడట.

సోమనవర్ణిస్తున్నది ఆమె మందగమనాన్ని. మాచాంబ ఎంత అలసంగా నడుస్తున్నదీ మనకు చెబుతున్నాడు. హంస మందగమనానికి ప్రశస్తమయినది. యోగీంద్రులలో హంసవంటివాడు నందికేశ్వరుడు. అతడు మాదాంబ గర్భస్థుడు. అందుచేతనే ఆమె నడక వేగం బొత్తిగా సడలిపోయిందంటాడు. బసవడు నందికేశ్వరావతారం కావడంవల్ల భవిష్యత్తులో అతని వ్యక్తిత్వానికి బలం చేకూర్చినాడు సోమన. బసవని మహిమలను వర్ణించవలచినపుడల్లా సోమన వాచ్యంగా చెప్పడు. ఏదో ఒక సహజమైన అంశాన్నితీసుకొని భంగ్యంతరంగా కథాశరీరానికి అతికించి భావస్ఫూర్తి కలిగిస్తాడు. బసవేశ్వరుని బాల్యవర్ణనం ఈ దృష్టితోనే చేస్తాడు.

"వెనుక చీకటియుండ తనకేటి తేజ
మనుగతి దీపంబు గనుగొని నవ్వ.
అదుదొంద పద్మాసనాసీన వృత్తి
బొరి నభ్యసించు పొల్పున గూరుచుండు.
పూని ద్వితీయ శంభుండను నంది
నే నను భావన నిల దోగియాడు".

బసవడు బాల్యంనుండియే అలౌకికశక్తులు కలవాడు. పసితనంలోనే బసవని అసదృశప్రజ్ఞ కన్పించేలాగ సోమనాథుడు చిత్రమైనసన్నివేశం తీసుకున్నాడు. పసిపాపలు దీపాన్నిసమీపించి నవ్వడం, రెండుకాళ్ళు ఒకదానిపై ఒకటిచేర్చి కూర్చోవడం, దోగాడడంనంటివి అతిసాధారణాంశాలు. బసవడు బాలుడుగా ఉన్నప్పుడు ఇలాంటివే చేస్తాడు. అయితే ఆ చేయడంలో అంతరార్థంఉంది. అతడు దీపాన్నిచూచి నవ్వడంలో గొప్ప వేదాంతముంది. కాళ్ళు ముడుచుకోవడంలో భవిష్యత్తులోని అతని పద్మాసనాసీనత స్ఫురితమైంది. దోగాడడంలో నందీశ్వరత్వం భాసించింది. ఇలాగ బసవని వ్యక్తిత్వానికి రూపుదిద్దడంలో సోమన మామూలు సంగతులను సైతం మహనీయంగా మలుచుకున్నాడు.

5. ఉక్తివైచిత్రి ఉత్తమ కావ్యాలలో ఉండితీరవలసిన సల్లక్షణం. మాటలను కొంచెం ఏటవాలుగా చెబితేనే తమాషాగాఉంటుంది ఎలనాగ వాలుచూపులాగ. చమత్కారసిద్ధికి ఉక్తివైచిత్రి ఉపస్కారకం. చిత్తదీప్తి కలగాలంటే చమత్కారమే ఉపాదేయం. కావ్యంలోని ప్రతిపద్యం మనకు రససిద్ధికలిగించదు. రససిద్ధి కలిగించలేని పట్టులలో కవులు చమత్కారాన్ని ఆశ్రయిస్తారు. చమత్కారం అర్థగతంగా, శబ్దగతంగా ఉంటుంది. శబ్దగతమైన చమత్కారానికి ఉక్తివైచిత్రి ఉపయుక్తమౌతుంది. ఈ వైచిత్రులను బహుముఖంగా చూపించడంలో సోమన, గౌరనలు కొమ్ములుతిరిగినవారు.

'పిళ్ళనైనారు' కథలో సోమన ఉక్తివైచిత్రి పరాకాష్ఠ నందుకొన్నది. ఒకవిప్రకుటుంబములో కుమారస్వామి అంశమున పిళ్ళనైనారు జన్మిస్తాడు. నైనారుతండ్రి ఒకనాడు ఊరిబయటి కొలనులో-కొడుకును గట్టుసనిలిపి-స్నానంచేస్తుంటాడు. విమానయానులైన శివపార్వతులు పిల్లవాణ్ణి చూస్తారు. భవానిలో మాతృత్వంపొంగి చనుగవసేపట్రకిందికిదిగి నైనారుకు చనుబాలు కుడిపి అదృశ్యరూపాలవుతుంది. నీటిలోనుంకిన బ్రాహ్మణుడు లేచివచ్చి నైనారుముందున్న పైడిగిన్నె, పాలు ఎక్కడివని ప్రశ్నిస్తాడు. అప్పుడు తండ్రితో నైనారు ఇలా అంటాడు:

''దినిన్లవోయెడు దేవదేవేశు
కవనుండి యయ్యమాకాంత ఏతెంచె
ఉరు జటాజూట భాస్వరు కడనుండి
చిరవణి వకుట భాస్వర యేగుదెంచె
తగ చంద్రరేఖావతంసుని నిల్పి
సుగుణావతంస తత్సుదతి యేతెంచె
కరమొప్ప నీలకంధరు కడనుండి
సరసర కంబుకంధర యేగుదెంచె

ఘన చందనాంక వక్షఃస్థలి బాసి
స్తనచందనాంక వక్షఃస్థలి వచ్చె
ఉర గేంద్రహారుని యూరుల నుండి
వర రత్నహార సుందరి యేగుదెంచె
ఆ మహోక్షగమను నటమేన నుండి
కామిని వర హంసగమన యేతెంచె
మల్లోకముల జేని ముందరనుండి
మల్లోకముల కెల్ల తల్లి యేతెంచె''

సోమన చెప్పదలచుకున్నది అతిస్వల్పం. శివపార్వతుల కవలోనుండి పార్వతి విడివడి క్రిందికి దిగివచ్చింది అని. ఈ అంశాన్ని ఏడు ద్విపదలలో ఒకదానికంటే మరొకటి విచిత్రంగా చెబుతాడు. శివునివీడి పార్వతి విచ్చేసినదని ఏడుసార్లన్నా ఒకదానితోనొకటి సంబంధం ఉండీ లేనట్టనిపిస్తుంది. శివుడు-పార్వతి. అతడు ఉరుజటాజూటు భాస్వరుడు- ఆమె చిరమణి మకుటభాస్వర. అతడు చంద్రరేఖాపతంసుడు- ఆమె గుణావతంస. ఇలాగే ఇర్వురు పరస్పరం అర్ధాంగులే. అయితే సోమన ఇర్వురి బాహిరంగిక వైవిధ్యాన్ని సూచించేపదాలు ప్రయోగిస్తూ చివరిపదాల్లో శివుణ్ని త్రిలోకపతిఅంటాడు. పార్వతి కేవలం కుమారస్వామికి, వినాయకునికే తల్లిగాదు- త్రిలోకజనని. అందుచేతనే పిళ్ళనైనారును చూడగనే ఆమె చనుగవచేపింది. మాతృభావన పట్టలేక పాలుగుడిపి వెళ్ళింది.

గౌరనకూడా ఈ రకమైన వైచిత్రులను రేఖామాత్రంగా ప్రదర్శించినాడు. ఉల్కాపతనాన్ని వర్ణిస్తూ

''మెరుపులు ధళధళ మెరియక మున్నె
ఉఱుములు పెళపెళనుతేమె, నయ్యుఱుము
లట మిన్నుతలక్రోయు నంతకుమున్నె
పెటపెట పెటిలి పెన్బిడుగులు వడియె''

నంటాడు. చివరికిగానీ తెలియదు పిడుగులే మొదటబడినవని. అంటే ఉల్కాపతనం అంత ఉద్ధృతంగా ఉన్నదని ఉక్తివైచిత్రిద్వారా సూచిస్తున్నాడు.

6. కావ్యజ్ఞులు కావ్యరచనలో కల్పనాశక్తికి ప్రథమతాంబూలమిస్తారు. తరువాతిస్థానం పరిశీలనశక్తిదే. కవి కేవలం భావపద్మాలపై ఎగిసి అకాశమంత యెత్తులనే పరికించడు. మామూలుకాళ్ళతో నేలపై నడచి సామాన్య విషయాలుసైతం సంగ్రహించి మేధాపేటికలో భద్రపరచుకొంటాడు. కావ్యంలో అనసరమైనప్పుడు వాటిని పుంఖానుపుంఖంగా వదలుతాడు. తెలుగుకవులలో కృష్ణరాయలకున్న వస్తు పరిశీలనశక్తి అనంతం. అతనితరువాత బహుముఖమైన పరిశీలనశక్తిగలవారు ద్విపదకవులే. అందులో గౌరన సోమనలే. సోమన తనకావ్యాలలో చండాల యాదవాది నానాజాతుల వేషాలను, వారి ఆచారవ్యవహారాలను ఎంతో హృద్యంగమంగా వర్ణించినాడు. గౌరన చండాలపతి వీరభాహుణ్ని ఇలావర్ణిస్తాడు.

''కుటువెండ్రుకల కోరకొప్పిడి, కావి
యవిడు తల నిట్టునట్టునుజుట్టి,
జేగురుబొట్టిడి, చెవిసంకు కొదుపు
లాగుగాఁవేల తెల్లనిముడ్సునిల్పి,
తోలులు వోయిన ప్రాతతోలును గప్పి,
పలుగత్తి మొల నచ్చుపడ నమరించి,
కడుమైల పేలిక గాసించి నడుము
బడికివేసిన యరపట్టె బిగించి,
యొడమచే పశుమాంస మేర్చిన గుడియ
కడముచే నినుపయుంగరముల గుడియ
కడజాతి గాబూని—''

వీరభాహుడు కళ్ళముందు నిలుస్తాడు. గౌరన తనకాలంనాటి పెద్దమాదిగ వేషాన్ని వీసరవోకుండా వర్ణించి తన వ్యక్తి పరిశీలనశక్తిని వ్యక్తపరచినాడు. సోమన పరిశీలనశక్తిగూడా దొడ్డదే. బెజ్జమహాదేవికథలో అది ద్యోతమానమైంది. బెజ్జన్న శివభక్తురాలు. ఆమెకు పరమేశునికి తల్లి లేకపోవడం విచారాన్ని కల్గిస్తుంది. పర్యవసానంగా పరమశివుణ్ణి తన తనయుడుగా భావించుకొని ఇలా పరిచర్యలు చేస్తుంది.

''తొంగిళ్ళపైబడి లింగమూర్తికిని
అంగనకావించు నభ్యంజనమ్ము
ముక్కొత్తు చెక్కొత్తు మక్కన్ను ప్రులును
ఆకొక్కొత్తు కడుపొత్తు అటవీపు నిమురు
పెరుగంగవలెనని తరుణి వీడ్వడగ
చరణముల్ కరములు చాగంగ దిగుచు

... ...

పడతి చేనీరతూపొడిచి బొట్టిడును
మడది యంగుష్ఠంబు మన్నింత మెదిచి
కడవ నంటినయట్టి పిడుక విభూతి
యిడర పుత్రుని నొసలారంగబూయు''

పసిబిడ్డనుపెంచే క్రమపద్ధతిని పరిశీలించి సోమన పై చరణాలలో బహు సహజమైన పలుకుబడులలో చిత్రించినాడు. నేటికిగూడా జనపదాలలో పసిబిడ్డకు స్నానంచేయించిన తరువాత 'దిష్టి' తగులకుండా ఉండడానికి కాలిమట్టినితీసి నొసటికిపూస్తారు.

7. ఏ అలంకారంలేకుండా రస నిష్పత్తి కలిగించడం కష్టం. రీతి, వృత్తి, శయ్య, పాకం, అలంకారం అన్నీ కలిస్తేనే రససిద్ధి కలుగుతుంది. ఇదిమన ప్రౌఢ సాహిత్యజ్ఞుల అభిప్రాయం. ఇవేవీ లేకుండానే సామాన్య భావంతో గుండెలు ద్రవించుకుపోయే విధంగా రచన చేసినవారు ద్విపద కవులు. బెజ్జమహాదేవి కథలో సోమనాథుడు రచించిన అయిదు ద్విప .

వలు ఒకమహాకావ్యానికి ఉండవలసిన మహత్త్వాన్ని కలిగిఉన్నవి. బెజ్జ మహాదేవి కథాకంథ శ్రీపాద కమలాంతరంగ. పరమేశ్వరునికి తల్లి లేకుండా ఉండడం విచిత్రమనిపించి ఒకమాటు ఆమె యిలా వితర్కించుకొంటుంది.

'తల్లి గల్గిన నేల తపసిగానిచ్చు
తల్లి గల్గిన నేల తలజడ లగ్గిట్టు
తల్లియున్న విషంబు ద్రావ నేలిచ్చు
తల్లియుండిన తోళ్ళు దాల్వ నేలిచ్చు
తల్లిపాఱుల నేల ధరియింప నిచ్చు
తల్లి బూడిద యేల తాబూయ నిచ్చు
తల్లి పుచ్చుకొనే భువి తనయుని తిరియ
తల్లి పుచ్చుకొనే సుతు వల్లకాటికిసి?''

ఏ వేదాంతికో, ఏమహాకవికో అంచనిసందేహమిది. 'చులకన మరి తల్లిలేని సుతుడు' అని మనలోకోక్తి. సోమన దీనిని సోమకిరీటునికి అనువర్తింప జేసినాడు. నిజంగా శివునికి తల్లివుంటే ఇంత చుర్దశపట్టేదా అని అనిపించే లాగా చిత్రించినాడు. శివుడు అయోనిజుడు, ఆదిమధ్యాంతరహితుడు అని తెలిసినా అయోధ్యాతనికి అందరిలాగా తల్లివుంటే బాగుండేదే అని మనం తల్లడిల్లేలాగా వర్ణించినాడు. పైరీతిగా భావించిన బెజ్జవ్వ చివరకు ఇలా అనుకొంటుంది :

'తా నింతవాడయ్యె తల్లి లేకయును
తా నెంత పెరుగునో తల్లి గల్గినను''

ఇవిపొడిపొడిమాటలుకావు. ఆర్ద్రిత పతాకస్థాయి నందుకొన్న దివ్య రసోక్తులు. విడివిడిమాటలతో ఎడదలను దూసుకుపోయేవిధంగా కావ్య మలడంలో సోమనకు మహాకవులు పెక్కురు దిగదుడుపు.

8. వ్యంగ్యం కావ్య శరీరానికి ఆత్మవంటిది. నాడూ, నేడూ అందరి అంగీకారముద్రను పొందిన అంశమేయిది. వాచ్యార్థాన్ని సుస్ప

ష్టంచేసే సుశక్తికమైన పదజాలంతోపాటు, ఆ అర్థంవెనకాల సముద్ర గర్భంలో రత్నావళివలె వ్యంగ్యార్థమును పొదిగినవాడే మహాకవి. ద్విపద కవులు అచ్చటచ్చట సునిశితమైన వ్యంగ్యవైభవాన్ని ప్రదర్శించినారు

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానంలో హరిశ్చంద్రు డమ్ముడుపోతున్న ఘట్టంలో చక్కని వ్యంగ్యాన్ని అందించినాడు. చండాలపతి వీరబాహుడు హరిశ్చంద్రుణ్ని కొంటానని ముందుకువస్తాడు. అప్పుడు నరేంద్రుడు కట కటపడి 'మాలవాడవు' నీవేమికొనగలుగుతానని వీరబాహుణ్ని నింది స్తాడు. రాజును అధిక్షేపిస్తూ వీరబాహుడంటాడు

"మాటి మాటికి నన్ను మాలవా డంచు
నీకు నోయగ నేల? నీ తండ్రికులము
నా కులంబును నొక్క నాణ్ణెమైయుండు
నిప్పు డే నెట్లుంటి నేమి?"

హరిశ్చంద్రుని తండ్రి త్రిశంకువు. అతడు వశిష్ఠశాపమునల్ల చండాలు డవుతాడు. అందుచేత వీరబాహునివలె హరిశ్చంద్రుడుగూడా చండాల పుత్రుడే. ఇది వాచ్యం. వీరబాహుడు నిజంగా చండాలుడుగాడు. విశ్వామిత్రునిచేత ప్రార్థితుడై ఆరూపానవచ్చిన యముడు. యముడు సూర్యునికొడుకు. హరిశ్చంద్రుడు సూర్యునివంశంలో పుట్టినవాడు. అంటే యిరువురూ సూర్యకులానికి సంబంధించినవారే. ఇది వ్యంగ్యం. వాచ్యార్థంలో నిందలుగా కనిపిస్తున్నమాటలు వ్యంగ్యార్థంలో అభినందనలుగా మారిపోయినవి. ఇది శ్లేషల వాసనలేని వ్యంగ్యసంపద.

ద్విపదకవులు ప్రజాభాషలో ప్రాయాలని పంతంబట్టినా కావ్యాత్మ వారిని అలా చేయనీయలేదు. ఒకొక్కమారు ఆవేశంలో సుదీర్ఘ సమాసాలను గుప్పించినారు. ఒకొక్కమాటు పాలమీగడలవంటి పసందైన పలుకుబళ్ళను చిలికినారు.

సోమనాథుని సమాస ప్రౌఢిమను చూడండి :

"సారజంగము పాద సరసిజ యుగ్మ
ధారాళ మకరంద ధౌత శిరస్క
శారదనీరద హార నీహార
తారామరాహార ధౌతయశస్క"

గౌరన సమాస చాలనము చూడండి :

"స్ఫుటరోష శేషాహి ఫూత్కారఘోర
చటుల విషానల జ్వాలలకంటె
కుపిత కాశిక పటుకుటిల కఠోర
విపుల శాపాగ్నుల వేడిమి ఘనము"

అగ్నికణికలు చిటపట మన్నట్లుగా ఉంది.

"దారుణ కరవాల ధారాహతారి
వీర కోటీర నవీన మాణిక్య
రంగవల్లీ రణరంగ విఖ్యాత
మంగళ విజయ రమాకర గ్రహణ
శస్తము ..... హస్తము"

ఒరలోనుంచి కత్తి దూసినట్లుగా ఉంది.

"మందార మంజరీ మంజుమరంద
నందదిందిందిర నందనారామ
కమనీయ వికసిత కనకారవింద
కమలినీతట లతాగారలతాంత
రచితశయ్యాతల రతిరయ గళిత
కచభర సురపుర గణికా .. .."

తీగలుసాగి పందిళ్ళపైకి ప్రాకినట్లుగా ఉంది.

అచ్చతెలుగు పలుకుబళ్లు ప్రయోగించడంలో ఇద్దరూ సిద్ధహస్తులే!

సోమన : ఏట, కొట్నము, చిఱులువొడుచు, చిలివిలివోవు, అలుగులువారు, కొఱమీను గట్ర, పొట్లము, లెంగులు ఇత్యాదులు.

శౌరన : తలపువ్వువాడక, పచ్చపైకము, తచ్చులు పచరించి, ఒజ్జలంగ, చుఱుకుకన్ను, బొమ్మించుమోవి, బడితపాఠము, సంబళి ఇత్యాదులు.

ఈ యిర్వురిలో సోమనాథుణ్ని పోతన, శ్రీనాథులు అనుకరించినారు.

శ్రీనాథుడు హరవిలాసంలో వ్రాసిన 'చిఱుతొండనంబికథ' పై సోమన బసవ పురాణములోని 'సిరియాలునికథ' ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

పోతన భాగవతంలో 'ప్రహ్లాద చరిత్రము' రసవద్ఘట్టం. అందులో 'మందార మకరంద మాధుర్యమున దేలు' అనే పద్యం రసవత్తరమైనది. ఆ పద్యం సోమన బసవపురాణంలో వ్రాసిన దిగువ ద్విపదలకు అనుకరణం.

క్షీరాబ్ధిలోపల క్రీడించు హంస
కోరునే పడియలనీరు ద్రావంగ
చూత ఫలంబుల చుంబించు చిలుక
బ్రాతి బూరుగు వ్రాసిపండ్లు గన్గొనునె
రాకాసుల జ్యోత్స్న్న ద్రావు చకోర
మాకాంక్ష నేయునే చీకటిద్రావ
సిరిదమ్మివాసన విహరించుతేటి
పరిగొని సుడియునే బబ్బిలి విరుల''

ఇక పోతన పద్యం చూడండి.

"మందారమకరంద మాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికల దూగు
రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు
కోయిల నేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికాస్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర నీహారములకు"—

వైపద్యంలో సోమన ద్విపదలలోని భావమే చిత్రితమైంది. పోతనవంటి మహాకవి పద్యానికి మాతృకరచించిన సోమనాథుడు ద్విపదకవి కావడం విశేషం.

ద్విపదవంటి సామాన్య ఛందస్సులో మహాకావ్యాలు వ్రాయవచ్చునని సోమనాదులు ఎలా నిరూపించిందీ నేను ఈ వ్యాసంలో ఎత్తి చూపడానికి ప్రయత్నించినాను. అయితే ద్విపద విషయంలో ఒక్క చిక్కు మాత్రముంది. ఛందోవైవిధ్యం కావ్యానికి జీవంపోస్తుంది. అది లేనప్పుడు చేంత్రాడులాగా ఎగుడూ దిగుడూ లేక ఒకేరకంగా సాగిపోతే విసుగు పుట్టుతుంది. ద్విపదకావ్యాలను అందుకే ఏకధాటిగా చదవలేము. కాని సోమన గారనలు కావ్యనిర్మాణ మర్మజ్ఞులు. తాము తీసుకొన్న ఛందస్సు ఒకటేయైనా విపుల కావ్యాలను విసుగు కల్గించకుండా నడిపించినారు. ద్విపద మాత్రాఛందస్సు కావడంవలన గురు లఘ్వక్షరాలను మార్చి మార్చి ప్రయోగించి గారడీ చేసినారు. సోమన బసవ పురాణం తీసుకొందాం. ద్విపద ఎన్ని రకాలుగా నడిచిందో చూడండి:

"ఈ నిరహంకార మీ సదాచార
మీ నిరంతర భక్తి యీ ప్రభుశక్తి
యీ సిద్ధి పాండిత్య మీ నిత్యసత్య
మీ సుకుమారత్వ మీ యాత్మతత్వ"ము

అంత్య నియమాలతో జంగలుసాస్తూ నడిచింది.

"శివరాత్రి నిత్యంబు చెల్లించుబాస
శివభక్తులెల్లను శివుడను బాస
మృదువైన నొక మఱి యడుగని బాస
యడిగిన యర్థంబు గడపని బాస"

ఆధికారంగా బెత్తమాడిస్తున్నట్టుగా నడిచింది.

'ఓకలంక ! మీరప్పు డన్నారు నేను
విన్నాడ, పుత్రుడు నున్నాడు, చదువు
చున్నాడో, యాడుచునున్నాడో—"

దీనంగా మాట్లాడినట్టుగా ఉంది.

ఇలా రకరకాల గతులలో ద్విపదను నడపడంవల్ల చదివినకొద్ది చవులూరించే కావ్యాలను సోమనాదులు రచించగల్గినారు. బసవ పురాణము, పండితారాధ్య చరిత్రము, హరిశ్చంద్రోపాఖ్యానము మున్నగు ద్విపద కావ్యాలు మార్గకవితారీతిలో వ్రాయబడిన మహాకావ్యాలకు ఏమాత్రము తీసిపోవు. ద్విపదలలో నిక్షిప్తమైన దివ్యకవితను రసజ్ఞులు ఓపికతో ఆస్వాదింతురు గాక :

తిక్కన తీరు తెన్నులు

నిర్వచనోత్తరరామాయణ రచనాకాలము నాటికి తిక్కన పరిణతిచెందినకవి కాలేదు. అందుకే కుకవి నింపతోపాటు కవిత్వానికి కావల సిన కొలమానాలను కూడ నిర్వచించినాడు. పరిపక్వమనస్కులైన కవి శిఖామణులు కవిత్వ నిర్వచనంచేయడం అంత మంచిపనికాదు. అందులో వాచ్యంగా అనడం మరీ బాగుండదు. వాచ్యపుష్టి లక్ష్యనిష్ఠమై ఉండనలె కాని లక్షణంపైపు మొగ్గిపోకూడదు. తిక్కన నిర్వచనోత్తర రామాయణ ప్రస్తావనల్లో

"లలిత పద హృద్య పద్యం
బులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై
అలతియులతి తునియలకా
హళిసంధించిన విధంబు నమరగవలయునే"

అని, కవిత్వమంటే ఇట్లావ్రుడవలెనని గీట్లు గీసినాడు. సంస్కృతశబ్దము, తెలుగుబడిన విశేషణము లేటపడగా పలుకునపుడు లింగవచనంబులు భేదింపరాదని చిల్లరవిషయాలుసైతం పేర్కొన్నాడు. 'ఎట్టికవిత్వైన తన కృతి యింపు పెంపజాలు'నని ఎవరినో దృష్టిలోపెట్టుకొని ఎత్తిపొడిచినాడు. బహుశః నన్నెచోడుడు 'సరళముగాగ భావనములు జాను తెనుంగున నింపుపెంపుతో బిగిగొనవర్ణనల్' అనే పద్యంలో విసిరిన విసుర్నకు కినిసి తిక్కన ఈ రూపంలో సమాధాన మిచ్చినాడేమో? నన్నెచోడుడు మాటిమాటికి తనకావ్యంలో 'వస్తుకవిత'ను ప్రస్తావించినాడు. 'జాను తెనుగో' యని ఉద్ఘోషించినాడు. కావ్యం 'షట్త్రింశ దలంకారాలంకృతంబై', అష్టాదశ వర్ణనాభరితంబై ఉండవలెనని ఊదిపల్కినాడు. మందునకైనా కావ్యంలో కథా ప్రాధాన్యాన్ని ఉగ్గడించలేదు. నన్నయ

'కథాకలితార్థయుక్తి'పై కన్ననిలిపితే, నన్నెచోడుడు వస్తుకవితను ప్రస్తావించినాడు. నన్నయ పురాణరచనా ప్రవణుడుకాగా నన్నెచోడుడు ప్రబంధ సంధానసక్తుడైనాడు.

తిక్కన వీరిద్దరినీ గమనించినాడు. నన్నయ నభిమానించినాడు. అయితే, ఈ అభిమానం నిర్వచనోత్తర రామాయణంలో అంతగా కనిపించదు. తొలి పద్యం సంస్కృత శ్లోకమే రచించి నన్నయ తెన్ననే నడిచినా, అతనిని పేరుపెట్టి స్మరించలేదు. 'నూత్న సత్కవుల' కొలుతు ననిమాత్రమే అన్నాడు. భారత రచనాకాలమునాటికి తిక్కన హృదయంలో గొప్పమార్పు వచ్చింది. అతడు అక్షరాల సోమయాజియైనాడు. 'బుధజనవిధేయ తిక్కన నామధేయ' అని వ్రాసుకునే దశనుదాటి 'బుధారాధన విరాజి తిక్కనసోమయాజి' అని చెప్పగలిగినస్థాయిని అధిగమించినాడు. 'కవితా విలాస విస్తర మహనీయుడ' నని తానే వ్రాసుకునేస్థితికి చాలాయెత్తుపెరిగిపోయినాడు. నన్నయవలె 'నానేర్చిన భంగి చెప్పెద' నని అన్నాడు. భారతంలో కుకవి నింపగానీ, కవిత్వనిర్వచనంగానీ కనిపించవు. వివిధార్థగతి స్ఫురణం కల్గిన మహాభారతంలోని 'అర్థంబు సంగతంబు' చేయడానికి తిక్కన మహా కవిత్వ దీక్షావిధిపొందినాడు. వెనుకటివలె వచనమును నిషేధిస్తున్నానని, 'జాత్యముగామి యెప్పయిన సంస్కృత మెన్నడు వ్రాయ'నని ప్రతిజ్ఞలు చేయలేదు. ఇది తిక్కన పరిణద్ధ బుద్ధికీ, పరిణత మనస్కతకూ తార్కాణం.

మనుమసిద్ధిమహీపతికి కృతి సమర్పణచేసిన తిక్కన భారత రచనాటికి మింటికన్న ఎత్తుపెరిగిపోయినాడు. విష్టపాన్ని నిర్లోకంగా దర్శించినాడు. సర్వేశ్వరుడు హరిహరనాథుడు తన్నిర్లోకగత భుజంగపతిగా సాక్షాత్కరించినాడు. ఇది 'కవితా విలాస విస్తర మహనీయు'ల కందే భావనాచిత్రంకాదు. పరతత్వాన్ని నిలదీసి 'కిమస్థి మూలాం కిము కౌస్తుభంవా పరిష్కృియాయాం బహుమన్యసేత్వం' అని ప్రశ్నించే మహా ద్రష్టకుమాత్రమే సాధ్యం. బ్రహ్మ లోకాలనుసృష్టించినాడు. తిక్కన ఒక

కొత్త దేవరనే ప్రతిష్ఠించినాడు. ఈ దేవర బుగ్వేదంలోని ఒకానొక మంత్రంలో ధ్వని ప్రాయంగా వినిపించవచ్చు. ఏ గంగాతీరంలోనో ఈ దేవర పేరుతో క్షేత్రముండవచ్చు. అంతమాత్రాననే తిక్కన సృష్టించిన హరిహరనాథుడు ఆలయపరిమితుడుకాడు. కేవలం విగ్రహగతుడు కాడు. అతడు శిల్పచిత్రాలకందని మహోన్నతమూర్తి. 'మరుత్సరిదా కల్పిత మనోజ్ఞ చరణశిర స్సుందరమూర్తి'. అతడు లోకాతీతుడుకాడు. 'త్రిభువన శుక వృష పంజర విభన మహితుడు'. అతడు పద్య గద్య నిర్వాచ్యుడుకాడు. 'ఓంకారవాచ్యుడు'. అట్టి హరిహరమూర్తిని అంతశ్చక్షువులతోదర్శించి, తనకావ్యమందిరంలో ప్రతిష్ఠించి, భక్తకోటికి ముంగొంగు పసిడిగా, వెరటికల్పకంగా చేసిన తిక్కన బ్రహ్మకల్పుడు. కవి బ్రహ్మ.

భారతం ఇతిహాసం. ధర్మ శాస్త్రజ్ఞులు దానిని ధర్మశాస్త్ర మన్నారు. అధ్యాత్మవిదులు వేదాంతమన్నారు. లాక్షణికులు సర్వాలక్ష్య సంగ్రహమన్నారు. ఎందరో ఎన్నివిధాలుగానో ప్రస్తుతించినా నన్నయ దానిని ప్రధానంగా కథాకావ్యంగా మలచినాడు. తిక్కన దానిని కథా ఖండంగా తీర్చిదిద్దినాడు. విరాటపర్వాన్ని 'నానా రసాభ్యుదయోల్లాసి'గా రచించినాడు. తనకృతిపతి హరిహరనాథుని సైతం 'బహుకళావిర్భావ శాలి'గా ప్రణుతిచేసినాడు. 'ఆనందమూర్తి'గా సందర్శించినాడు. 'సత్య నందవిభు స్వభావమహితు'నిగా తీర్చిదిద్దినాడు. సత్యాన్ని 'శివము'గా, 'సుందరము'గా సాక్షాత్కరింపించుకొన్నాడు. హరిహరనాథ తత్వం మత వైషమ్యాలతో జర్జరితమైపోయిన మానవజాతికి మహౌషధమే కాదు. 'దుర్వహ పటుతాపత్రయ నిర్వాపణ'కు అమృతకందం. హరి హరనాథ వర్ణనలో తిక్కన ఎగిసిన యెత్తులు, తరచినలోతులు అపూర్వాలు. అవి మధురభక్తి వేదాంతాలు మాకంద మాధవీలతలవలె అల్లుకొన్న మనోజ్ఞసంఘటనలు.

'కనయః క్రాంతదర్శినః', సామాన్యునికి కనిపించని విచిత్రవస్తువులను దర్శించే శక్తి కవికున్నది. సామాన్యుడు నిత్యానుచూచి ఊపేక్ష

వహించిన సాధారణవస్తువులను సుందరతా నిస్తులములుగా ప్రస్తావించెడు ప్రతిభ అతని కలానికున్నది. ఈ దర్శనశక్తి తిక్కనలో మిక్కుటంగా ఉన్నది. మహాకవులందరూ అపూర్వ కల్పనాచతురులు కలవారై యుంటారు. నేలపై నడయాడుతూ నింగిని నిమిరే మహాశక్తి వారికి కరస్థ మేటిక. దృష్టనస్తువును అదృష్టవస్తువుతో పోల్చిచెప్పడం ఒకవిచిత్రమైన కవితాశక్తి. 'ముఖంపద్మంవలెఉన్నది'. ఒక కన్పించే పదార్థానికి ఒక కన్పించే పదార్థంతో పోలిక చెప్పబడింది. ఇది సామాన్యం. 'కోపం అగ్నివలెఉన్నది'. దీనిలో ఉపమానం కనిపించేది. ఉపమేయం స్వయంగా కనిపించకున్నా ఇతరాలంబనంవల్ల వ్యక్తమవుతుంది. ఈ వర్ణనసామాన్యం. 'మల్లెపువ్వు మహాపురుషునికీర్తివలెఉన్నది' ఇది అనామాన్యం. కనిపించే వస్తువునకు కనిపించని భావనా మధురమైన మరొక వస్తువుతో పోలిక చెప్పడం దీనిలో కనిపిస్తున్న ప్రత్యేకత. వాల్మీకి మహాకవి రామాయణంలో వెక్కుచోట్ల ఈ చివరి పద్ధతినే అనుసరించినాడు. అశోకవృక్షం క్రింద దుఃఖితయైయున్న సీతాసాధ్విని 'పినద్ధాం ధూమజాలేన శిఖామివ పిచావసోః' అని మామూలుధోరణిలో ప్రారంభించి 'స్మృతీమివసుసందిగ్ధాం' ఇత్యాది అంతరవస్థలతోపోల్చి అచ్చమైన కవితాత్మను ఆవిష్కరించినాడు. తిక్కన ఈ తెన్నునే మెదుగులుదిద్దుతూపోయినాడు. నిత్యం దర్శనీయమైన నీరజబంధువును కవిబ్రహ్మ ఈరకంగా దర్శించినాడు.

నీరజాకరములు నిద్ర మై చేసిన
భవ్యతేంబుల ఫలమనంగ
దివసముఖాభినందిత చక్రయుగ్మకం
బుల అనురాగంపు ప్రోవనంగ
హరిహర బ్రహ్మ మహాసుభావంబు లూ
కొటిగాగ కరగిన గట్టియనగ
అతుల వేదత్రయ లతికాచయంబు పెను
పొంద పుట్టెడు మూలకందమనగ

అఖిల జగముల కద్దెఅయగుచు జనస
మాజకరపుట హృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును బొనర్చి
భాను బింబంబు పూర్వాద్రిపై వెలింగె''

సంస్కృతాంధ్ర కవులలో సూర్యవర్ణన ఇంతకన్నా అందంగా చేసినవారున్నారు. అయితే ఇంత సాధుగంభీరంగా చెప్పినవారరుదు. ఈ పద్యంలో నాలుగు మెట్లున్నవి. ఒకదానికన్న ఒకటి ఉన్నతమైనది. నాలుగుమెట్లు నాలుగురకాల ఊహింపుల పునాదులపై నిల్చున్నవి. మొదటిమెట్టులో సూర్యబింబం పద్మాల తపఃఫలితంగా కనిపించింది. రెండవ మెట్టులో చక్రవాకాల అనురాగం ప్రోగయినట్టుగా కనిపించింది. మూడవమెట్టులో హరిహరబ్రహ్మల మహానుభావాలను ఒకచోటచేర్చి కరిగితే ఏర్పడే ముద్దగా కనిపించింది. నాలుగవమెట్టులో వేదత్రయ లతలకు మూలకందంగా కనిపించింది. తామరలు నిష్ఠతో చేస్తున్నతపస్సు ప్రణయతపస్సు. సూర్యుడు పద్మినీప్రియుడుగదా! ఇక చక్రవాక మిథునంమధ్య అల్లుకున్నది అనురాగబంధమే. అంటే మొదటి రెండుమెట్లలో సూర్యబింబాన్ని ప్రణయబింబంగా దర్శించినాడు కవిబ్రహ్మ. అతనికి చివరి రెండుమెట్లలో వేదవేద్యాలైన హరిహరబ్రహ్మల మాహాత్మ్యమునకు ప్రతీకగా భాను బింబం సాక్షాత్కరించింది. పై నాలుగుపద్యాలలో రక్తి, భక్తి ఈ రెంటి సమ్మేళనం కనిపిస్తుంది. రక్తిచిత్రణతో ప్రారంభమై భక్తిస్ఫూర్తితో ముగియడం ఈ పద్యంలోఉన్న గొప్పవిశేషం.

తిక్కన సామాన్యంగా వర్ణనలజోలికిపోడు. చేసిన వర్ణనలు మాత్రం బంగారుపోతలు. సభ్య శృంగారమెంతగా సామాజికుల మనస్సులలో మల్లెలను విరియిస్తుందో నిరూపించిన తొలికవి నన్నయ. తరువాత తిక్కన దానికి ప్రౌఢిమను ప్రసాదించినాడు. 'రూపాభిమాని' యైన కీచకుడు ద్రౌపదినిచూచి ఆమె ప్రత్యంగవర్ణనచేసిన ఘట్టంలో తిక్కన నాజూకుపోకడలు పోయినాడు. పాతవడ్డ కవి సమయాలను దులిపి వాటికి

కొత్త ఉడుపులను కైసేసినాడు. స్త్రీ పాదాలు పద్మాలు, ముఖం చంద్ర బింబం, కొప్పు తుమ్మెదలకప్పు. ఇవి సంస్కృతాంధ్ర సాహిత్యాలలో సంయూఢాలైన కవిసమయాలు. ఇది ప్రతి ప్రాచీనకవికీ (ఆధునికులకు నైకల్పికంగా) శరణ్యాలు. తిక్కన వీటినే శరణుచొచ్చినాడు. అయితే, వాటికి దాసుడుకాలేదు. తన వినూత్నభావనాశక్తికి వాటిని ఊడిగం చేయించుకున్నాడు. తిక్కన కీచకునినోట ఈ విధంగా అనిపించినాడు.

"నెత్తమ్మిరేకుల మెత్తదనము దెచ్చి
అచ్చునబెట్టిన ట్లుండ మొంది
చక్రవాకంబుల చందంబు గొనివచ్చి
కుప్పలు చేసిన ట్లొప్పు మెరసి
చందురు నునుకాంతి కందేర్చి కూర్చి బొ
గునకు దెచ్చినయట్లు కొమరు మిగిలి
ఉళికులంబుల కప్పు గలయంతయును దెచ్చి
నారువోసిన భంగి నవక మెక్కి
ఆంభ్రితలములు కుచములు ఆననంబు
కచభరంబును ఇట్లున్న రుచిరమూర్తి
అనుపమాన భోగములకు నాస్పదంబు
కాచె యీ త్రిప్పు లేటికి కమలవదన."

ఈ పద్యంలోఉన్న నాలుగు కవిసమయాలు పాతవే. అయినా చెప్పడంలో ఎక్కడలేని నైచిత్రిఉంది. పాదం పద్మంలాఉంది అన్నప్పుడు పద్మానికి సంబంధించిన సర్వాలక్షణాలు పాదానికుంటాయనికాదు. పద్మంలోని మార్దవాదులతోనే పాదానికి సామ్యం వుంటుంది. ఈ రహస్యాన్ని తూర్ణంగా గ్రహించిన కవిబ్రహ్మ పద్మశరీరాన్ని వదిలేసి ఆత్మనందుకున్నాడు. పాదాలకు తామరరేకులతోకాక మూర్తీభవించిన మార్దవగుణంతో పోలిక చెప్పినాడు. అసలే తామరరేకులు మెత్తనివి. అంతకుమెత్తనివి ఆమెపాదాలు. తామరరేకులు గడియలో వాడిపోతవి. ఆమెపాదాలు నిత్యరమణీయాలు. ప్రతిక్షణం, ప్రత్యహం దర్శనయోగ్యమైన మార్దవం

కల్గిన ఆమెచరణాలకు, మ్లానతా స్వభావము కలిగిఉన్న తామర రేకులతో ఔపమ్యం కుదురుతుందా? అందుకే తిక్కన తామర రేకులలోని మెత్త దనంమాత్రమే సంగ్రహించినాడు. ఆ మెత్తదనాన్ని అచ్చుగోబోసినాడు. అప్పుడు తయారైంది ఆమె చరణయుగ్మం. రేకులు వాడిపోయినా మెత్తదనం స్వతహాగా నశించదు. అందుకే మెత్తదనానికి మూర్తి కల్పన చేసినాడు తిక్కన. ఈ రకంగానే ఇతర ఉపమానాలన్నీ విమృశ్య వైచిత్రికి కారణాలు.

కవిత్వం కళ. కళ బహిరుముఖంగా భాసిస్తున్న ప్రకృతికి అనుకరణం. కళలన్నిటిలో ప్రకృతికి అతిసన్నిహితమైంది కవిత్వం. అయితే, ఈ అనుకరణ సర్వత్రా చెల్లదు. ప్రకృతిని ఉన్నదున్నట్లు అనుకరించడమంటే తు. చ. తప్పకుండా గ్రంథానువాదం చేయటంనంటిది. అలౌకిక ప్రతిభావంతుడైన కవి ప్రకృతిని అనుకరించినా స్వేచ్ఛందతను విస్మరించడు. చిల్లపెంకులనుసైతం స్వర్ణశలాకలుగా చిత్రించేనేర్పు కవికి గలదు.

కవి కేవలం సుందర వస్తువులనే వర్ణింపడు. సన్నివేశానికి వన్నెదెచ్చే జుగుప్సావహములైన వస్తువులనుగూడ మహోత్సాహంతో వర్ణిస్తాడు. కవికి 'కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ'—అన్నీ వర్ణ్యాలే. అయితే, బీభత్సాన్ని వర్ణించే సందర్భంలోగూడా కవి సామాజికులకు జుగుప్స కలిగించడు. రమణీయతనే ఆపాదిస్తాడు. ధనంజయుడు 'దశరూపకం'లో ఈ విషయమే విస్పష్టపరచినాడు. షెల్లీ ఈ అభిప్రాయాన్నే ఈరకంగా వెల్లడించినాడు.

'Poetry turns all things to loveliness. It exalts the beauty of that which is most beautiful and it adds beauty to that which is deformed.'

తిక్కన మహాకవి ఈ అభిప్రాయానికేనాడో ఆయువుపోసినాడు. ప్రేతభూమి పరిసరారణ్యమంచున్న భయంకర శ్మశానవృక్షాన్ని ఈ రకంగా వర్ణించినాడు.

"నెగసిన కొనలేచి నిగిడి అంతంతకు
ఆవలద్రోవగ తనరారుదాని
చాగిన శాఖ లాశా చక్రమున కొలం
దులు జారనెట్టంగ పొలుచుదాని
కవట లొండొంటితో కదియుచు నెడములు
మ్రింగి ప్రబ్బగ సొంపుమిగులుదాని
లోని జొంపము పవలును పెనుచీకటి
నొదవించి పొదలంగ నొప్పుదాని
కనియె పవమాన బివిధ నర్తన కళాను
వర్తి, కాక ఘూకారవ స్ఫూర్తి జాత
భీతి పరిసరవర్తి, ఆభీలభుజగ
చండమూర్తి, శమీతరు చక్రవర్తి"

ఈ సీసపద్యములోని మొదటి ఎనిమిది పాదాలు చదవడంతో పఠితమనస్సు జలచరిస్తుంది. ఆ దీర్ఘశాఖలు; గుబురుజొంపాలు-వీటిని ఊహించడంవల్ల కల్గిన జలదరింపు పద్యంలోని నాలుగు చరణాలు చదివేసరికి మటుమాయమై పులకరింపుగా మిగిలిపోతుంది. క్రింది చరణాల్లో తిక్కన ప్రయోగించిన నర్తన కళానువర్తి, ఆరవస్ఫూర్తి ఇత్యాది శబ్దాలను శృంగార ఘట్టంలో చేర్చినా బాధకలిగించనివి. ఈ పద్యంలో కాకులు, గుడ్లగూబలు అరచిన చప్పుళ్ళు వినిపించడం చెప్పలేనుగాని అంత్యనియమాలతో, మృదంగం ముక్తాయింపులతో నడిచే ఈ పద్యంలోని గీతభాగం చదువుతుంటే కోకిలలు బాకాలూదినట్లే స్ఫురిస్తుంది. 'శమీతరు చక్రవర్తి' అని ముగించేవరకు 'శమీతరువు' స్మృతిఫలకంనుంచి జారిపోయి 'చక్రవర్తి' మాత్రమే నిల్చిపోతుంది. ఈ పద్యంలోని రీతీ, వృత్తీ చక్రవర్తిని వర్ణించినట్లే ఉంది కాని చెట్టును వర్ణించినట్లు లేదు.

జుగుప్సావహములైన ఘట్టాలను వర్ణించేటప్పుడు రమణీయతనే ప్రవర్శించడం తిక్కనతోనే ప్రారంభంకాలేదు. తెలుగు కవులలో తొలిసారిగా నన్నెచోడు శీరీతి రచన సాగించినాడు. నన్నెచోడుడు భయా

నకరసాలయములైన యుద్ధ ఘట్టాలలో ఈ రీతిని ప్రవేశపెట్టినాడు. తిక్కన యీ బాటకు రత్నాలు చెక్కుతూ పోయినాడు. నిర్వచనోత్తర రామాయణంలో రేఖామాత్రంగా ఈ ధోరణి కన్పిస్తుంది. యక్షనిశాట యుద్ధంలో 'కీలాల జలముపై దేలుచు నవ్వినట్లున్న శిరంబు లొక్కొక్క చోట' ఉన్నట్లు తిక్కన వర్ణిస్తాడు. భారతంలో సుశర్మకు, పాండవులకు జరిగిన పొలికలనులో 'కంధరములు తెగి తలలు వసుంధర నతిపక్వ తాళ సుభగ ఫలాళీ బంధురత' రాలిన వంటాడు. పొలికలనులో కీలాల జలం బుల పయిం దేలుచు నవ్వినట్లున్న శిరంబులవలన వికచారవింద దీర్ఘికల విడంబించు తావులున్న' వంటాడు. నెత్తురులో తేలియాడే ఖండిత శిరస్సులను ఊహించుకున్నప్పుడు సరస్సులలో వికసించిన అరవిందాలు స్ఫురించడం సంయమికి మాత్రమే సాధ్యం. కేనల కవిశబ్దవాచ్యుడు ఈ రకంగా కలనైనా ఊహించలేడు. భయానక బీభత్సాకరమ్మైన ఘట్టాలను తిక్కన చిత్రవిచిత్రంగా ఊహించినాడు. 'గాండీవ నిర్ముక్త క్రూర శరావళీ దళిత శత్రు వ్రాతముల్ శోణితాసిక్తాకారతపొంది నాంద్రకుసుమ్రక్షేణీ వికాసోల్లసద్రక్తాశోకతరువ్రజంబుల క్రియన్' రంజిల్లిన వట. 'ఎడనెడ మడుగులు గట్టు శోణితంబు నీల్గునందు' వింజా మరలు మరాళపుంజంబును నైనవట. 'సంగ్రామంబు అభిరామం బయ్యును ఘోరప్రకారమైన'దట. అర్జునుడు 'గాండీవంబు వీణగా వినోదంబు సలిపె'నట. ఒడలు గగుర్పొడిచే దృశ్యాలను సైతం సంయమ స్వభావం, రమ్యతా ప్రతిపాదనదృష్టి కలిగిన తిక్కన పరమసుందరము లుగా చిత్రించినాడు. ఈవృశమైన వర్ణనలతో తృప్తిపడక యుద్ధం 'రమణీయ భయానక' మయ్యెనని స్పష్టంగా అన్నాడు. ఈ రమణీయతా ప్రతిపాదన కొరవడితే యుద్ధఘట్టాలు చదివే పాఠకుడు కంపరమెత్తి 'బాబోయ్ బ్రతుకలే'నని పారిపోయే ప్రమాదమున్నది. జుగుప్సాకరము లైన ఘట్టాలు ఇంత మనోజ్ఞంగా వర్ణించడంవల్లనే తిక్కన భారత భాగాన్ని పదికాలాలపాటు అందరూ ఆదరంగా, ఆప్యాయనంగా చదువు తున్నారు. హరిహరనాథుణ్ణి 'రవిశశిమయ నేత్రు'నిగా, 'త్రైతోయ్యమ

బహుల తమోమార్తాండ దోఃక్రీడన ప్రక్రమ లలిత వికా'సిగా సంవర్శించిన తిక్కన మహాకవి అంతర్నయనాలకు లోకంలోని ప్రతి వికార వస్తువూ, ప్రతి అసహ్య దృశ్యం రమ్యతాశ్రీకంగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు.

భారత రచనలలో నన్నయ పౌరాణికునివలె కన్పిస్తాడు. ఎత్తయిన వేదికపై కూర్చుని ఉదాత్త స్వరంలో కథాకథనం చేస్తున్నట్లుగా కన్పిస్తాడు. తిక్కన అట్లాకాకుండా నేపథ్యంలో కూర్చుని పాత్రధారులచేత పలికిస్తున్న 'ప్రాంప్టరు'లా కన్పిస్తాడు. తానెక్కడా కన్పించడు. అయినా అన్ని ప్రాంతాలలో పరోక్షంగా తానే పలుకుతాడు. తిక్కన చిత్రించిన విరాటోద్యోగపర్వాలు రెండూ చక్కని నాటికలు. ఈ రెండు పర్వాలలో కవి వర్ణించినదానికన్నా పాత్రలు పరస్పరం సంభాషించుకున్న భాగాలే ఎక్కువ. 'అనిన విని' మొదలైన కొన్ని అతుకులు తీసివేసి, అంకవిభజన చేసివేస్తే రెండు పర్వాలను పద్య నాటికలుగా ప్రదర్శించవచ్చు. నాటకానికి ప్రాణం సంభాషణచాలనం. తిక్కన ఈ రెండు పర్వాలలో ప్రయోగించిన సంభాషణలు సహజ సుందరాలు. ఆ యా పాత్రల గుండెలను చీల్చుకొని పైకెగసిన సహజోక్తులు.

లోకంలో ఆయా సందర్భాలలో ప్రత్యేకమైన కాకుధ్వనిలో ఒక విలక్షణమైన పద్ధతిలో సంభాషణలు జరుగుతుంటాయి. తన కార్యాన్ని నెరవేర్చుకోవడానికి ఎదుటివాణ్ని కించిత్తుగా మెత్తగా బుజ్జగిస్తూ మాట్లాడ్డం, అతణ్ణి తాను బయటపడకుండా స్తుతిచేయడం నిత్య వ్యవహారాలలో జరుగుతుంటుంది. విరాటపర్వంలో సుదేష్ణ సైరంధ్రిని కీచకుని యింటికి కల్లుతేవడం అనే నెపంతో పంపించే సందర్భంలో ఇలా అంటుంది.

'కీచకుని యింట నెప్పుడు
వాచవియగు బహువిధముల వారుణి కలుగున్
వే చని యిచటికి కొని ర
మ్మా చూతముగాని నీ గమనవేగంబున్.'

ద్రౌపది కీచకుని యింటికి పొమ్మనగానే పోవని సుదేష్ణకు తెలుసు. అందుకే గట్టి నెపం ఆలోచించింది. 'ఒడవెడు తృష పెల్లిదమున వచనము వరువట్లు పల్టె'నని మొదటనే నూచించింది. ఇంకా ద్రౌపది కదిలే సన్నలు కనిపించలేదు. ఆమెను చేరదీసి జుట్టు దువ్వినట్టుగా మాటలు దిగుమతి చేసింది. వారుణి కీచకుని యింట్లోమాత్రం ఎప్పుడూ ఉంటుం దనే నమ్మకం ఏముందని ద్రౌపది ప్రశ్నిస్తుందని 'కీచకుని యింట నెప్పు డుండు'నని, అంతలో అలాంటిదీ ఇలాంటిదీ కాదు 'వాచవి' యగునది కలదనీ, మొగం మొత్తేట్లుగా ఒకేరకమైందికాక 'బహువిధముల వారుణి కల్గు'ననీ, పుంఖానుపుంఖంగా ఒక్క వాక్యంలో ఇన్ని సమా ధానాలు గుప్పించింది. తన తృషాధిక్యాన్ని బలపరచడానికి 'వేచని యిచ టికి కొని' రమ్మన్నది. ఇంతవరకు మాట్లాడినదంతా తన దప్పి గురించియే. సైరంధ్రికి సంతోషం కలిగించేమాట ఒక్కటైనా పడలేదే. వెంటనే అందుకున్నది: 'చూతముగాని నీ గమనవేగంబుక్'. తన పని నెగ్గించు కోవడానికి ఎదుటివారిని ఎట్లా దువ్వవలెనో సమగ్రంగా ఒంట బ్జీర్ణించు కున్న ఉక్తి యిది. ఇట్లాంటి సహజ రమణీయమైన సంభాషణలు రచిం చడమంటే తిక్కన్నకు నల్లేరుపై బండినడక.

గోగ్రహణం ఉత్తరుడు చేసినాడని ఉబ్బిపోయే విరటునితో ధర్మ జుడు బృహన్నలయే ఆ గెలుపునకు కారణమని అంటాడు. అప్పుడు విరటుడు కటకటపడి కన్నుల నిప్పులు రాలుతుండగా ఇట్లా అంటాడు.

నా కొడుకు పోటుమాటలు
నీ కేటికి పాసగనాడ నేరవు మార్ఖ్య
ద్రేకమున పల్కుచుంటివి
మాకు సహింపంగ రాదు మానుము విప్రా'.

'కన్నుల నిప్పులు రాలుచుండ' అన్నప్పుడు కనిపించని విరటుని వికత్థనత్వం, పరనింగాబుద్ధి, మొండితనం, దర్పం ఈ పద్యంలోని పొడి పొడి మాటల్లో విడిదిచేసికొన్నాయి. రాజు పూజ్యుడైన కంకుభట్టును 'విప్రా' అని

సంబోధించినాడు. అతణ్ని ఏకవచనంలో సంబోధించి స్వాభిమానాతిశయంతో 'మాకు సహింపంగ రాదు' అని తన్ను తాను బహువచనంలో బయటపెట్టుకున్నాడు. మాటమాటకు కినిసిపడే మహీపతుల సంభాషణ ధోరణిని ఈ పద్యంలో అచ్చుపడజేసినాడు తిక్కన. ఉద్యోగపర్వాంతం ఇట్లాంటి సహజ గంభీరాలైన సంభాషణలకు పుట్టినిల్లు.

సంజయుడు రాయబారం వెళ్లినప్పుడు ధర్మరాజుతో ఇట్లా అంటాడు :

'ఆల్పులకు మ్రింగ చేవైన హాలహలము
భంగి పొంగెడు కోపము మ్రింగికొనగ
నీలగళు నెన్ని నిన్నెన్న బోలు నట్టి
నీవు చాలినగాకేల నెగడు పేరు'.

ఈ మాటల వెనుక అసాధారణమైన కార్యచతురత, అలౌకికమైన లౌకికత దాగి ఉన్నాయి. దుర్యోధనుడు సూదిమొన మోపినంత నేలనైనా ఈయడని సంజయుని కేనాటికో తెలుసు. ఇంతో అంతో పాలు పంచుకొనని దే పాండవులు ఉండలేరని సంజయు డెప్పుడో గుర్తించినాడు. అయినా లౌకికానికి రాయబారం నడుపుతున్నాడు. పురుషకారాన్ని కూడా ప్రయోగించి చూద్దామని ధృతరాష్ట్రుని పంపుతో రాయబారంలో దిగినాడు. తగినట్లుగా జాగ్రత్తగా నచ్చజెప్పితే ధర్మరాజు వినకపోతాడా అనే ఆశ ఒకవైపు పొడసూపుతుంది. ధర్మజుణ్ణి మెత్తగా దువ్వడం ప్రారంభించినాడు. కోపం మ్రింగుకోవటంలో సార్థకనాముడైన నీలగళుని తర్వాత నీవే అన్నాడు. అల్పులు హాలాహలాన్ని మ్రింగలేరు అన్నాడు. ఇట్లా అనడంతో దుర్యోధనాదులు అల్పులనే ధ్వనిని ధర్మరాజు గ్రహిస్తాడనే సంజయుని నమ్మకం. వాళ్లు ఎట్లాగూ మ్రింగలేరని తేల్చివేసినాడు. ఇక మిగిలింది నీవే అన్నట్లుగా సూచించినాడు. కేవలం నీవే అనకుండా పరమశివుని వరుసలో ధర్మరాజును కూర్చోబెట్టినాడు. 'అట్టి నీవు' అనడంతో మహాశివునితో సాపమ్యం సంధించినాడు. అజాతశత్రువు ఉబ్బి

పోయేట్టు 'నీవు చాలిన గాకేల నెగడు పేరు' అన్నాడు. ఈ పద్యానికి ముందుగానే 'పాలీక కౌరవులు దుశ్శీలత చెడదలచిరేని చెప్పెద రుధిరాభీలాన్నంబున కంకెను మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్' అని తన్ను తాను బయలుపెట్టుకున్నాడు. పై పద్యంలో సంభాళించుకొని లౌక్యానికి దిగినాడు. తిక్కన చేత్తిలో ధర్మరాజు కేవలం ధర్మరాజే కాడు. లౌక్యాన్ని జీర్ణించుకున్న ప్రగల్భుడు. 'మెత్తని పులి'. సంజయునికి సమాధానంగా ధర్మాధర్మ ప్రసక్తి తెచ్చినాడు. కొన్ని కర్మలు ధర్మాల వలె కనిపించి 'బోధను లయంగ వచ్చిన నధర్మములై చెడు' అన్నాడు. మరికొన్ని 'ధర్మనర్తనములు గాక తోచి తుది ధర్మములై చను' నన్నాడు. ఎక్కడా తొణకకుండా బెణుకు పలికినాడు. పట్టుపట్టకుండా ప్రగల్భత చూపినాడు. ఈ రకంగా తిక్కన ప్రయోగించిన సంభాషణలు ఆయా పాత్రల మనస్తత్వాలకు అద్దాలైనవి. పొడి పొడి మాటలద్వారా పాత్రల గంభీరమూర్తులను కట్టెదుట నిల్పగల్గినవాడు తిక్కన.

దృశ్య సాక్షాత్కరణ పద్ధతి తిక్కన రచనలో పలుతావుల కనిపిస్తుంటుంది. విరటుని ఆస్థానంలో కీచకుడు ద్రౌపదిని తాచినప్పుడు భీముని అవస్థను తిక్కన ఈరకంగా వర్ణిస్తాడు:

'కనుగొని కోప వేగమున కన్నుల నిప్పులు రాల అంగముల్
కనలగ సాంద్రఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంత దంత పీ
డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై'.

ఈ పద్యం చదివినప్పుడు భీమసేనుడు పండ్లు పటపట కొరుకుతూ కనుబొమలెగురవేస్తూ ఘర్మ జలధారలు ప్రవహిస్తుండగా మహోగ్రంగా "ప్రళయ కాలానలమున గండరించిన యూపంబు కరణి" ప్రత్యక్షమవుతాడు.

పాంచాలి కృష్ణునితో తాను మున్ను వడిన భంగపాట్లు చెబుతుంటుంది. కొంత తడవు చెప్పి చెప్పి ఒక్కమారు ఆదిశక్తివలె విజృంభించి

'ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెండ్రుకల్
తావలచేతబూని ఆసితచ్ఛవిబొల్చు మహాభుజంగమో
నావిలసిల్లి వ్రేలగ మనంబున పొంగు విషాద రోషముల్
కావగలేక బాష్పములు గ్రమ్మగ దిగ్గన లేచి ఆర్తయై'

వాటిని గోవిందు ముందట పెట్టినది. బుస్సగొట్టే ఉరగాంగనవంటి ద్రౌపది పతిత కట్టెదుట నిలిచినది. ఆమె గ్రమ్మున విడిచిన వెండ్రుకలే మహా భుజంగంవలె వ్రేలాడినవట. ఇక ఆమె ఉగ్రస్వరూపం దుర్నిరీక్ష్యం. ఈ దృశ్యంగా సన్నివేశాన్ని సాక్షాత్కరించే నేర్పు తిక్కనకు నిండుగా ఉన్నది.

ఔచిత్యం కావ్యాలో అవశ్యం ఉండవలసిన మహాగుణం. సంస్కృత లాక్షణికులలో క్షేమేంద్రు డీ ఔచిత్యాన్ని లెస్సగా గుర్తించినాడు. 'ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం' అని క్షేమేంద్రుని సిద్ధాంతం. అలంకారాలకు, గుణాలకు ఈ ఔచిత్యమే మూలకందం. ధ్వనికారుడు సైతం 'అనౌచిత్యాదృతే నాన్య ద్రసభంగస్య కారణం' అన్నాడు. చక్కని ఔచిత్యంగల కావ్యం 'రసోపనిషత్తే' అన్నాడు. ఈ దృష్టితోచూస్తే తిక్కన భారతం రసోపనిషత్తు. ఔచిత్యం వృత్త నిష్ఠం పదనిష్ఠం. వృత్తనిష్ఠమైన ఔచిత్యానికి ద్రౌపది కీచకునితో తనపతుల పరాక్రమాచమలను వర్ణిస్తూ పలికిన 'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫురత్' అనే శార్దూలం నిదర్శనంగా తీసుకోవచ్చును. కీచకుణ్ణి అదరగొట్టటానికి ఉద్దేశించిన ద్రౌపది ఆంతర్యానికి పెద్ద పెద్ద జంగలుచాస్తూ దూకుడుగా వెళ్లిపోయే శార్దూలవృత్తం అత్యంత సముచితం. ఇట్లాగే సంజయుని రాయబార ఘట్టంలో అలుక వొడమిన ధర్మరాజు సంజయుణ్ణి దట్టిస్తూ స్వపక్ష సామర్థ్యాన్ని ఉగ్గడిస్తూ చెప్పిన 'గాండీవ జ్యారవంబుత్కటమయి' అనే స్రగ్ధరావృత్తం రౌద్రరస వ్యక్తికి సమర్థంగా ఉంది.

తిక్కన పదాచిత్ర్యానికి అనేక సందర్భాలను నిదర్శనంగా చూపవచ్చు. పథిశ్రమతో డస్సిన పాంచాలిని అన్న పంపున అర్జునుడు 'మోచికొని' తెస్తాడు. అప్పుడు తిక్కన ద్రౌపదిని 'పుష్పకోమలి' అంటాడు. పాంచాలి పుష్పకోమలి. కావునసే అర్జునుడు ఆమెను పూవు వలె మోచికొని తెచ్చినాడు. కీచకుడు పాంచాలి విరహంతో వేగిపోతూ అక్కచేసిన వాగ్దానం తలపునకు తెచ్చుకొని 'అమ్మదిరాక్షి కెమరు చూచి'నాడట. సైరంధ్రి సింహబలుని ఇంటికి మదిరకోసం పంపబడనున్నది. కీచకుడు మదిరాసక్తుడు. సైరంధ్రి ప్రసన్న నేత్రములు సైతం ఆ కామార్తునికి మదిరాకృతములుగానే స్ఫురించడం ఔచిత్యానంతం. నర్తనశాలకు ద్రౌపదితోపాటు కీచక వధార్థం వెళ్లుతున్న భీముడు 'ద్రౌపదీ రమణుడు' గానే వర్ణింపబడినాడు. పాంచాలికి పతు లేరురు. ఒక్క భీముడేకాదు. అయినా ద్రౌపదిని పరాభవించిన కీచకున్ని వధించడానికి ప్రతినబూని వెళ్లుతున్న భీమసేనుడే ఆ క్షణాన ద్రౌపదీ రమణాభిధకు సమర్హుడు.

వివిధ పాత్రల ఆంతరిక ప్రవృత్తులకు శబ్దరూప నివ్వడంలో తిక్కన విశిష్టతను కనబరచినాడు. నన్నయ్య కూడా కనబరచని మనస్తత్వ నిరూపణం తిక్కన చేసినాడు. కొంతవరకు నన్నెచోడుడు మనస్తత్వ చిత్రణలో తిక్కనతో తులదూగుతాడు. విరహ దోదూయమానుడైన కీచకుని ఆందోళిత మనస్సును తిక్కన ఈవిధంగా ప్రవర్శించినాడు.

'ఎవ్వరితోనైన ఎలుగెత్తి యొక్కింత
పనిలేని వెంగలి పలుకు పలుకు
మట్టియ లొండొంటి బిట్టు దాకగనేల
నందంద మునిగాళ్లు నప్పళించు
కడు వికారంబుగా ఒడలెల్ల విరుచుచు
మలగి రిత్తకు రిత్త సెలగి నవ్వు
తాళంబుగా కరతలమున పెలుచ కం
బంబు ప్రవేయుచు వెడపాట పాడు

మలయు నంతంత చేరువ పొలయు ఇంతి
తన్ను జూడమి కెంతయు తల్లడిల్లు
ఇక్క డక్కడ బడు తగు లినుమడింప
జూచు నత్తన్వి పొరి పొరి కీచకుండు.'

ఈ పద్యంలో కీచకుని మనఃప్రవృత్తికి, అతని బాహ్య చేష్టలకు సన్నిహిత సంబంధాన్ని చూపినాడు తిక్కన. ఈ పద్యాన్ని చదువగానే నన్నె చోడుని 'పులకాంకురంబులు తలలెత్తి మేను కంపింప కోమలి కౌగిలింప దలచు' అనే పద్యం స్ఫురణకు వస్తుంది. విరహ జ్వర పీడితుడైన కీచకుడు 'మాయ రవి యేల గ్రుంకడొకో' అన్నప్పుడు తిక్కన చూపిన మనస్తత్వ నిరూపణనిపుణత స్పష్టంగా కనిపిస్తుంది.

మహాకావ్యానికి వర్ణన అత్యవసరం. పురవర్ణన మొదలుకొని పరిణయ వర్ణనదాకా గల అష్టాదశ వర్ణనలతో ఒప్పినదే మహాకావ్య మని ప్రతాపరుద్రీయాదులలో ఉన్నది. అయితే ఈ వర్ణనలు కావ్య వస్తువునకు పోషకములై ఉండవలె. భారతం ప్రధానంగా ఇతిహాసమైనా తిక్కన దానిని మహాకావ్యంవలె మలచినాడు. అష్టాదశ వర్ణనలను లెక్కపెట్టి పట్టిక యియ్యకున్నా సూర్యోదయాస్తమయ, చంద్రోదయాస్తమయాది వర్ణనలు కొన్ని చేసినాడు. చేసిన కొద్ది వర్ణనలు మాత్రం కథా శరీరానికి పుష్టిని చేకూర్చేవిగా ఉన్నవి. తిక్కన ప్రభాత వర్ణన యిట్లున్నది.

"ద్రుపదనందన పరిభవ దుఃఖునకు
ఉల్లమున దురపిల్లుచున్న సరసి
వేడి నిట్టూర్పులో యన వెడలె క్రొత్త
తావి మూతులు విచ్చు నెత్తమ్మి విరుల"

కీచకుడు పాంచాలిని పరాభవించిన తర్వాత వ్రాసిన పద్యమిది. పరమ సాధ్వియైన ద్రౌపదిని కీచకు డవమానించడం ప్రకృతి సైతం సహించ

లేదు. ఈ పద్యంలో తిక్కన ప్రకృతికి, కావ్య వస్తువుకు అభేదాధ్యవసాయం చూపినాడు. ఉద్యోగపర్వంలో ఇట్లాంటి ప్రభాత వర్ణననే తిక్కన ఈరకంగా చేసినాడు.

"తన కులంబున బుట్టిన ధార్తరాష్ట్రి
లన్న దమ్ములతో విగ్రహంబు గొనుట
కు మ్మలించి వివర్ణత నొందినట్లు
కంది యెంతయు చెలువేచె చందురుండు".

సంజయుని రాయబారం విఫలమైన పిమ్మట ప్రాసిన పద్యమిది. యుద్ధ లక్షణాలు బలపడుతున్న సందర్భం. చంద్రాస్తమయాన్ని కథా వస్తువుతో చమత్కరించి కావ్యాత్మకు, ప్రకృతికి ఉన్న అభేదప్రతిపత్తిని చూపినాడు.

తిక్కన కేవలం వృత్త వైవిధ్యంతో, సమాసచాలన చాతుర్యంతో ఒక భావాన్ని వెల్లడించడు. అప్పుడప్పుడు వట్టి పొడిపొడి మాటలను ప్రయోగించి ఒక మహాభిప్రాయాన్ని వ్యక్తపరుస్తాడు. లోకంలో విభిన్నవ్యక్తులు మాట్లాడుతుండగా నిశితంగా పరిశీలించిన లోకజ్ఞుడు తిక్కన. తాను సమాజంలో నిత్యం చూచిన వ్యక్తులనే కావ్య పాత్రలలో ప్రవేశపెట్టినాడు. తాను నిత్యం విన్న గడుసు మాటలనే పద్యీకరించినాడు. 'దుర్వారోద్యమ బాహు విక్రమ' వంటి సమాసాలు 'అసిత చ్ఛవి బొల్చు మహా భుజంగమో' వంటి బరువైన బలమైన మాటలు చేసే పనిని విడి విడి మాటలతో చేయించినాడు. కృష్ణుని రాయబార ఘట్టంలో పాంచాలి తాను పూర్వం అనుభవించిన యిక్కట్టులను చెబుతూ దుశ్శాసనాకృష్టమైన తన జడను చూపి యిట్లా అంటుంది.

'ఇవి దుస్సనేను ప్రవేళ్ళన్
దవిలి సగము ప్రెవ్వి పోయి దక్కినయవి కొ
రవులకడ తీఱుమాటల
అవసరమున తలపవలయు నచ్యుత వీనిన్'

కృష్ణుడు రాయబారానికి వెళ్లనున్నాడు. ద్రౌపదికి సంధివాక్యాలు రుచించవు. అజాత శత్రువుకు యుద్ధం ఇష్టంలేదు. కృష్ణుడు లౌక్యానికి రాయబారియైనాడు. ద్రౌపదికి దుశ్శాసనుని నెత్తురు కండ్లచూడవలె ననే కసి బుసకొట్టినది. హస్తినాపురంలో దుర్యోధనాదులు చేసే సత్కారాలకు పొంగిపోయి శ్రీకృష్ణుడు తన పరాభవాన్ని మరచిపోతాడేమో అనే సందేహం తలెత్తింది. కృష్ణుని గుండెను దూసుకొనిపోయే టట్టు 'కౌరవులకడ తీఱుమాటల అవసరమున' తన తెగిపోయిన వెండ్రుకలను జ్ఞాపకం చేసుకొమ్మన్నది. పైగా కృష్ణున్నే 'అచ్యుత' అని సాభిప్రాయంగా సంబోధించింది. 'తీఱుమాటల'లో పడి నన్ను మరచిపోయేవు సుమా అనే ధ్వనితోపాటు 'అచ్యుత' అనే శబ్దంవల్ల వాళ్ల తీయ మాటలకు జారిపోయేవుసుమా అనే హెచ్చరికకూడా చేసింది. శ్రీకృష్ణుడు 'అచ్యుతుడు' కాబట్టి తన పంతం నెగ్గుతుంచనే ఆత్మ విశ్వాసాన్నికూడా ప్రకటించింది.

సంజయుడు ధృతరాష్ట్రుని పంపునవచ్చి ధర్మరాజాదులను కురుపతి పత్నీన కుశలప్రశ్న లడుగుతాడు. అప్పుడు ధర్మరాజు ఇట్లా అంటాడు.

'ఆ రాజు మాదెసం గల
కారుణ్యము కతమునను సుఖంబున నిట్లు
న్నారము నిను పుత్తెంచిన
గారవమున నాదు మది వికాసము పొందెన్'.

ధృతరాష్ట్రుడు దుర్యోధనున్ని కావనలేడని ధర్మరా జెరుగును. అతడు గట్టిగా నిల్చుంటే తమకు వనవాస దుర్గతి పట్టేదికాదు. కేవలం కన్నీళ్ళు తుడవడానికే సంజయున్ని పంపినాడని ధర్మజుడు ఎప్పుడో గ్రహించినాడు. ధృతరాష్ట్రుడు పదమూడేండ్లకు కుశలప్రశ్నలు చేయిస్తుండడం అజాత శత్రువుకు చుర్రుమన్నది. కొరడా కొసలు మెత్తగా జళిపిస్తూ ఆ రాజు పుణ్యాన సుఖంగానే ఉన్నామన్నాడు. పెదతండ్రిని 'ఆ రాజు' అనడంలోనే ఉంది చురుకు. అతని దయవల్ల సుఖంగా ఉన్నామనడంలో

వాచ్యార్థ వ్యతిరిక్తమైన అభిప్రాయం స్ఫురిస్తుంది. సమస్త భూమండల వహన శౌండులైన పాండుపుత్రులు ఉపప్లావ్యంలో ఉండడం సుఖంగా ఉన్నట్లు లెక్కా? 'సుఖంబున నిట్లున్నారము' అనడంతో ధర్మరా జెంతగా ఉడికిపోతున్నాడో విశదమవుతుంది. తప్పు ధృతరాష్ట్రునిది గానీ దూతయైన సంజయునిదా? ఆందుచేత వెంటనే అందుకున్నాడు సంజయా మా సుఖాని కేమిగాని నీవు రావడంవల్ల నా మనస్సు వికాసం పొందింది అని. రాయబారి మనస్సు నొప్పించకుండా ఉండడం రాజ ధర్మ మని ధర్మరాజుకు తెలుసు కాబట్టి వెంటనే సంభాషణాధోరణి మార్చివేసి నాడు. ఈపద్యంలో ప్రయోగించిన మాటలు నట్టి మాటలు మాత్రమేనా? పైకి సాధారణంగా అమాయకంగా కనిపించినా లోపల తుపాకీ గుండ్లను దాచుకున్నవి. ఇట్లాంటి పసగల మాటలు రాయబార ఘట్టాలలో కొల్ల లుగా కన్పిస్తాయి. సామాన్యములైన తెలుగు పలుకులకు ఎక్కడలేని చేవ కూర్చిన ఏకైక కాంధ్ర కవి తిక్కన. యుద్ధ పంచకంలో తిక్కన కన బరచిన యుద్ధకళా కౌశలం, శాంతిపర్వాదులలో అతడు ప్రకటించిన తాత్విక దృష్టి అనితరసాధ్యాలు. ఆంధ్ర సాహిత్యంలోనే కాక ప్రపంచ సాహిత్యరంగంలో మహాకవుల సరిబంతిలో కూర్చొన్న గలిగిన ప్రజ్ఞాశాలి తిక్కన. ఇంగ్లీషులో షేక్స్‌పియర్‌కువలె తెలుగునాట తిక్కనకు భాష్యం చెప్పే వేల మల్లినాథులు ఉవలుంచవలసి ఉన్నది.

రంగనాథరామాయణం

తమసానదిలో స్నానంచేయడానికి వాల్మీకి మహాముని వెళుతాడు. అతనికి నదీతీరంలో పరస్పరం చంచూపుటాలను ఆడించుకుంటూ, గుండె లను ఒలకబోసుకుంటూఉన్న క్రౌంచపక్షులజంట కన్పిస్తుంది. మరునిమి షంలో కిరాతకుని శరాఘాతంతో క్రౌంచం విలవిల తన్నుకుంటూ నేల గూలుతుంది. క్రౌంచి చించుకొని అరుస్తుంది. వాల్మీకిగుండె చెమ్మగిల్లి పోతుంది. అతని ముఖతః ఈవృశమైన అక్షరపంక్తి వెల్లుబుకుతుంది.

మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునాదేక మవధీః కామ మోహితమ్"

ద్రష్టయైన వాల్మీకి వాక్కులలో ఛందస్సు మంచహాసంచేసింది. ఆ కరుణాళువు శ్లోకమే శ్లోకంగా రూపొందింది. అంకురప్రాయమైన ఈ శ్లోకమే తదనంతరం రామాయణ కల్పద్రుమంగా ఉద్గమించింది. దాని నీడల్లో అనేక కవులు చలివేంద్రలు నిర్మించుకున్నారు. ఆ సురతరువు చరణాల ప్రేమాల కూర్చొని తెలుగుకవి గోనబుద్ధారెడ్డి రామచరితమును సామాన్యులకూ మాన్యులకూ వినిపించినాడు.

బుద్ధారెడ్డి స్వీకరించిన చంపస్సు ద్విపద. అతనికి పూర్వమే పాల కురికి సోమనాథుడు వీరశైవమత ప్రతిపాదనకై ద్విపదను మైనంలా మలచు కున్నాడు. మధువులా పారించినాడు. క్రమంగా పాలకురికి కావ్యాలు తెలుగు ప్రజల హృదయాలతో పెనవేసుకొనిపోయినవి. ఈ రహస్యాన్ని గమనించిన బుద్ధారెడ్డి శార్దూలాది సంస్కృతవృత్తాల జోలికిపోక దేశి సాహితికి మణిపూసలైన ద్విపదల్లోనే రామకథను గానంచేసినాడు.

"పదము లర్థంబులు భావముల్ గతులు
పదశయ్య లర్థ సౌభాగ్యముల్ యతులు
రసములు కల్పనల్ ప్రాస సంగతులు
అసమాన రీతులు—"

కలుగ, తన తండ్రి విఠలనాథుడు వేద రామాయణమును పురాణమార్గంలో విన్పించినాడు. కవితారీతిలో నన్నయనెన్నుకున్నాడు. తేటతెనుగు పలుకుబళ్ళ పోహళింపులో పాలకుడికిపైకన్నించినాడు. అత డవలంబించినది పురాణమార్గము. అయితే రామాయణము భారతము వలె అధ్యాత్మ విదులకు వేదాంతంగా, ఇతిహాసికుల కితిహాసంగా, పౌరాణికులకు బహుపురాణ సముచ్చయంగా వెలసిన గ్రంథంకాదు. ఇది ప్రధానంగా కావ్యం. సీతారాముల ఆత్మవల్లరులు పెనవేసుకొనిపోయిన కాయమానం. ఇలాంటి మహాకావ్యాన్ని వర్ణనాబహుళమైన ప్రబంధంలా కాకుండా సాధు రమణీయమైన పురాణ ఘుంటాధ్వనంలో నడిపించినాడు బుద్ధారెడ్డి. బుద్ధారెడ్డియే దీనికి కర్తయనడానికి ఈ కావ్యమంతటా ఆధారాలున్నవి. అయినా చిత్రంగా దీనికి "రంగనాథ రామాయణ" మనే పేరు వచ్చేసింది. రంగనాథుడనే ఒక కవి ఈ కావ్యాన్ని రచించి బుద్ధారెడ్డి పేరుంచినాడని జనశ్రుతి పొడచూపింది. పలువురు ప్రాచీనాంధ్ర కవులుచేసిన పూర్వకవిస్తుతిలో రంగనాథుని ప్రస్తావన ఉన్నమాట వాస్తవమే. అయినా ప్రబలసాక్ష్యం దొరికేదాక ఈ రామాయణకర్త బుద్ధారెడ్డియే అననలసివస్తుంది.

కావ్యపీఠికలో బుద్ధారెడ్డి "ఆదికవీశ్వరుడైన వాల్మీకి యీవరం బున పుణ్యులందరు మెచ్చ జెప్పిన తెరగున శ్రీరామ చరిత మొప్ప జెప్పెద"నని అంటాడు. అంతేకాని యథానువాదం, పదానువాదంచేస్తా నని అనలేదు. రంగనాథరామాణంలో కథ ఇలా ప్రారంభమవుతుంది.

"ఘన తపస్స్వాధ్యాయ కమనీయశీలు
మునినాథు నారదమునిలోకవంద్యు
అనఘుతపోనిధియైన వాల్మీకి
కనుగొని యొకనాడు కరమర్థి నడిగె"

ఇది చదవగానే సహృదయునికి వెంటనే వాల్మీకి మూలం జ్ఞాపకానికి వస్తుంది.

"తపస్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరం
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవం"

బుధారెడ్డిపద్యం వాల్మీకి శ్లోకానికి అచ్చమైన ప్రతిబింబం. కావ్యమంతా ఇలాగేఉంటే అనువాదగ్రంథం అనవలసివచ్చేది. అలా అనడానికి వీలులేకుండా బుద్ధారెడ్డి తనరామాయణంలో మౌలికమైన ప్రతిభా ప్రపత్తులను అనేకపర్యాయాలు ప్రదర్శించినాడు. కొన్నివర్ణనలను పెంచినాడు. కొన్నిటిని త్రుంచినాడు. కొన్ని సరిక్రొత్త కథాంశములనే సాహసించి జోడించినాడు. ఇతని రామాయణంలో వాల్మీకిలోలేని కాలనేమివృత్తాంతం, సులోచన సహగమనం, జంబుమాలికథ మున్నగునవి ప్రవేశించినవి. లక్ష్మణుడు సీతాదేవి యెత్తిపొడుపులను భరించలేక రామునికోసం పర్ణశాల విడిచివెళ్ళేముందు

"పర్ణశాల చుట్టు బరులేడు ద్రవాసి
వర్ణించి యాబరుల్ వడి దాటకమ్మి
ఎవ్వడేనీ బరుల్ వెసదాటి వచ్చు
నవ్వీరవరు తలలవియు నాక్షణమె"

అని చెప్పిపోయినట్లు ఈ రామాయణంలోఉంది. ఇది వాల్మీకిలో కనిపించదు. వాలి వధానంతరం తార శ్రీరామున్ని ఎత్తిపొడుస్తూ

"ఈ వాలి నెడబాసి యే నుండజాల
దేవ నన్నునుబట్టి తెగటార్చవయ్య"

అని అన్నట్టుగా ఈ రామాయణంలో వర్ణింపబడింది. వాల్మీకి తారా విలాపాన్ని మాత్రమే వర్ణించినాడుగాని తదుపాలంభాన్ని తడవలేదు. ఈ వృత్తాంతాలను బుద్ధారెడ్డి బహుశః తనకాలంలో ప్రచలితంగాఉన్న జానపదగాథలనుండి సేకరించివుంటాడని విజ్ఞులఊహ.

రంగనాథ రామాయణం అచ్చంగా ద్విపద కావ్యమైనా, గతి భేదంవల్ల పదప్రయోగ వైచిత్ర్యంవల్ల విసుగుకొల్పకుండా నడిచింది. కావ్యం కాంతాసమ్మితంకదా. అనగా కావ్యాత్మ పతిని స్వాధీన పతికవలె గిలిగింతపెట్టి వశీకరించుకోవాలి. ఇది ఆత్మవిషయం. ఇక కావ్య శరీరంకూడా కాంతామణుల సర్వాంగీణ సౌచిత్రిని కలిగివుండాలి. సమతలాన ప్రవహించే మహానది ప్రక్కనే కొండకొమ్మలనుండి గలగలదూకే సెలయేరుంటే ఎంత మనోజ్ఞంగా ఉంటుంది. ఆరకంగానే సమర్థమైన సంస్కృత సమాసాల ఛాయలోనే తెలుగుపల్కుల కప్రపు మొల్కలు గుబాళిస్తే ఎంతహాయిగా వుంటుంది. ఈదృష్టితో రంగనాథ రామాయణంలో పురాలంకార వర్ణన చూడండి.

"గంధకస్తూరికాకలితాంబు పూర
గంధిల సకల మార్గ ధరాంగణంబు
చీనిచీనాంబర శ్రేణీ వితాన
నానా మణీతోరణ ధ్వజాంచితము
ఫలభార కమ్రరంభాస్తంభ పూగ
కలిత ప్రతిద్వార కక్ష్యాంతరంబు
సాంకవలిప్త విస్తార వితర్ది
కాంకిత రంగవల్ల్యాది శోభితము"

ఇలా అలంకృతి నడచిన రచన వెంటనే

"పచ్చరా జగతిపై పసిడి కంబములు
మెచ్చుగా నిల్పి ఆ మీద నీలంపు
బోదెలు కరువిందముల దూలములును
పాదుగా నిడి తీరుపడ చెక్కడంపు

గోమేధికంబుల కొణిగెలు బరివి
గామల్చి పై వజ్రగార యొసంగి''

ఈ రకంగా మువ్వలాడిస్తూ ముట్టెకవలిస్తూ పరుగెత్తుతుంది.

పదప్రయోగ పైచిత్రిలోనేకాక వర్ణనల విషయంలోగూడా ఈ కావ్యంలో వాల్మీకిలోలేని విలక్షణత కన్పిస్తుంది. ఇలా అనడం వాల్మీకి రామాయణం విలువ తగ్గించడంకాదు. మాతృమూర్తియైన ఆ మహాకావ్యం యొక్క స్తన్యబలంవల్ల దాని ముద్దుబిడ్డ పోయినశ్రోత్రాంగ్రొత్త పోకడలను మాత్రమే నేనిక్కడ ఉటంకిస్తున్నాను. మూలంలో హేమంత వర్ణన సందర్భంలో ఇలావుంది:

అవశ్యాయ నిపాతేన కించిత్ ప్రక్లిన్న శాద్వలా
వనానాం శోభతే భూమిర్నవిష్ట తరుణాతపా''

రంగనాథ రామాయణ కర్త ఈ భావానికి ఈ రకంగా పచ్చల తురాయి తొడిగినాడు.

''ఊర్వీపై నా మంచు ఒక్కొక్క చోట
దూర్వాంకురంబుల తుదల జూచితివె
పచ్చమిన్న సలాక పొజుపై వేడ్క
గ్రుచ్చిన ముత్యాల క్రోవలైయొప్పె''

ఈ హేమంత వర్ణనలోనే మరోచోట మూలంలో ఇలావుంది:

'జరా జర్జరితైః పత్త్రైః శీర్ణకేసర కర్ణికైః
నాళశేషైర్హిమధ్వస్తైర్న భాంతి కమలాకరాః'

ఈ తామరలే రంగనాథ రామాయణంలో ''రొలను దేవతలకు కుంపట్లువోలె విలసిల్లు కెందమ్మి విరు'' లవుతాయి. ఇది బుద్ధారెడ్డి

వకాలిక ప్రతిభాసంజాతమైన కల్పన. హేమంతఋతువులో సరస్సరస్వతులకు ఎర్రతామరలు కుంపట్లలాగా ఉపకల్పించినవనడం ఔచిత్యపోషణంలో తరళాయమాన కల్పన.

అచ్చమైన తెలుగుకవి తప్ప మరొకడు పల్కలేడేమో అనిపించే కొన్ని వర్ణనలు రంగనాథ రామాయణంలో కన్పిస్తాయి. మన ప్రాచీన కవులలో చంద్రుణ్ణి వర్ణించనివాళ్ళు కలికానికి కానరారు. తిక్కనకు చంద్రుడు "చిత్తజు చిగురులక్ చిత్రంబుగానిడ్డి లలితతమాల పల్లవ వనంగ" కన్పడినాడు. బుద్ధారెడ్డికి కల్పించిన చంద్రుడు వైచిత్రీ సోం ద్రుడు. అతడు—

"చిరకాలముల సీమ శిశువుల మామ
పాలవెల్లిని ద్రచ్చి పడసిన వెన్న
శూలి యాదల పుష్ప చుక్కలనవ్వ
ఉరువేది విరహుల నుడికించు మంట."

చిరకాలముల సీమ అనడంతో చంద్రుని చిరంతనత్వం, శిశువుల మామ అనడంతో పసిపిల్లల నిత్యజీవితాన్ని ప్రతిబింబించే ఒక నిసర్గసత్యం, పాలవెల్లి ద్రచ్చిపడసిన వెన్న అనడంతో సంప్రదాయసిద్ధంగా వస్తున్న ఒక విశ్వాసాన్ని సాలంకృతంగా ఎమటనిలిపేటంత రసవత్తర సత్యం ద్యోతకమవుతాయి. ఇక చివరి చరణాల్లో చెప్పబడిన అభిప్రాయం, దానికి ఉపపుష్టమైన పలుకుబడులు, పరమరమణీయంగా ఉన్నవి. "ఉరు వేది విరహుల నుడికించు మంట" అనే చరణం గుండెల కంటుకొని పోయేలాగుంది. మంటలవంటి మాటలకు మధువనంటించి పల్కడంవల్లనే రంగనాథ రామాయణం మామూలు ప్రజల మనస్సుకెక్కింది. ఓలగాల నుండి తోలుబొమ్మలాటల దాకా ప్రాకింది.

ఈ కావ్యంలో వర్ణనలతోపాటు కథను సరళంగా సుందరంగా చెప్పే పద్ధతికూడా గమనించతగింది. అలంకారాల ఆలంబనం లేకుండా

పొడిపొడిమాటలతో భావోల్బణం కలిగించడమే ఒక గొప్ప నేర్పు. కథా ప్రధానములైన కావ్యాలకు ఈ పద్ధతియే అనుసార్యం. రామచంద్రుడు నగర నిష్క్రమణం చేస్తున్నఘట్టంలో బుద్ధారెడ్డి ఈ పద్ధతిని చేపట్టినాడు. రామచంద్రుని రథం ముందు నడుస్తుంటుంది. దశరథుడు పుత్రవియోగం సహింపలేక రథ మాపుమని సుమంత్రుణ్ణి పిలుస్తుంటాడు. రథమాగదు. వశిష్ఠుడు దశరథుణ్ణి ఓదారుస్తాడు. రథం వెళ్ళిపోతున్నదని చెబుతాడు. తర్వాత ఇలావుంది.

"అనవుడు దశరథు డటుపోకనిలిచి
తన సూను రథమును తప్పక చూచి
అదియుగానక ధూళి నటుచూచి చూచి
అదియుగానక బయ లటుచూచి చూచి
హాయని యెలుగెత్తి హా రామ రాను
హాయని మూర్ఛిల్లె—"

రథం కన్పించదు. ధూళికన్పిస్తుంది. కొంతసేపటికి ఆ ధూళికూడా కనిపించదు. దశరథునికి శూన్యంమాత్రమే కనిపిస్తుంది. ఇలా అలతి అలతి తునియలుగా ఒక అభిప్రాయాన్ని చెప్పడం చక్కని కథాశిల్పం. "రథం వెళ్ళిపోయింది. దశరథుడు మూర్ఛిల్లినాడు" అనే ధోరణిలో ఎంత బిగువుగా చెప్పినా ఈ వాతావరణంరాదు. "అదియుగానక" అనే మాటను రెండుసార్లు ప్రయోగించడంవల్ల "అటుచూచి చూచి" అనే మాటలను మళ్ళీ మళ్ళీ వ్రాయడంవల్ల దశరథుని మనస్సులో కలుగుతున్న ఆందోళనకు రూపేర్పడింది. దశరథుని మనో వ్యాకులతను చెప్పడానికి బుద్ధారెడ్డి చక్కని కథనరీతిని సాధించినాడు.

ఆంధ్ర సాహిత్యలోకంలో రంగనాథ రామాయణానికి ఒక ప్రత్యేక స్థానమున్నది. శివకవుల ఆవేశమిందులో లేకపోవడం, ప్రబంధకవుల పద బంధాలకిది దూరంగా ఉండడం–ఈ రెండుగుణాలు రంగనాథ రామాయణ

కావ్య గౌరవాన్ని ఇనుమడింపజేసేవిగాఉన్నవి. జనుల మనస్సులనే మందిరాలుగా మలచుకొన్న ఈ రామాయణవాణి నాటికీ నేటికీ సహృదయులకు ఆరాధ్యమయింది. రంగనాథ రామాయణం రసజగత్తున కుపాయనం. రామకథ యుగాలకూ యుగాలకూ మధ్య పరిమళ సోపాన పంక్తి నిల్పినది.

"చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరం,
ఏక్కైక మక్షరప్రోక్తం మహాపాతక నాశనం".

తెలుగు కావ్యాలలో సాంఘిక జీవనం

1. శుకసప్తతి

మన ప్రబంధ కవులలో రెక్కలు గట్టుకొని ఎగసినవాళ్లూ, చుక్కలన్నై విడిది చేసినవాళ్లే ఎక్కువ. రెండు కాళ్లతో నేలమీద తిరిగిన వాళ్లను, రెండు కళ్లతో తమ చుట్టూవున్న లోకాన్ని చూచినవాళ్లను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. వాళ్లలో పలువురికి "వప్రస్థలీ చుంబి తాంబరా"లైన సౌధాలమీద ఉన్న దృష్టి "ఇంటిలో పూరియిడి విసరక రాజని" పొయిలుండే అడుసు గుడిసెల మీదికి అంతగాపోలేదు. వాళ్లు ఊరు అంటే గోక్షీరంబులతో, ఘృతంబులతో, గోస్తనీ ఫలాలతో మిసమిసలాడే షడ్రసోపేత భోజనాలను నోరార వర్ణించినారే కానీ, గురుగు కూర, చెంచలికూర, తుమ్మికూర, చింతచిగురూ కలిపి తాలింపుచేసిన కూరల్ని, చిన్నారిక అన్నాన్ని, నాల్కన్నైకి రానీయలేదు. కృష్ణదేవ రాయలవంటి ఒకరిద్దరుమాత్రం తాము ఊపిరి పీలుస్తున్న సమాజానికి స్వరూప దర్శనం చేయించే నిలువుటద్దాలవంటి నిదాకావ్యాలు సృష్టించినారు.

ఈ దృష్టితో పాలవేకరి కదిరీపతి ప్రాసిన శుకసప్తతి చక్కని కావ్యం. కదిరీపతి ఇంచుమించు క్రీ. శ. 1630 ప్రాంతంవాడని శ్రీ సుర వరం ప్రతాపరెడ్డిగారు అభిప్రాయపడినారు. శుకసప్తతిలో ఈ కవి తన వంశావళిని సుదీర్ఘంగా వర్ణించినాడు. ఈ వర్ణనలనుబట్టి కదిరీపతి తాత రామరాజు "శ్రీ రంగరాయవత్త మత్స్యమకరధ్వజాభ్యుడై"నట్లు తెలుస్తున్నది. శ్రీ రంగరాయలు 1572-85 నాటి వాడని చారిత్రకుల అభిప్రాయం. ఇంతకూ కదిరీపతి 17 వ శతాబ్దపు తొలిపాదమువాడని నిర్ణ

యించడానికి వీలుంది. ఇక శుకసప్తతిలో 17 వ శతాబ్దినాటి సాంఘిక జీవనం ఎలా ప్రతిబింబించింది వివరిస్తాను.

కదిరీపతి నన్నయ్య మొదలుకొని తనచాకా ఉన్న కవుల మర్యాద లన్నిటినీ తనలో ఆకళించుకున్నాడు. సామెతలకు, తెలుగు పలుకుబళ్లకు ఇతడు కాణాచి. సహజోక్తులకు, నిసర్గ వర్ణనలకు ఇతని కావ్యం పెట్టని కోట. అయితే ప్రబంధ కవుల గాలి సోకినవాడు కాబట్టి "పద్మాప్త పద్మాప్త పద్మాప్తతుల్యుడు" వంటి శ్లేషోత్కర్షలూ, "సురసరి త్పురహరశిరత్" వంటి అనుప్రాసల హడావిడులూ చేయకుండా ఉండలేక పోయినాడు. అలా అని కేవలం శుష్కపదబంధాలతో చిత్ర కవిత్వాలతో చేతులు దులుపుకున్నవాడు కాడితడు. వాస్తవికత పేరుతో వట్టి చొప్పవంటు కవిత్వాన్ని పుట్టించినవాడూ కాడితడు. చీకట్లను కకుబ్బధ ముఖులకు కస్తూరి పూతలుగా, తోటలకు కోయిల బోటులుగా, కొలకులకు ఎలదేటులుగా ఊహించిన ప్రజ్ఞాచతురుడు. ఇలాంటి ఎన్ని కల్పనలున్నా, ఎన్ని చమత్కారాలున్నా శుకసప్తతిలో అడుగడుగునా గిలిగింతలు పెట్టేది ఆనాటి సాంఘిక జీవన ప్రతిబింబం. ఒకరకంగా చూస్తే సింహాసన ద్వాత్రింశిక, హంసవింశతి మొదలైనవాటివలె ఈ శుకసప్తతి ప్రబంధం పేరుతో చలామణిలో ఉన్న సాంఘిక చరిత్ర.

శుకసప్తతిలో 17 వ శతాబ్దినాటి మత పరిస్థితులు, వివిధ వర్ణాలకు చెందిన ప్రజల ధోరణులు, వాళ్ల ఆచార వ్యవహారాలు, వాళ్ల వేష భాషలు, ఆనాటి వ్యాపారం, వ్యవసాయం, ఆటలూ పాటలూ, వినోదాలూ, విలాసాలూ, ఒక మేమిటి సంఘచక్రానికుండే అంచులన్నీ తళతళమెరుస్తూ కనిపిస్తాయి. ఆనాటిపల్లెలు ఉత్సవాలతో, ఉద్వేగంపులతో కలకలలాడుతూ ఉండేవి. 'నిత్యకళ్యాణం పచ్చతోరణం' అనే మాట ఆనాటి పల్లెలో అక్షరాలా అనువర్తించేది. ముఖ్యంగా రథోత్సవాలనాటి వేడుక అతిలోకంగా ఉండేది. స్వామి రథం కదిలించడంటే పణవాలూ, మురజాలూ, దుందుమాలూ కోవసి బ్రద్దలయ్యేట్లు మ్రోగేవి. 'కటిఘటితాద్రి నసన ఖండములతో' పొడ్డు వండాలు పెట్టేవాళ్లు, 'భక్తి పారవశ్యంబున ఆయాస

మెరుగక నర్తించు భాగవతులు', అగంతుకులకు శీతలోదకంబులను, నీరు మజ్జిగయు తెచ్చియిచ్చేవారూ, రాజవీధులగుండా రథం కదలటానికి వీలులేకుండా క్రిక్కిరిసేవారు.

ఆనాడు క్షుద్రదేవతా పూజలు విశేషంగా జరిగేవి. 'గ్రామగంగ' నాటి ప్రముఖ దేవత. చూడండి గంగమ్మ గుడిలో జరిగే బలిపూజా విశేషాలు.

'కాపు గుబ్బెతలు పొంగళ్లు వెట్టిన పాల
కడవ చారికల పొక్కళ్లరాలు
దొరలు తెప్పించి బంతులు గట్టి యర్పించు
పొట్టేళ్ల నెత్తురు బురద రొంపి
కోర్క చెల్లిన భుజంగు లూసంగ పెరికిన
కుకుక్కుట పటలంపు రెక్కగుంపు
మంత్రముల్ ఫలియింప మాంత్రికుల్ పయిజోతి
వన్నె యుంచిన పంచ వన్నె కోళ్లు
పరగ గుగ్గులగురు ధూప పరిమళంబు
శాకినీ డాకినీ భూత సంభ్రమంబు
చరదిత ప్రాణమృత్తికా తురగచయము
నలమ నా గంగగుడి జేర నరుగునపుడు'

గంగమ్మేకాక పుట్టలమ్మ, నెక్కలమ్మ, ధర్మరాజులు, నందివీరులు మున్నగు గ్రామదేవతలు పూజలందుకొనేవారు. మరి ఈ దేవతలకు వంది మాగధులుగా సివసత్తులు, తలారులు, బవనీలు ఉండేవారు.

సంక్రాంతి నాటికీ నేటికీ అచ్చమైన తెలుగుపబ్బం. శుకసప్తతిలో కదిరీపతి దీనిని ''పసుల పొంగలి'' అని పేర్కొన్నాడు. రాయలసీమలో దీనిని నేటికీ 'పసుల పొంగలి' అంటారని ప్రతాపరెడ్డిగారు వ్రాసినారు. ఈ పండుగనాటి సంబరాన్ని సంభ్రమాన్ని కదిరీపతి ఈ రకంగా వర్ణించినాడు.

"ఇంక నాల్గావంబు లిడనైతిగాయంచు
కుమ్మరి నెమ్మది కుందికొనగ
కుడుము రూకల కెల్ల కొనసైతిగాయంచు
బేరితేరని ఆరివేర మొంద
గొఱియ మందల నించుకొనసైతిగాయంచు
గొల్లవా డూరక క్రుళ్లుకొనగ
పెనుపసుపే విత్తుకొనసైతిగా యంచు
కాపు నిద్దుర లేక కళవళింప
మొనసి వెలచూపి చూపకనుసుపె వారి
సరకు లమ్ముడువోయె—'

ఈ పద్యాన్నిబట్టి ఆ కాలంలో సంక్రాంతిరోజున కొత్త కుండలు విశేషంగా కొనేవారనీ, గొఱ్ఱె మాంసమును ఇష్టపూర్తిగా తినేవారనీ తెలుస్తుంది. ఆ పండుగపూట పసుపు విపరీతంగా అమ్ముడుపోయేది. కొత్తగా చేతికందిన చింతకాయల తొక్కు పెట్టడానికి పసుపు సమృద్ధిగా వాడేవారు. ఇక 'కుడుము' తప్పు పాఠమనీ, 'గుడమంటే' సార్థకంగా ఉంటుందనీ ప్రతాపరెడ్డిగారి అభిప్రాయం. పండుగనాడు పిండివంటలకు 'గుడం' (అంటే బెల్లం) ఎక్కువగా చెల్లిపోవడం సమంజసంగా ఉంటుంది.

శుకసప్తతిలో వివిధ వర్ణాలకు చెందిన ప్రజల వేషభాషలు సహజంగా చిత్రింపబడినాయి. గ్రామాల పెత్తనం కరణాల చేతుల్లో రెడ్ల చేతుల్లో ఉండేది. 'రెడ్డి' శబ్దం కేవలం కులవాచియేకాదు. గ్రామాధికారిని ఆనాడు 'రెడ్డి' అనేవారు. ఇప్పటికీ రాయలసీమలో ఇలాగే అంటారు. తెలంగాణాలో కొన్ని మండలాలలో రెడ్లు నంబరినీ పటేండ్లని అంటారు. నాటి కరణం ముదుగు తలపాగతో, బాహుమూలమందు కవిలెతో, చర్మపుటూరలోని కత్తిగంటముతో, నీర్కావి దోవతితో ఉన్నట్లు వర్ణింపబడినాడు. రెడ్డి 'మొలకు సగంబును తలకు సగంబుగా కట్టిన యయ్యగారి కరల చీరతో, పై నల్లకమ్మల పచ్చడముతో, చేతిలో

కర్రతో ఉండేవాడు. బవనీలు జవనిక వాయిస్తూ కైవారాలు చేసేవారు. కోరసిగలతో, దుసికిల్లిపోతున్న దుప్పటితో, లలాటంపై మెరిసే విభూతి పసుపు బొట్లతో, మదిరాతిరేకంలో ఎర్రవారిన చూపులతో ఉండేవాళ్లు. తురక సర్దారు కదలు పాపోసులు తొడుక్కొని, వలిపెంపు శాలువ వల్లె వాటుగావేసి, నడుముచుట్టు సీలున్న తోలుపట్టీ కట్టుకొని గుజ్జింమీద నచ్చి డూరి వెలుపల రచ్చరావిచెట్టు క్రింద దిగేవాడు. రెడ్డికి హాడలు పుట్టేటట్టు 'తలారికి బులావ్' అని గద్దించేవాడు. ఇలాంటి గద్దింపులు మొన్న మొన్నటిదాకా తెలంగాణా పల్లెటూళ్లు అనుభవించినవే. ఎరుక సానులు నెత్తిమీద పుత్తడి బుట్టలు పెట్టుకొని "ఎరుకో అవ్వా ఎరుకో" అంటూ వీధుల వెంబడి తిరిగేవాళ్లు. వాళ్లదగ్గర అమూల్యమైన మూలికలు, మందులూ ఉండేవి. 'దారికట్టు', 'కాంతా వశీకరణం' మొదలైన బవనికలు మామూలు వాళ్లకేకాదు; మహారాజులకు సైతం నిర్భయంగా అందిస్తుండేవాళ్లు. ఆ నాటి జంగమురాళ్లకు నాగబెత్తము, రాగి నంది ముద్ర ఉంగరము, యోగపట్టె విధిగా ఉండేవి.

రాజులనుండి రాతులవరకు, రాణులనుండి సానులవరకు ఏ రకంగా సింగారించుకునేవాళ్లో శుకసప్తతిలో అచ్చు గ్రుద్దినట్టుగా కనిపిస్తుంది. వేట వేడుకతో అంతఃపురమునుండి బయలుదేరుతున్న ఒక రాజచంద్రుని వర్ణన చూడండి.

"పసరుపట్టు హిజారు మిసమిసలఱుత కా
ల్మొఱుగుటంగికి వింత యొఱపు నింప
కాశ్మీర పంక సంకలితాంగ దీధితుల్
కప్పు దుప్పటికి చెంగావులీన
జాళువాజిగి జిరా సరిపెణల మెఱుంగు
చిలుకతాళికి నొక్కసిరి యొసంగ
సిగ తాయెతుల నిగ్గు జిలుగు తాపిత సన్న
సరిగ జంట కుళాయి కొఱపు నెఱప

నుగుటి కస్తురిచేక వీనుల కిరీటి
పచ్చరా పోగులు కృపాణిపాణి నలక
పాదముల జీవదంతపు పావలూది
రాజ కందర్పు డంతఃపురంబు వెడలె."

రాజకందర్పుని అమగుజాడల్లో నడిచే చాతుగూడా చక్కగా ఉండేవాడు. గీర నామము, చిన్న కోరమీసాలు, వెనుకకట్టు రుమాలు, కమ్మిపంచె, దుప్పటి వల్లెవాటు, చేతిలో కత్తి – ఈ రకంగా నిండుగా మెండుగా ఉండి చూసర నాకర్షించేవాడు.

ఆ కాలంలో నొసట కస్తూరిబొట్టు, పుక్కిట కర్పూర తాంబూలం లేని పూబోణులు ఉండేవాళ్లుకారు. కురులకు 'జవ్వాది పవనిచ్చి' వాటిలో క్రొవ్విరులు ముడిచి 'చలువ దువ్వలువ కుచ్చెలయంచు ముత్తెముల్ పదనఖ ప్రభకు సలాము సేయ'గా రవల మట్టెల రనళితో, మొలనూలి చిఱుగంటల ఝళంఝళ ధ్వనులతో, 'మాటాడనేర్చిన మణి శలాకల' వలె, భుగభుగ వాసించు పుత్తడి బొమ్మలనలె నడయాడేవారు. కలవారింటి ఆడపడుచులు వజ్రపు కడియాలను, రవల మట్టియలను ధరిస్తే, కాపు పడతులు గొంటుపూసలు, రెండు గుండ్ల ముంగరలు, పెద్ద మట్టెలు, మట్టి పిల్లాండ్లు, బొబ్బిలికాయలు, ఒత్తులతోడి కడియాలు పెట్టుకొనేవాళ్లు. గుత్తపు రవికలుమాత్రం నాటి గుబ్బెతలందరూ గుత్తకు పుచ్చుకున్నవే.

ఆ కాలంలో సంపన్నులకు ముక్కారులూ బంగారంపండే మళ్లు, నడబావులు, ఆకుదోటలు, పోక ప్రాకులు, గొఱ్ఱెల కనుపులు, చెరకు గానుగలు ఉండేవి. అంత వైభవంతో పెంపెసలారే ఇండ్లముందు 'తులసమ్మ గద్దె' తప్పనిసరిగా ఉండేది. ఆనాడు బ్రాహ్మణుల ఇండ్లు ఎలాఉండేవో ఈ పద్యంవల్ల తెలుస్తుంది.

'అలికి గ్రుుగ్గులు వెట్టినట్టి తిన్నెలు, కంచు
బోరు తల్పులు, పాలు వోసి చాల
యూర్చవచ్చు ననంగ నొనరు చావడి, తాళు
వారంబు, చిన్న గవాక్షములమరు
వంట కొట్టము, చిలువాన మించిన మిద్దె
పట్టె మంచెము తోడి పడుకటిలు
పడసాల ముంగిలి పందిరి, పసిగాడి
కాయధాన్యములున్న కణజములును
పెరటిలో నారికేళ జంబీర ముఖ్య
నిఖిల ఫలవృక్షములు మంచిసీళ్ళ బావి
ఆమర నయ్యింట నిత్యకల్యాణములును
పచ్చ తోరణములు మించ పరగునతడు'

రెడ్ల ఇంటిముందు రచ్చ తీర్చడానికి 'పంచతిన్నె' లుండేవి. ఇండ్లచుట్టూ పారిగోడ లుండేవి. లేకుంటే కంపకోట్టులు. గొర్రు, కురుగాడి, ఏడికోలలు, కాడి, పలుపులు – ఇవీ ఆనాటి వ్యవసాయ పరికరాలు. వీటిని భద్రపరచడానికి 'అటుక' లుండేవి. ఇంటింటికీ కోళ్లగూళ్లుండేవి. మరి రుబ్బురోలు, పిడికెల కుచ్చెల, దాలిగుంత, ఇవి లేని కాపు ఇలు ఉండేదికాదు.

ఆనాడు ద్వీపాంతరాలనుండి విరివిగా వ్యాపారం సాగుతుండేది. ఈళ, విళంద, ముమ్మొంగి, బంగాళం, పైగోవ మున్నగు దీవులు ఆనాటి విదేశ వ్యాపారానికి పేరెన్నికగన్నవి. ఈళ మొదలైన ఈ దీవులపేర్ల గురించి ప్రతాపరెడ్డిగారు తమ సాంఘిక చరిత్రలో వ్రాసినారు. ఈళమే ఈడమట. ఈడము అరేబియా దేశంలోని ఏడన్. ఇళింద యే పళంద. పళంద అనగా డచ్చివారి హాలెండు దేశం. డచ్చివారిని ఆ కాలంలో మనవాళ్లు 'పళందు' లని పిలిచేవారట. పైగోవ అనేది పెగూ దేశమట. బంగాళం సరేసరి. ఈ దీవులనుండి నవరత్నాలు, జవ్వాది,

కుంకుమపూవు, పచ్చకర్పూరం, పన్నీరు చెంబులు, పటీర తరువులు, అంద లపు రొమ్మలు, పాడరసం. జాజి, ఇంగువ, ఏలాలు, లవంగాలు, పోకలు, గోరోజనం ఇత్యాదులు దిగుమతి అవుతుండేవి.

నాటి గృహపరిశ్రమలలో నూలు వడకడం ప్రముఖంగా ఉండేది. ముసలవ్వలతోపాటు మిసిమి జవ్వనంలో ఉన్న మించుబోణులుగూడా రాట్నాలు వడికేవాళ్లు. అనాటి రాట్నాలకు వడిదారము, చెవ్వులు, త్రొక్కుడుపలక, దిండు, కదురు, గుంజలు, త్రొక్కుడుబొమ్మ, త్రిప్పుడు పుడక ఉండేవి.

'ఎడమ కాస దొడ్డుగా వైచి యేకులల్ల
కెలన బలువగ వేపుడు గింజలునిచి
చేవ పీటలమీద ఆసీనలైన
వారలె వావివరుసలు వదరికొనుచు'

రమణులు రాట్నాలు వడికేవాళ్లు.

ఆనాడు పల్లెల్లో సువ్వాలు, శోభనాలు, ధవళాలు మొదలైన పాటలు పాడేవాళ్లు. ముఖ్యంగా స్త్రీలు వీటియందు ఆసక్తి కలిగివుండే వాళ్లు. ఇవేకాక ఏలపాటలు, గొబ్బిళ్ల పాటలు, జోల పాటలు విశేషంగా ప్రచారంలో ఉండేవి. 'గొబ్బి' అనేది గర్భ శబ్దమునకు వికృతియని ప్రతాపరెడ్డిగారి అభిప్రాయం. స్త్రీలు వలయాకారంగా తిరుగుతూ చప్పట్లు చరుస్తూ పాడే పాటలను గొబ్బిళ్ల పాటలంటారు. 'కొలనుదోప రికి గొబ్బిళ్లో, యదుకుల స్వామికిని గొబ్బిళ్లో' వంటి పాటలు నేటికీ ఆంధ్ర దేశంలో ప్రచారంలో ఉన్నవి. తెలంగాణాలో చలామణిలో ఉన్న బతు కమ్మ పాటలు ఇలాంటివే. అయితే బతుకమ్మ పాటల చివర "గొబ్బిళ్లో"

అనే పదానికి బదులుగా ''ఉయ్యాలో'' అని ఉంటుంది. కదిరీపతి ''బాపనమ్మ పాటలను'' పేర్కొన్నాడు. ఇవి బహుశః వృద్ధులైన బ్రాహ్మణ స్త్రీలు పాడే నీతిగర్భితములైన పాటలు కావచ్చును.

ఈ రకంగా 17 వ శతాబ్దినాటి సాంఘిక జీవనసర్వస్వం శుకసప్తతి. ఒకవైపు చిక్కని కథలను మొక్కవోనీయకుండా చెక్కుతూ, మరోవైపు సామాన్య విషయాల తఫిసీళ్లను గుప్పిస్తూ, శుకసప్తతిని సరస కావ్యంగా, సాంఘికచరిత్రగా సంతరించిన కదిరీపతి తెలుగు కవులలో గణనీయుడు.

2. హంసవింశతి

తెలుగు సాహిత్యంలో క్రీడాభిరామం, శుకసప్తతి, సింహాసన ద్వాత్రింశిక మున్నగునవి సమకాలీన సాంఘికజీవనాన్ని ప్రతిబింబింప జేయడంలో నిలువుటద్దాలనంటి నిద్దాకావ్యాలు. వీటికోవకు చెందిన కావ్యమే అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతి.

ఇది కథాకావ్యమైనా వర్ణనలపై మొగ్గుచూపిన కావ్యం. ప్రక్రియనుబట్టి చూస్తే ప్రబంధాల పంక్తిలో నిలిచినా దేశకాలపరిస్థితులకు దివ్వెలెత్తిన కావ్యం. దీనిలోని వస్తువు సంగ్రహంగా ఇది. ఉజ్జయినిలో హేమావతి అనే ఆవిడ ఉంటుంది. ఆవిడభర్త ఇరవైరోజుల పాటు దేశాంతరం వెడతాడు. హేల అనే దూతిక మాయమాటలకు లోనై హేమావతి అనగనానికి రాజైన చిత్రభోగునితో పొందుకోసం పోవడానికి పూనుకొంటుంది. ఆవిడ పెంపుడుహంస ప్రతిరాత్రీ ఓకథ చెప్పి ఆవిడ దుర్బుద్ధిని మాన్పుతుంది. ఇలా ఇరవైరోజులు గడచిపోతాయి. భర్త తిరిగివస్తాడు. ఆమె చెడుతలంపులు చెదిరిపోతాయి. హంసచెప్పిన ఇరవైకథలు కావడంవల్ల ఈ కావ్యానికి హంసవింశతి అనే పేరొచ్చింది. అయితే ఈ కథలన్నీ జారిణులకు సంబంధించినవే. చివరలో ఎంత గొప్ప నీతివున్నా మిగతాకావ్యమంతటా అశ్లీలగుణం చిందులుతొక్కుతూ ఉంటుంది. నీతిబోధ విషయం అలావుంచితే సాంఘిక జీవన చిత్రణ విషయంలోమాత్రం హంసవింశతి శుకసప్తతికి సైదోడుగావుంది.

కవులు తమకావ్యాల్లో తమ కాలంనాటి ప్రజాజీవనాన్ని సయత్నంగానైనా, అయత్నంగానైనా చిత్రిస్తారనేది ఈ నాటి సాహిత్య

లోకంలో అందరూ ఒప్పుకొన్న అభిప్రాయమే. హంసవింశతికవి తన నాటి కులాల్నీ; వృత్తుల్నీ; ఇండ్లనూ; నగలనూ; వస్త్రాలనూ; ఆచార వ్యవహారాలనూ ఈనాడు మనం ముక్కు-మీద వేలు వేసుకునేట్లుగా చిత్రించాడు. వీరేశలింగంగారి అభిప్రాయం ప్రకారంచూస్తే ఈ అయ్యల రాజుకవి 18వ శతాబ్ది మధ్యకాలంలో జీవించినవాడవుతాడు. ఈయన రాయలసీమలోని కడప, కర్నూలు ప్రాంతాలకు చెందినవాడు. 18వ శతాబ్దిలోని ప్రజాజీవితాన్ని ఈ కావ్యం ఎలా ప్రతిబింబిస్తున్నదో వివరిస్తాను.

ఆ కాలంలో తెలుగుదేశంలో వివిధ మండలాలు నాడులుగా చలామణి అవుతుండేవి. వెలనాడు, వేగినాడు, పాకనాడు, పొత్తపినాడు; ముదికినాడు—యివి ఆనాటికొన్ని మండలాలపేర్లు. దేశంలో చాతుర్వర్ణ్య వ్యవస్థ మాంచి కట్టుదిట్టాలతో ఉండేది. ఊళ్ళలో వ్యాపారి, రెడ్డి, అధికారం కలిగి వుండేవారు. వీరితరువాత తలవరిదే పైచేయి. వ్యాపారి తెల్లని పైరిణీపాగా చుట్టుకుని చల్వాచేసిన అంగీజోడు తొడుక్కొని ఎర్ర పాపోసులు వేసుకొని చెవులకు ముత్యాలపోగులు చొకలించగా బయలుదేరేవాడు. ఎంత దర్జాగా బయలుదేరినా 'చెవిసందిపాగలో' కలం చెక్కుకోవడం; హస్తాగ్రంలో 'దస్తరం'; మొలలో 'కలందాను' తప్పవికావు. మరి రెడ్డి ఎలావుండేవాడు? కమ్మిపచ్చడం; గంటీలు; పోగులు; చల్వా రుమాలు; జోడుంగరాలు; చేతిలోకర్ర; కాళ్ళకు కిర్రు కిర్రుమనే చెప్పులు. తలవరిమాత్రం తక్కువా? కోరసిగ, కావియంచు రుమాలు, చల్వా దుప్పటి—ఇదీ వరస.

ఆకాలంలో గొల్లపిల్లలకు కంబళి, కర్ర, కావడి, మజ్జిగ, ముంత పొగాకుతిత్తి, కోతకత్తి ఉండేవి. వీటితోపాటు మలపమందుల పొడి బుర్ర, మన్నెములు ఉండటం విశేషం. గొల్లల్లో సుద్దులగొల్లలు అనే తెగవాళ్ళు ఉండేవారు. వీళ్ళు ఫెళఫెళమని వీరణాలు వాయిస్తూ, గొమ్ములూదుతూ కాటమరాజు కథలూ, కృష్ణలీలలూ గానం చేసేవారు.

ఈ నాటి బుడబుక్కలవారు ఆనాడూ ఉండేవారు. నొసటనామం; బుజంమీద సంచి; చెవులకు నీలాలపోగులు; తలపై కొంగువేలాడుతున్న పాగా; చంకలో బొట్టియకోల; చేతిలో డుబుడక్క. తమపేళ్ళ చెబుతూ కేకలు పెడుతూ, గృహస్థులకు వచ్చే కీళ్ళను మేళ్ళను వల్లెవేస్తూ ఇల్లిల్లూ తిరిగేవారు.

ఇక ఆనాటి యిండ్లెలావుండేవో చూడండి. బ్రాహ్మణుల ఇండ్లలో నిండు సున్నపుపూత నెరచాలు బోదెలుదిద్దిన దేవతార్చన మిద్దె; నారికేళపు మట్టలాగా అలికినముంగిలి మలెసాలె; పంచవన్నియ ముగ్గులు నింపిన బృందావనములోగిలి; మడీఛోవతి మడత వేలే దండెము; అక్షతల చిప్ప; చిత్రాసనము; చిటిచాప; దర్భలు; సమిధలు ఆకులుపెట్టే గొప్ప అటుక వుండేవి. మరి వైతుల ఇండ్లయితే ముంగిట పులిజూపములుగీచిన రచ్చబండలు, ప్రహరీగోడ, కోళ్ళగూళ్ళు, కంపపాతిన లేగలదొడ్డి, పిడకల కుచ్చెల, యింకాపోతే దాలి, రోలు, తొట్టి, పలకపీట ఉండేవి. రెడ్లలో ఎన్ని తెగలున్నాయో వక్కలలోఅన్నివున్నాయని ఈనాడొకసామెత వుంది. ఇది ఆనాటికీ అన్వయించే సామెతే. పంట, మోటాటి, పెడగంటి, పాకనాటి, కొండ, ఆరె, మొరుసు, గోన; కొణిదె మున్నగు తెగలు ఆనాడూ ఉన్నవే. వక్కలలోవున్న తెగలనుచూస్తే ఆశ్చర్యం వేస్తుంది. హంసవింశతికారుడు చెప్పిన ప్రకారంగానే దాదాపు నూరు, నూటిరవై దాకా వున్నాయి. వాటిల్లో బంగారుతీగె లున్నాయి; పచ్చ కర్పూర సరులూ ఉన్నాయి. కస్తూరి పట్టెలున్నాయి; కాకిరెక్కలూ ఉన్నాయి. ఇంకాకొన్ని విచిత్రమైనవి చూడండి. నాగమల్లెలు, తీగమల్లెలు, మదన గంధులు, మన్మథబాణాలు, సన్నసూదులు, చంద్రవంకలు, పిచ్చుకగోళ్ళు, పులిగోళ్ళు—యివన్నీ వక్కలలో తెగలుసుమండీ! ఇక ఆకు కూరల్లో కృష్ణ రాయలు పేరొక్కన్న గురుగు, చెంచలి, తుమ్మి, తగిరిస కూరలతో పాటు, పొన్నగంటి, చల్మిలి, చిర్రకొండలి అనేవి ఉండేవి. దుంపల్లో

చేమ, కంద, ములక్కంగిస, ముల్లి ఎల్లాగూ వుండేవి. మరి గెనుసు, చిరిగోరు, పెండ్లము—యివీ దుంపలే. పెండ్లము అంటే ఈనాటి పెండెలము అనుకుంటాను.

ఇక ఆనాటి భోజనపదార్థాలవైపు వద్దాము. వైష్ణవ సంప్రదాయంవారైతే పొంగలి, పులిహార, దధ్యోదనము చేసుకొనేవారు. మామూలుగా అందరూ చక్కిలాలు, సజ్జబూరెలు, గరిజలు, వడపప్పాలు, మామిడితొక్కులు, వడియములు వాడుకొనేవారు. తమాషా ఏమిటంటే ఈనాటి పూరీలు, బజ్జీలు అప్పుడూవుండేవి. తేడా ఏమిటంటే బజ్జీలు అనడానికి బదులు బజ్జులు అనేవారు.

అష్టవిధ భోగాల్లో ప్రధానములైన శయ్యాభూషణముల గురించి చెబుతాను. శయనమందిరంలోని మంచం ఎలావుండేదో చూడండి.

సకినెలకీలు కంఠమున చాయమెఱుంగుల సొంపుకెంపు ము
క్కుకొనల పచ్చరా చిలుక కోళ్ళతనర్చిన పట్టుపట్టె అ
ల్లికపయి జాఫరాజినుగలేపున చెందు పలంగు పోషుత
క్కికగల జాళువా గొలుసు గీల్కొనుమంచమువై మహోన్నతిన్.

మరి హంసతూలికా తల్పమైతే తళుకుటద్దాల బిళ్ళలు, హరుమంజు పూసల మెరుగు కుచ్చులు, కెంపురాల మొనముక్కలతో ముద్దుగుల్కు పచ్చ చిల్కలు అందముచిందుతూ వుండేవి.

ఆనాటి విలాసినుల అలంకారాలు ఈనాటికీ చవులూరించేవిగా ఉన్నవి. సరిగంచుచీర, మణులు, కమ్మలు, ఆణిముత్యాలహారం ధరించి, కలపం అలదుకొని, సవరపుకొప్పు బెట్టుకొని ముంగిటనిలిస్తే చారినపోయే రసికుల కాళ్లకు బంధాలుపడేవి. మరికొందరు పూబోణులు రతనాల బిరడ కమ్మలు, గరుడపచ్చల కీలుకడియాలు, కెంపుల సందిదండలు, నాను,

గుండ్లపేర్లు ధరించేవాళ్లు. ఇంకా కొందరు సుందరీమణులు పగడపు చేకట్లు, రవల పల్లెరుపువ్వులు, మణులుదాపిన ముక్కెర, గిల్కు-మెట్టెలు ధరించి చూపరకు పుల్క-లు కలిగించేవారు.

ఆనాటి భోగులు ఉపయోగించే పరిమళ ద్రవ్యాలు జవ్వాజి పునుగు అత్తరులే కావు. అంబరు, కచ్చూరము, గంబూర, జిల్లరసము, కుదువేరు మున్నగునవికూడా. ఇవి వివిధ ద్వీపాలనుంచి దిగుమతి అయేవి. విదేశాల ప్రస క్తి వచ్చిందికాబట్టి ఇంకోవిషయం చెబుతాను. అరబ్బీ మొఖ్‌మల్ దింపు, గోవా బోర్నీసుబిళ్లలు, చీనీ హొంబట్టు సగ్గములు, ఆనాటి సంపన్నుల ఇండ్లలో కొల్లలుగా ఉండేవి. వేసవికాలంలో భోగులు పన్నీట జలకమాడి, పటీరపంకం పూసుకొని, ప్రొద్దున్నే దధ్యోదనంభుజించి, వట్టివేళ్లువేసిన చల్లని నీళ్ళను సేవించి, కస్తూరపు తిన్నెలమీద, చిగురు పాన్పులమీద, విలాసినులు తాళవృంతాలు వీస్తుండగా మెయివాల్చి గ్రీష్మంలో హేమంతాన్ని అనుభవించేవారు. మరి సామాన్యులకోసం చలివేంద్రలు వెలిసేవి. వాటిల్లో నీరుమజ్జిగ కుండలు, జీరకము కలిపిన పల్చని అంబళ్లు, రవ్వుప్పు, సీరుల్లిరసము నించిన గంజికాగులు ఉండేవి.

పల్లెటూళ్ళలో కోడి పందాలూ, తిరునాళ్లూ అప్పుడప్పుడూ జరుగుతూ ప్రజలకు ఉత్సాహాన్నిక లందించేవి. పందెపు పుంజుల పేర్లు తమాషాగా ఉండేవి. గరుడము, శరభము, కంచుడమారము, కార్చిచ్చు, మిత్తి, రాహుత్తి, పిడుగు, పావరసము. వాటి స్వరూపంగూడా వింతగా ఉండేది. పట్టుజుట్టుది, చిలకజుట్టుది, పిల్లివేళ్ళది, మొద్దుది ఇత్యాదులు.

పుంజుల పోట్లాట ఈ రకంగా ఉండేది :

"చొరబడి కాంచి ప్రాతలును చుట్టియు కత్తులు ప్రేసి సందిటన్
జెరయగ పట్టి చెక్కు-గరపించి, గిరేర్పడ గీచి, నిల్చి కొ
క్కిరయగ జూచి పందియపు టెంకువ దిగ్గుచు చిక్కువేసి స
ళ్ళిరి మరిపోయనంచును భళీ భళి పుంజులు తన్నులాడగన్"

ఊళ్ళలో ప్రతియేటా జరిగే తిరునాళ్లవైభవం వర్ణనాతీతంగా ఉండేది. కాగడాలు, మోంబత్తులు, తిర్వళిళులు,దివ్వెటీలువెల్లుతూవుండగా పదియారు కుజ్జుల ప్రభతో పెరుమాళ్ళ విగ్రహం తిరువీధుల్లో ఊరేగింపు వెళ్లేది. అప్పుడు పటహా, తమ్మట, నిస్సాణ, మర్దళాదులు ధణధణ మ్రోగేవి. అడుగడునకు ఏకారతి, పంచారతి, కుంభారతి, గరుడారతి మున్నగు ఆరతులు సమర్పింపబడేవి. సంపదలకోసం సంతుకోసం జనం సాగిలబడి మ్రొక్కుతుండగా ఉత్సవం హృదయసర్వంగా ముగిసేది.

ఈ రకంగా 18 వ శతాబ్దినాటి ప్రజల వేషభాషలు, ఆచార వ్యవహారాలు, భోజనభాజనాదులు హంసవింశతిలో కన్నులకు కట్టినట్లుగా కనిపిస్తాయి. ఈ కావ్యంలో అసభ్య శృంగారంవలన సంక్రమించిన దోషాన్ని సాంఘిక జీవనచిత్రణం తుడిచివేస్తుందనే చెప్పాలి. కథలకోసం కాకపోయినా 18 వ శతాబ్దినాటి బ్రతుకుతెరువులు అవగాహన చేసుకోవడానికి అవశ్యం చదువవలసిన కావ్యమిది.

3. చాటువులు

చాటువు అంటే ప్రియమైనమాట. ఇది అచ్చమైన సంస్కృత శబ్దం. మనవాళ్లలో కొందరు ఈ శబ్దాన్ని చవర, చాప అన్న ధోరణిలో ముచ్చటగా ఉచ్చరిస్తుంటారు. ఈ శబ్దం తెలుగుభాషలో ఎంత బాగా జీర్ణమైపోయిందో దీనినిబట్టి తెలుస్తుంది. ఇంతకూ చాటుపద్యమంటే కవి సరదాగాచెప్పిన పద్యమన్నమాట. ఒక భోగిచేత సత్కరింపబడినప్పుడో, ఒక లోభిచేత సీత్కరింపబడినప్పుడో, అందమైన దృశ్యం కనబడినప్పుడో, డెందం గాయపడినప్పుడో, అనిష్టం తొంగిచూసినప్పుడో, హాస్యం లాస్యంచేసినప్పుడో, అనేక సందర్భాల్లో చిత్రమైన చిత్తవృత్తుల్లో ఛందోరూపంలో జుమ్మని చిమ్ముకొనివచ్చే కవితారూపాలే ఈ చాటు పద్యాలు. ఆంధ్ర సాహిత్యంలో ఒకవైపు మందాకినీ సదృశమైన మహా కావ్యాలు వెలువడుతుంటే, మరోవైపు సెలయేళ్లలాంటి చాటుపద్యాలు గలగల ప్రవహించినవి. నైషధంలాంటి విద్వదౌషధాన్ని అందించిన శ్రీనాథకవిసార్వభౌముడే 'చిన్నచిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు' వంటి చిటి పొటి చాటువులతో చిందులువేశాడు. తాటాకు మడతల్లో, వృద్ధుల నాల్కల్లో ఒదిగివున్న ఈ చాటువులకు తొలిసారిగా వెలుగు చూపిన వారు కే. వే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వారిననుసరించి మరింత కృషిచేసినవారు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు. ఇక కొన్ని చాటువులను తీసుకొని వాటిలో ప్రతిబింబించిన ప్రజాజీవనరేఖల్ని పరిశీలిద్దాం.

కొన్ని చాటుపద్యాలు జానపద గేయాల్లాగా కవిపేరు తెలియకుండా ఉండిపోయినవి. పిల్లల మొదటి వాచకంలో సాధారణంగా కనిపించే "చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ" అనేది ఆబాలగోపాలానికి

తెలిసిన చాటుపద్యం. దీని కర్తయెవరో తెలియదు. అలాగే సామెతల్లాగా ఉపయోగించే పద్యాలు కొన్నివున్నాయి. 'వాసనలేని పువ్వు, బుధవర్గములేని గృహంబు' ఇదీ చాలా పేరుమోసిన పద్యమే. కవిపేరు స్పష్టంగా తెలియదు. 'నాతిగల బ్రహ్మచర్యము నాతరమా పూటగడుప నారయభూపా' అనే పంక్తులున్న పద్య మొకటుంది. దీని కవియెవ్వరో తెలియదు. అయినా ఈ పద్యాలు అక్షరాస్యుల నిత్యజీవితంలో అవినాభావంగా అల్లుకుపోయినవి.

చాటుపద్యాలు చెప్పిన ప్రాచీనాంధ్ర కవుల్లో వేములవాడ భీమకవి, శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు, ఆడిదము సూరకవిలాంటివారు గణనీయులు. చిత్రమేమిటంటే భీమకవి కేవలం చాటువులద్వారానే ఇంతకాలం బ్రతికివున్నాడు. భీమకవిపేర చలామణిలోవున్న చాటువుల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క చారిత్రక వృత్తాంతానికి, ఒక గుప్త సత్యానికి గవాక్షాలు తెరుస్తుంది.

'గడియలోపల తాడిగడగి మతునియుగా
తిట్టిన మేధావిభట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండి ముండ్లన్నియు
డుల్లదిట్టిన కవిమల్లుకంటె
మూడు గడెలకు తామొనసి యెత్తినగండి
పగుల దిట్టిన కవిభానుకంటె
ఱరజాము లోపల చెఱువు నీళ్లింకంగ
దిట్టిన బడబాగ్నిభట్టుకంటె
ఉగ్రకోపి నేను నోపుము శపియింప
గ్రమ్మరింప శక్తి గలదు నాకు
వట్టిబ్రూన చిగురు పుట్టింప గిట్టింప
బిరుదు వేములవాడ భీమకవిని'.

ఈ పద్యంలో తిట్టుకవుల పట్టికవుంది. మేధావిభట్టు, కవిమల్లుడు, కవిభానుడు, బడబాగ్నిభట్టు-ఈ నలుగురూ ఒకరినిమించి ఒకరు తిట్టుకవుల్లో

దిట్టలట. ఈ కవులనుగురించి పరిశోధించటానికి సాహిత్యచారిత్రకులకు కావలసిన మేత వేసిందీపద్యం. భీమకవి ఇతర చాటువుల్లో పేర్కొన్న సాగిపోతరాజు, సాహిణిమారుడు, మైలమభీముడు, కళింగగంగు లాంటి వ్యక్తులుగూడ చారిత్రకులకు పరిశోధనాంశాలుగా మిగిలిపోయారు.

అక్కడక్కడ ఉండిపోయిన పద్యాల్లో ఖడ్గతిక్కన నుద్దేశించి అతని భార్య, తల్లి పలికిన రెండు పద్యాలు రెండు కావ్యాల గరిమను, గంభీరతను సంతరించుకొన్నవి. ఖడ్గతిక్కన మనుమసిద్ధి పక్షాన నిల్చి కాటమరాజు నెదిరించిన మహావీరుడు. ఇతడు రణరంగంలో కొంతసేపు భీషణంగా పోరాడి, తన సేనలు చెల్లాచెదరై పారిపోగా పోరుసిరమించుకొని ఇంటిముఖం పట్టాడట. ఇంట్లో భార్య నులకమంచం అడ్డునిలిపి దాని మీద పసుపుముద్ద ఉంచి ప్రక్కన నీళ్లచెంబు నెట్టిందట. ఇదే మిటని తిక్కన అడుగగా

'పగరపు వెన్నిచ్చినచో
నగచేనిను మగతనంపు నాయిక లెందున్
మగు రాడువార మైతిని
వగ పేటికి జలకమాడ వచ్చిన చోటన్'

అని ఎత్తి పొడిచిందట. ఆతర్వాత తల్లి అన్నంలో విరిగిన పాలు పోసిందట. ఇదేమిటని ప్రశ్నిస్తే

'అసదృశముగ అరివీరుల
మసిపుచ్చక విరిగి వచ్చు మగపందక్రియన్
కసవున్ మేయగ బోయిన
పసులున్ విరిగినవి తిక్క! పాలున్ విరిగెన్'

అంటూ అధిక్షేపించిందట. ఈ పొడుపు మాటలకు లజ్జితుడై చివాలున లేచిపోయి ఖడ్గతిక్కన కదనరంగంలో శత్రువుల నెదిరించి వీరస్వర్గ

మలంకరించినాడు. ఈ చాటుపద్యాలు రెండూ సానలుదీరిన పద్య రచనకు, నిగ్గు దేరిన భావగరిమకు దృష్టాంతాలుగా నిలిచిపోయినవి. ఖండికలుగా కనిపించినా అఖండ సందేశాన్ని పొదుగుకున్నవి. తర తరాలుగా అనేకులచేత ఉదాహరింపబడుతూ ప్రజల్లో వీరతాస్ఫూర్తిని కలిగిస్తున్నవి.

చాటు పద్యాలలో ప్రజాజీవనాన్ని మున్మూర్తులా చిత్రించిన మొనగాడు శ్రీనాథుడు. ఈ కవీంద్రుడు ప్రౌఢదేవరాయలను దర్శించడానికి కర్ణాట రాజ్యానికి వెళ్లాడు. రాజ దర్శనంకోసం కాలయాపనం జరిగింది. కర్ణాట రాజ్యలక్ష్మిని ఇలా ప్రార్థించాడు.

'కుల్లాయుంచితి కోకచుట్టితి మహాకూర్చాసమున్ తొడ్డితిన్
వెల్లుల్లిన్ తిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
చల్లాయంబలి ద్రావితిన్ రుచుల దోసంబంచు పోనాడితిన్
తల్లీ కన్నాడ రాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుడన్.'

నాటి కర్ణాటదేశీయుల వేషంతోపాటు భోజన విశేషంకూడా ఈ పద్యంలో బయటపడింది. అలాగే ఇతడు పలనాడు వెళ్లినప్పుడు అక్కడ 'జొన్నకలి, జొన్నయంబలి, జొన్నన్నము, జొన్నపిసరు' తప్ప 'సన్నన్నము సున్న' అని స్పష్టంగా చెప్పాడు. పలనాటికి రంభ వెళ్లినా ఏకులే వడుకుతుందని, కుసువామ్స్త్రిడువెళ్లినా జొన్నకూడే కుడవక తప్పదని నాటి పల నాటి జీవనాన్ని చమత్కారంగా చిత్రికపట్టాడు. సామాన్య గ్రామపురోహితుని యింటిస్థితిని వర్ణిస్తూ

'దోసెడు కొంపలో పసుల త్రొక్కిడి, మంచము, చూడ రేణమున్,
పాసిన వంటకంబు, పసి బాలుర శౌచము, విస్తరాకులున్
మాసిన కుండలున్—'

అంటూ ఏకరువుపెట్టాడు. మసర రాజ్యంలో మనుషులెలా ఉంటారో బొమ్మగీసి చూపాడు. పడమటిసీమవ్యాపారుల దస్త్రాలను, మసిబుర్ర

లను, కలములను, చింతంబళులను, చెమటబట్టిన నీర్కావులను, భయంకరమైన గడ్డాలను పట్టిక ఇవ్వడమే కాకుండా, 'వస్తూ చూస్తిమి రోస్తిమి' అంటూ అప్పటి యాసనుగూడా తమాషాగా అనుకరించాడు. మరి అప్పటి దక్షిణ దేశీయుల భోజన పదార్థాలను గురించి శ్రీనాథునికి కలిగిన వైముఖ్యం ఈ పద్యంలో బాగా కనిపిస్తుంది.

'తొలుత నే వడ్డింత్రు దొడ్డమిర్యపు చారు
చెవులలో పాగవెళ్లి చిమ్మిరేగ
పలు తెఱంగులతోడ పచ్చళ్లు చవిగొన్న
బ్రహ్మరంధ్రము దాక పారునావ
అవిసాకు వేఁచిన ఆగ్నెల్లు ససిలేదు
పరిమళ మెంచిన పండ్లుసాగచు
వేపాకు నెండించివేసిన పొళ్లను
కంచాన గాంచిన క్రక్కువచ్చు.'

ఇలాగా ఆయా ప్రాంతాలకు వెళ్లినప్పుడు శ్రీనాథుడు అక్కడి ఆచార వ్యవహారాలను బహుచమత్కారంగా చిత్రించాడు. అంతటితోనే ఊరుకోలేవతడు. కులానికొక్క కుసుమాంగినేరి కులాసాగా వర్ణించాడు. వేపారి మచ్చెకంటి, నంబివారి పడుచు, అగసాలి వన్నెలాడి, సాతాని వేడ్కలాడి, జంగమువారి చిన్నది, చాకలివారి జవ్వని, రెడ్డికూతురు, పూజారివారి కోడలు – ఈ రకంగా ఎన్నో తెగల అన్నులమిన్నలు వారి వారి భూషా వైవిధ్యంతో శ్రీనాథుని చాటువుల్లో సింగార మొలుకుతూ కనిపిస్తారు. ఈ కవిసార్వభౌముడు తాను రత్నాంబరాలు ధరిస్తూ హేమపాత్రాన్నం భుజిస్తూవున్న సందర్భంలో చెప్పిన చాటువుల్లోనేకాదు, అనసానవశలో గుండెలవిసిపోయేటు ఆలపించిన 'కవిరాజు కంఠంబు కౌగిలించెనుగదా' అన్న పద్యంలోగూడా నాటి ప్రజాజీవనరేఖ తళుక్కుమంటుంది. చేతికి వెదురుగొడియ తగిలించడం, నగరి వాకిటవుండే నల్లగుండు భుజంమీది కెక్కించడం నిర్బంధితునికి ఆ రోజుల్లో విధించే దండనల్లో కొన్ని అని ఈ పద్యంవల్ల తెలుస్తుంది.

కొన్ని కొన్ని చాటుపద్యాలు తులలేని చారిత్రక సత్యాలకు నిలువుటద్దాల్లా నిలిచిపోయినవి. అడిదము సూరకవి చెప్పిన ఈ పద్యం అందుకు మచ్చుతునక.

'మెత్తనైయున్న అరటాకు మీదగాక
మంటమీదను చెల్లునే ముంటివాడి
బీదలైయున్న మా బోంట్ల మీదగాక
కలదె క్రొవ్వాడి బాదుల్లఖానుమీద.'

పూసపాటి విజయరామరాజుగారు తమ ఆస్థాన కవిగావున్న అడిదము సూరకవిపై ఆగ్రహంపూని తొలగించడం, ఆ రాజుగారే ఒకమాటు బాదుల్లాఖానుతో యుద్ధం చేయబోయి పరాజితుడై తిరిగిరావడం, ఆ సంవర్భంలో సూరకవి ఈ పద్యందాద్వారా చురుకుపెట్టడం అనే చారిత్రక వృత్తాంతం ఈ పద్యంవల్ల స్పష్టమవుతుంది. అయితే విజయరామరాజు మొదట బాదుల్లాఖానును పారద్రోలిన ఉదంతాన్నిగూడా సూరకవి కీర్తించినట్లు 'ఢిల్లిలోపల గోలకొండపురి నిండక నీ ప్రశంసల్' అనే చాటువు చాటుతుంది.

ఎవరో కవి నండూరి వెంగళమంత్రి గురించి పద్యం చెప్పాడు. అతని కీర్తిశేషపు ఎలా కేరింతలాడిందో ఆ పద్యంలో వర్ణించాడు. చంద్రికా నక్షత్ర కైలాసాదులవలె కీర్తి తెల్లనివనే నలిగిన కవి సమయాన్నే ఈ కవి నవనవంగా అందించాడు.

'హరిహయ చంద్రికా హంస నారదులను
'పిల్లగిర్ల'కు తగపిలిచి యాడు
శారద నిర్మలచ్ఛాయా పతాకాశ
భాగంబులను 'కోలుపట్టె' లాడు
అక్షీణ వరదీప్తి నక్షత్ర పంక్తితో
ఒప్పుగా 'వెన్నెలకుప్ప' లాడు
కైలాస హిమశైల గహ్వర కలశాబ్ధి
రీతుల 'డాగిలిమూత'లాడు'

భవ్య భాగీరథీతటి 'బంతు' లాడు
హల్లకాబ్జులతో 'తన్నుబిళ్ళ' లాడు
అమర తరువుల 'తూరు దండెముల' నాడు
కేసి నందూరి వెంగళు కీర్తిశిశువు'.

ఈ పద్యంలో కీర్తివర్ణనవెపంతో పిల్లగిర్లు, కోలుపట్టెలు, వెన్నెల కుప్పలు, తన్నుబిళ్ళలులాంటి కుర్రవాళ్ళ ఆటలనుగూడా ప్రవేశపెట్టడం కొత్తగావుంది. అడివం సూరకవి విజయనగరం రాజుగారికిచేసిన విన్నపం పద్యంలో 'గంటాల పన్ను'ను పేర్కొన్నాడు. సూరకవి కాలంలో గంటాలకుకూడా పన్ను విధించేవారనేది చారిత్రక విశేషమని దీపాల వారు వ్యాఖ్యానించారు.

ఇక పొగాకు. సన్నబియ్యంలాంటి పొడి పొడి విషయాలనుగూర్చి ఉన్న చాటువుల్ని పరిశీలిస్తే వాటిపట్ల ప్రజలకూ, కవులకూగల అసక్తి బయట పడుతుంది.

'పొగ త్రాగనేర్చి భీముడు
పగచక్ర పొగరడచె నాజి బాహాశక్తిన్
పొగ త్రావని దుర్యోధను
డిగిలించెను రణము లోన 'ఇహిహీ' యనుచున్'.

చమత్కారం చాలాచూపం పోయిందిగదూ! ఇది సరే. కవులే కవుల్ని ఈసడిస్తూ చెప్పిన పద్యాలూ ఎంతో ముచ్చటగా ఉన్నవి. 'గాడివ నీవు నున్ కవివి కాదుకదా' అనే శ్రీనాథుని పద్యం ప్రసిద్ధమైనదే. అకర్తృకమైన ఇంకొక పద్యం ఇలాంటిదే ఉంది.

'దేవునాన మున్ను దేశాన కొకరుండ
ఇప్పు డిరవనూర ఇంటనింట
ఏవు రార్వ రేడ్వ రెనమంద్రు తొమ్మండ్రు
పదువురైరి కవులు పద్మనాభ'.

ఈ అభిప్రాయం ఈ రోజుల్లోనేకాదు ఆ రోజుల్లోనూ ఉండవనేది ఈ పద్యం వల్ల తేలింది.

భవిష్యత్తులో కవిత

అసలైన కవిత్వానికి నిన్న నేడులు లేవు. అలాగే రేపు లేదు. సూర్యుని చూపులవలె, తెమ్మెర వీచోపులవలె అది సార్వకాలికం. ఇంతకూ కవిత్వం ఎప్పుడో ఒకప్పుడు పుట్టి ఉండాలికదా. టి. యస్. ఇలియట్ దీనికి చిత్రంగా జవాబు చెబుతాడు: 'Hyperbolically one might say that the poet is older than other human beings.' ఇలియట్ చమత్కారంగా చెప్పినా సత్యమే చెప్పినాడు. కవిత్వం సృష్టిలో ఎంత చిరంతనమైనదో అతడు వ్యక్తం చేసినాడు. ఛెళ్ళున ఒక మెరుపు దూసుకపోయినప్పుడు, ఒక పుష్క-లావర్తకం మదగజంలా ఘీంకరించినప్పుడు, మలయ పవనం అలసగమనంతోవచ్చి మెయినిండా చందనం రాసి పోయినప్పుడు - ఇదుగో ఇలాంటి మధురక్షణాల్లోనే ఆదిమానవుని ఆత్మ కెరటంవలె పరవళ్ళు తొక్కింది. అప్పుడే కవిత్వానికి నాంది జరిగింది. ఇంకా కొంచెం లోతుగా విచారిస్తే మరొకటి తోస్తుంది. ఉద్వేగంలోనుంచే కాక కరుణలోనుంచి కూడా కవిత్వం పుట్టిందనవచ్చు. వాల్మీకిని మనీషిగా మనస్వీగా ఎత్తిచూపింది క్రౌంచమిథున వియోగమే. అతని మనస్సులో జాలువారిన జాలిలోనుంచే మహాకావ్యం అవతరించింది. అందుకే 'శోకః శ్లోకత్వ మాగతః' అన్నారు.

కాలానికీ కవిత్వానికీ వాగర్థాలవంటి సంబంధమున్నది. కాలం నుంచి కవిత్వాన్ని విడదీయటం కష్టం. ప్రతియుగంలో ఒకొక్క ఉవ్యమం ఒకొక్క మహాకావ్యాన్ని సృష్టించింది. గ్రీకుల వీర గాథలను లోకానికి చాటడానికే "ఇలియడ్" పుట్టింది. వైదికధర్మ ప్రతిపాదనం కోసం వ్యాసభారతం పుట్టింది. మరి తెలుగులో అటు బసవపురాణం, ఇటు మహాప్రస్థానం వంటివి ఒకానొకనాటి నిశ్చితమైన ఆభిప్రాయాన్ని ప్రతిపాదించడానికే జన్మించినవి. ప్రధానంగా తృతీయ

పురుషార్థానికి వింజామరలు పట్టిన ప్రబంధ సాహిత్యం నైతం ఒకానొక యుగంలోని అభిరుచులకు అనుగుణంగా బయలుదేరినదే. ఇరు వయ్యో శతాబ్దిలో వెలువడిన భావకవిత్వం, దేశాభిమాన కవిత్వం, అభ్యుదయ కవిత్వం క్రమంగా ఆ యా కాలపరిస్థితులకు అనుగుణంగా అవతరించినవే. అయితే అన్ని యుగాల్లోనూ దేశకాలాలకు అతీతమై నిత్యసత్యాలను ప్రబోధించే కావ్యాలు పుట్టకపోలేదు.

ఈనాడు కాలం శరవేగంతో - కాదు - రాకెట్టు వేగంతో సాగి పోతున్నది. విజ్ఞానశాస్త్రం తన విశ్వరూపాన్ని చూపిస్తున్నది. దేశా లన్నీ విశ్వమానవుని దృష్టికి పూరిండ్లలాగా కనిపిస్తున్నవి.

'ఊహలే రెక్కలుగ జేసి మ
హోన్నతముగా ఎగిసి చూచిన
వసుధయంతయు కన్పడును పసి
వాడు విసిరిన బంతి పోలిక'

అనే అభిప్రాయం చిక్కపడుతున్నది. సమస్త జగత్తు ఒకే ఒక్క కుటుంబంలా కనిపిస్తున్నది. చంద్రబింబం అత్తవారి ఊరులాగా అనిపిస్తు న్నది. సైంటిఫిక్గా, సాంకేతికంగా, "రాపిడ్"గా, రాపిడిగా, ఇంతగా మారిపోతున్న లోకంలో ఊహలతో కాలంగడిపే కవిత్వం బ్రతుక గల్గు తుందా అనే సందేహం కల్గడం సహజం. మనిషి అనేవాడు ఉన్నన్నాళ్ళు కవిత్వానికి అణుమాత్రం క్షతిలేదని నా అభిప్రాయం. విజ్ఞాన రంగంలో ఎన్ని మార్పులు వచ్చేసినా మానవునిలోని మౌలిక గుణాల్లో అట్టే మార్పు రాలేదు. రాగద్వేషాలు, పాపపుణ్యాలు, అధికార కాంక్ష, కీర్తికండూతి, ప్రకృతి ప్రీతి, దైవభీతి, నాడూ నేడూ మనిషి మనస్సును పెనవేసుకొని ఉన్నవి. ఇవి ఉన్నన్నాళ్ళు కవిత్వం ఉంటుంది. అసలు కవిత్వాన్ని "ప్రిమిటివ్" అనుకోవడమే పొరపాటేమో? బుక్కలనుంచి స్ఫుటిక్క ల దాకా ఇది సురసరిత్తులా ప్రవహిస్తున్నది. ఎన్ని స్ఫుటిక్కలు ఎగురవేసినా అవి సూర్యునిముందు గాలిపటాల వంటివే. సూర్యుడు ఎంత

పాతో కవిత్వం అంత పాతది. అయితే సూర్యుడు ఎంత పురాతనుడో అంత నూతనుడు. ప్రతి ప్రభాతంలో భానుమూర్తి పది పదారేళ్ళ పడుచు కుర్రవాడివలె కనిపించి లోకాన్ని విభ్రాంతం చేయడంలేదా? లోచూపు ఉన్నవాళ్ళకు కవిత్వం నిత్యనూతనంగా కనిపిస్తున్నది. కొత్తదనం చూపులో ఉంటుందిగాని వస్తువులో కాదు. వందలాది కవులు వాడినా శబ్దాలు పాతపడలేదు. సూర్యుని వెల్తురును ఎంతమంది ఉపయోగించుకున్నా మాసిపోయిందా? దాని వాసిపోయిందా? అందుకే లాక్షణికుడన్నాడు.

"దృష్ట పూర్వా అపి హ్యర్థాః
కావ్యే రస పరిగ్రహాత్
సర్వే నవా ఇవా భాంతి
మధుమాస ఇవ ద్రుమాః."

భవిష్యత్తులో కవిత్వం ఎలా ఉంటుందో ఊహించడానికి వర్తమాన స్థితియే పునాది. దేశంలో ఈనాడు వెనుకటి సంక్షోభంలేదు. ఉద్వ్యామాలూ, ఉద్వేగాలూ కొంతచల్లారినవి. సమాజం సముద్రంలా హోరెత్తడం లేదు. సరస్సులా గల గల మంటుంది. ఈనాటి సమాజాన్ని సరస్సుతో పోల్చడం కొందరికి ఇష్టం లేకపోవచ్చు. వాళ్ళు ఇలా అనవచ్చు. "సరస్సులో పనికిరాని పద్మాలూ, పీతలూ పుడతాయి. హాలాహాల మైనా అమృతమైనా సముద్రంలోనే పుడుతుంది. అంచేత మాకు సముద్రమే కావాలి." ఇలా అంటే నేను బొత్తిగా కాదనను. కాని ఒకటుంది. చిరకాల మథనంవల్ల సముద్రంనుండి హాలాహలం, అమృతం రెండూ వచ్చేసినవి. ఇప్పుడు లోకం అనుభవిస్తున్నది ఆ అమృతంలోని భాగమే. సముద్రాన్ని ఇంకా మథిస్తే వచ్చేది బడబాగ్నే. అందుచేతనే ప్రస్తుత సమాజాన్ని సముద్రంతో పోల్చడం సబబు కాదంటున్నాను. ప్రస్తుతానికి సరసూ్న, సరస్సులో మహాత్ముల ఆత్మలవలె ధీరసుందరంగా వికసించే పద్మాలూ అవసర మంటున్నాను. ఎన్నడూ జరగని గొప్ప విషయం ఈ నాలుగయిదేండ్లలో జరిగింది. ఇటీవల డేగలూ పావురాలూ కలిసి ఒక

చోట బంతులుదీరి విందులు జరుపుకుంటున్నాయి. కొంతవరకు విశ్వం కణ్వాశ్రమంలా భాసిస్తున్నది. నెహ్రూ ప్రయోగించిన ''పంచశీలా''లు పంచాస్త్రాలవలె సమస్త జగత్తును సమ్మోహింపజేసినవి. ఇంటా బయటా కొంత శాంతి ఏర్పడింది. దేశంలో నీడలేనివాడికి మేడకాకున్నా అడుసు గుడిసెయైనా దొరికింది. అసేకులకు సంకుచిత దృష్టిపోయి విశ్వమానవ దృష్టి ఏర్పడుతున్నది. సహజీవనం, సౌహార్దం పునాదులుగా ''ఎల్ల లోకం ఒక్క ఇల్లు'' కానున్నది.

ఇలాంటి పరిస్థితులలో భవిష్యత్తులో కవిత ఎలా ఉంటుందో నేను ఊహిస్తున్నాను. మంచిని ఊహించడం ప్రమాదంకాదు కాబట్టి ఊహిస్తున్నాను. ఇంతలో యుద్ధం వస్తుందని నేననుకోను. ప్రణయ కలహాలవంటి చిల్లర తగాదాలు తప్ప పెద్ద కల్లోలాలు జరిగే సూచనలులేవు. కొంతకాలం లోకం ఇలాగే ప్రశాంతంగానే ఉండవచ్చు. ఉవ్యమాల కోజుల్లో కవులకు ఊపిరి తీసుకునే ఓపిక లేక ఖండకావ్యాలు ప్రాస్తుండేవాళ్ళు. సమాజంలో తాత్కాలికంగా వేడి కలిగించడానికి కొరడా కొసలవంటి గేయాలూ, పద్యాలూ జల్లిపిస్తుండేవాళ్ళు. పాఠకులకుగూడా పెద్ద కావ్యాలూ, క్లాసిక్సు చదివే ఓపిక లేకుండా ఉండేది. ఇప్పుడాపరిస్థితి లేదు. దీర్ఘ కావ్యాలైనా నెమ్మదిగా చదువుకునే స్తిమితం వచ్చేసింది. రానున్న తరంలో కవులు సమస్యలసే కాక సత్యాలను, సూటిగా మాత్రమే కాక సుందరంగా చెబుతారు. నాడూ నేడూ మనంకోరేది శివంకరమూ, సుందరమూ అయిన సత్యమేకదా. అందుచేత ముందు ముందు ''కాంతా సమ్మితతయోపదేశయుజే'' అన్న ఆలంకారికుడి మాట మళ్ళీ రుజువవుతుంది. కవిత్వమంటే నీతిశాస్త్రమో, నినాదాల క్యాటలాగో కావని భావితరం గమనిస్తుంది. నిజానికి కేవలం నినాదాలు కవిత్వం ఏనాడూ కాలేవు.

ఎవరో అన్నట్టు 'poetry is algebra, not arithmetic.' ఈ అభిప్రాయం ముందుతరంలో గట్టి పడుతుందని నా విశ్వాసం.

ఛందస్సు విషయంలో ముందుతరంలో అంతపట్టింపు ఉండదేమో? ఇప్పటికే తెలుగులో పద్యానికీ, గేయానికీ మధ్య ఉన్న మంచు తెర కరిగిపోయింది. "పద్యానికి గద్యానికి పెళ్ళి చేద్దాం" అనేదాకా మన కవులు సాగిపోయినారు. ముందుతరంలో వృత్తాలమీద మోజుపోయి మాత్రా ఛందస్సుపై మమకారం పెరుగవచ్చు. వృత్త రచన ఇకముందు ఉండదని నా అభిప్రాయంకాదు. దానితోపాటు గేయరచనకుగూడా మంచి ప్రామాణ్యం ఏర్పడుతుందని. స్వేచ్ఛాగతిలో ఇటీవల కొన్ని చక్కని కావ్యాలు వస్తున్నాయి. ఈమార్గం ఆంగ్ల సాహిత్యంలో బాగా బల పడింది. ముందు ముందు ఈ స్వేచ్ఛాగతికి ఒక వ్యవస్థ ఏర్పడవచ్చు. ప్రస్తుతాభిరుచులనుబట్టి చూస్తే భవిష్యత్తులో నియమబద్ధమైన మాత్రా ఛందస్సుకు పిలుపు ఏర్పడే సూచనలున్నాయి. అసలు కవిత్వసృష్టి తొలుత గొల్ల గేయంలోనే జరిగింది. ఆదికవి వాల్మీకివాక్కులు గానయోగ్యమైన ఛందస్సులోనే తొలుత వెల్వడినవి. తెలుగులో నన్నయ వృత్త రచనకే ప్రాధాన్యమిచ్చినా గేయాన్ని విస్మరించలేదు. లయబద్ధంగా తాళబద్ధంగా సడిచే ప్రతి ఛందస్సు గేయమే అని నా అభిప్రాయం. ఈ దృష్టితో తెలుగులో నన్నయ మొదటి గేయకవి.

"వీచి తనర్చి తలిర్చిన క్రోవుల
ఇమ్ముగు తావుల జొంపములన్
పూచిన మంచి యశోకములన్ సుర
పొన్నల పొన్నల గేదగులన్
కాచి బెడంగుగ పండిన యా సహ
కారములన్ కదళీతతులన్
చూచుచు వీనుల కింపెసగన్ విను
చున్ శుక కోకిల సుస్వరములో"

ఇది శకుంతలోపాఖ్యానంలో నన్నయ వ్రాసిన పద్యం. మాలినీ వృత్తం ముసుగులోవున్న గేయమిది. నాలుగు నాలుగుమాత్రల చతుర్శ్ర

గత్తిలో నడిచింది. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభందాకా గేయం నవవిధరగడల రూపంలో ప్రాచీనకావ్యాల్లో అప్పుడప్పుడు అక్కడక్కడ తొంగిచూచింది. ఈనాడు స్వేచ్ఛగా విహరిస్తున్నది. గేయంలో కొన్ని ప్రత్యేక కావ్యాలు వెలువడుతున్నవి. విద్వాన్ విశ్వంవంటివారు పద్యం పక్కనే గేయాన్ని నడిపి దాని విలువను పెంచుతున్నారు. గేయానికి కండబలం, గుండెబలం రెండూ ఏర్పడినవి. ముందు ముందు గతి నైవిధ్యంతో గేయంలో మహాకావ్యాలు రావచ్చు. ఛందస్సులోని దేశి తనంలో కన్నడం మున్నగు భాషలకు తెలుగు ఏమాత్రం తీసిపోదని ముందుతరం కవులు నిరూపించవచ్చు. కవిత్వం ఏ కొందరికో కాక సమస్త జనులకు అత్యవసరమైన వస్తువుగా కావచ్చు – అన సాహసించను గాని – కావాలి. నేను సదా మననంచేసే Rupert Brooke వాక్యాలతో ఈ వ్యాసం ముగిస్తాను.

"There are only three things in the world. One is to read poetry; another is to write poetry; and the best of all is to live poetry."

శబ్దశక్తి; అర్థస్ఫూర్తి

'ఇదమంధం తమః కృత్స్నం జాయేత భువనత్రయం
యది శబ్దాహ్వయం జ్యోతి రాసుసారం నదీప్యతే.'

శబ్దజ్యోతి ప్రకాశించకుండా వుంటే ముల్లోకాలూ తమస్సులోపడి తల్లడిల్లుతూవుండేవి. పశుపక్ష్యాదులనుంచీ, క్రిమికీటకాదులనుంచీ మనిషిని వేరుచేసే మహత్తర సాధనం శబ్దమే. ఒట్టి అరుపులద్వారా పశువులూ, పక్షులూ, ప్రకటించలేని భావాన్ని మానవుడు శబ్దాలద్వారా అందిస్తున్నాడు. అలా ఇలాకాదు అందంగా అందిస్తున్నాడు. అదులకు మర్మజ్ఞేచకంగా, ఆప్తులకు మధుస్ఫోరకంగా అందిస్తున్నాడు. మొట్టమొదట ఒకే ఒక్క అర్థంలోపుట్టిన ఒక్కొక్క శబ్దం కాలం కరిగినకొద్దీ, కల్పనా శిల్పం పెరిగినకొద్దీ, అవసరాలనుబట్టీ, ఆలోచనలనుబట్టీ అనేకరూపాల్లో విస్తరించింది. శబ్దానికున్న ఈ శక్తిని లాక్షణికులు అభిధఅనీ, లక్షణఅనీ, వ్యంజన అనీ త్రిభంగుల్లో వింగడించారు. మచ్చుకు 'గుణం' అనే శబ్దం తీసుకుంటాం. 'గుణం' అంటే వస్తుస్వభావం అని మామూలు అర్థం. సాంఖ్యంలో సత్త్వరజస్తమోగుణాలనేవి వేరే అర్థాన్ని కలిగివున్నాయి. గణితశాస్త్రంలో 'గుణం' రెట్టింపు వగైరాలకు వర్తిస్తుంది; ద్విగుణం, త్రిగుణం ఇత్యాదులు. ఇక అలంకార శాస్త్రంలోని ప్రసాదమాధుర్యాది కావ్యగుణాలు సరేసరి. వ్యవహారాన్నిబట్టి, అవసరాల్నిబట్టి ఒక్క గుణ శబ్దానికి ఇన్ని అర్థాలను బోధించే శక్తి ఏర్పడింది. ప్రకరణం, లింగం, అన్యశబ్దసన్నిధి మొదలైన లక్షణాలనుబట్టి మనం ఒక ప్రత్యేకమైన అర్థాన్ని పిండుకోవాలి. 'అతడు గుణవంతుడు' అన్నప్పుడు చప్పున స్ఫురించే అర్థం అతడు మంచిస్వభావం కలవాడనే. గుణశబ్దానికి సందర్భాన్నిబట్టి ఈ అర్థస్ఫోరక శక్తి యేర్పడింది.

కొన్ని శబ్దాలు పుట్టుకనుబట్టి ఒక అర్థంలో ఉంటాయి; పోషణలో మారిపోతుంటాయి. 'ఛాందసుడు' ఇలాంటిదే. ఛందస్సు అంటే ఒక వేదాంగం. ఛాందసుడంటే వేదం చదివినవాడని అర్థం. కాని వ్యవహారంలో వట్టిజడుడు, వెనకబడ్డవాడు అని రూఢి అయిపోయింది. కేవలం వేదపఠనంలోనే ఉండిపోయి లౌకికజ్ఞానం లేనివాణ్ణి దృష్టిలో పెట్టుకొని ఈ అర్థవిపరిణామం జరిగివుండవచ్చు. ఏమైనా ఈ శబ్దం వ్యుత్పత్త్యర్థం ఈనాడు చెల్లనినాణెంగా తయారైంది. ఈ ధోరణి అన్ని భాషల్లో ఉన్నదే. ఇంగ్లీషులో Silly అనే శబ్దముంది. ఈనాడు Silly అంటే అర్థంలేని, బుద్ధిలేని అని అర్థం. కాని పాపం పుట్టుకతో ఈ శబ్దానికున్న అర్థంవేరు. Silly కి Anglo-saxon భాషామూపం Selig (సెలీ). Innocent, happy అని దీని అర్థం. Selig Child అంటే happy Child అన్నమాట. సరిగ్గా ఈ శబ్దం మన ఛాందస శబ్దంలాగే మూలికార్థం కోల్పోయి మరో జన్మ ఎత్తింది. ఇదింకానయం. తెలుగులో 'కంపు' అనే మాటవుంది. ఈనాడిది 'దుర్వాసన'గా చలామణిలోవుంది. నన్నెచోడుని నాడు 'పువ్వుల కంపు' అనే ప్రయోగం ఎంత పరిమళవంతంగా వాడబడిందో చూస్తే ఆశ్చర్యంవేస్తుంది.

కొన్ని శబ్దాలున్నాయి. అవి ఒక కాలంలో విశాలంగా విరిసికొని ఈనాడు ముడుచుకొని పడుకొన్నాయి. 'చీర' అనేపదాన్ని తీసుకుందాం. పూర్వం చీర అంటే వస్త్రానికి పర్యాయపదం. స్త్రీలూ, పురుషులూ ధరించే వస్త్రాలకు – అవి మొలచీరలు కావచ్చు లేక తలచీరలు కావచ్చు– చీరలు అనే వాడుక. క్రమంగా ఈ శబ్దానికున్న శక్తి కుంచించుకపోయి స్త్రీలు ధరించే వసనాలకు మాత్రమే రూఢమైపోయింది. ఇంకోరకం శబ్దాలున్నాయి. అవి ఈ తెగకు భిన్నమైనవి. 'హాలం' అనే మాటవుంది. శిలాంగోంచి అంటే నువ్వుగింజల్లోంచి తీసిన నూనెకే హాలం అని మొదటి వాడుక. ఇంత పరిమితంగా ఉన్న ఈ శబ్దశక్తి విస్తృతమై ఈనాడు అన్ని నూనెలకు పర్యాయంగా నిలిచిపోయింది. ఈకోజుల్లో హాలం అంటే కేవలం నువ్వుల్లోంచి తీసిన నూనెమాత్రమే అని వాదించడానికి ఎన్ని

గుండెలుండాలి? అలాగే పంకజ శబ్దం. పంకజం అనగానే పద్మం స్ఫురిస్తుంది. పరమ రమణీయమైన శతపత్రం స్ఫురిస్తుంది. పంకంలో పుట్టిందనే విషయం గుర్తుకురాదు; పరీక్షల్లో వ్యుత్పత్త్యర్థాల్ని వ్రాసేటప్పుడు తప్ప.

కొందరు విమర్శకులు ఒక్కొక్క శబ్దాన్ని తీసుకొని అది ఉచ్చరించగానే ఒక విలక్షణమైన అర్థస్ఫూర్తి కలుగుతుందని చెబుతారు. ఒక ఆంగ్ల రచయిత Dawn అనే శబ్దాన్ని సాగదీసి ఉషస్సుయొక్క వికసన ధర్మాన్ని, Dusk అనేపదాన్ని చప్పున అనేసి సాయంసంధ్యయొక్క ముకుళన ధర్మాన్ని స్ఫురింప జేయడానికి ప్రయత్నించాడు. ఇది చమత్కారానికి బాగానేవుంటుందిగానీ, వివేచనకు నిల్వదు. తెలుగులో ఉషస్సు, తమస్సు అనే మాటలు ఒకేరకంగా చెక్కినట్టున్నాయి. చెవికి ఒకేరకంగా వినిపిస్తాయి. వాటి అర్థాల్లో అఘాతముంది. అయితే గణగణ, జలజల, ఫెళఫెళ మొదలైన ధ్వన్యనుకరణ శబ్దాలపట్ల ఈ అంచనా బాగానేవుంటుంది.

శబ్దానికి విడిగా ఉన్నప్పటి శక్తికంటె అన్యశబ్ద సన్నిధానంవల్ల కలిగేశక్తి అపారం.

'అడిగెదనని కడువడి జను
అడిగిన తనుమగుడ నుడువడని నడయుడుగున్
వెడ వెడ సిడిముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్'

అన్న గజేంద్రమోక్షంలోని పద్యం చదువుతుంటే భాష తెలియని వానికి గూడా ఏదో తడబాటుగా ఉందనే స్ఫురించకపోదు. 'డ' అనే అక్షరం పునరావృత్తివల్ల, అనేక లఘువుల బిగింపువల్ల ఈ రకమైన అర్థస్ఫూర్తి కలుగుతుంది. అలాగే అల్లసానివాని 'అట జనికాంచె' పద్యంలో 'అంబర చుంబి శిరస్సరత్ ఝరీపటల ముహుర్ముహుర్లుఠ దభంగతరంగ మృదంగ నిస్వన' అనే సుదీర్ఘ సమాసంవల్ల, అంబరచుంబి శిరస్సరత్ ఝరీ, అభంగ

తరంగ మృదంగ మొదలైన శబ్ద సముచ్చయాల పొందికవల్ల ఆకాశాన్ని తాకుతున్న శిఖరాలు, వాటిమీదనుంచి దూకుతున్న సెలయేళ్లు, వాటి తరంగాల మృదంగ ధ్వనులు సహృదయుల నయనాలకూ, శ్రవణాలకూ స్ఫురించడంలో విప్రతిపత్తిలేదు. అలాగే 'దుర్వాకోద్యమ బాహువిక్రమ రసాస్థోక ప్రతాప స్ఫురద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్' అని అంత అజస్రంగా, ఒక్కగుక్కలోలాగి, చివరికి ఒక్కముక్కలో 'కీచకా' అని సంబోధించడం ఎంతటి రౌద్రాన్ని రంగరించుకొన్న రచన! పదుపాఱుల సమ్మేళనంవల్ల, పటుసమాసచాలనంవల్ల ఈ శబ్దాల్లో పొడి పొడిగా ఉన్నప్పుడు లేని ఓజస్ఫూర్తి తీంద్రించిపోయింది.

శబ్దం విడిగా ఉన్నప్పుడే అనేక అర్థచ్ఛాయలు కలిగివుంటుంది. ఇతరపదాలతో కలిసి కాపురం చేసినప్పుడు దాని అర్థస్ఫూర్తిలో అద్భుతమైన పరిణామం జరుగుతుంది. అంతేకాదు - అభినయాన్నీ, కాకువునూ ఆసరాగా చేసుకొనికూడా ఒక్కొక్కసారి శబ్దం సరికొత్త రంగుల్ని విరజిమ్ముతూవుంటుంది. 'ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు' అనే పద్యంలో 'ఇంతలు' అనేమాటను ఎన్నిరకాలుగా నొక్కి, ఊది అనవచ్చో, అభినయంగూడా తోడ్డితే ఆ శబ్దానికి ఎన్నిరంగులూ, రుచులూ, రమ్యసౌరభాలూ ఏర్పడుతాయో అంచనా కట్టలేము.

నిత్యజీవితంలో వేమన

ప్రాచీనాంధ్రకవుల్లో వేమనది ప్రత్యేకమైన గొంతు. ఒకే పోతలో పోసిన ప్రబంధాలు ఉసిళ్ళలాగా ఉత్పన్నమవుతున్న రోజుల్లో నేరుగా ప్రజాజీవితంలోనుంచి వస్తువు నేరుకున్న ప్రజాకవి వేమన. అంతేకాదు, ఆదికవి వాల్మీకి అనుష్టుప్పువంటి చిన్నవృత్తంలో అంతటి మహాగాథను పలికించినట్లు వేమన ఆటవెలదిలాంటి పొట్టిపద్యంలో ఆకాశాన్నిముట్టే భావాలు ప్రకటించాడు. ఆ మహానుభావుడే అన్నాడుగదా – 'కొండ అద్దమందు కొంచెమై యుండదా' అని. కొలిస్తే అందని ప్రజాజీవితంలోని విస్తృతినీ, ఉన్నతినీ ఆటవెలదిలోని చిన్న చిన్న పాదాల్లో అంచంగా పొదిగాశీతడు. ఆ ఆటవెలదిలోకూడా చివరిపాదంలో 'విశ్వదాభిరామ వినురవేమ' అనేది విధిగా ఉండేదే. ఇకపోతే మిగిలినవి మూడుపాదాలే. ఈ మూడుపాదాల్లో ముల్లోకాలనూ ముడివేసేంత ఆలోచననూ, అనుభవాన్నీ అందించాశీతడు.

వేమన పదిహేనో శతాబ్దికి చెందినకవి. అంటే ఇప్పటికి మూడు వందల సంవత్సరాల వెనకాల ఉన్నకవి. ఈ మున్నూళ్ళనుంచీ వేమన జీవించేవున్నాడు. తాటాకు పుటల్లోనో, రాగిరేకుల్లోనో కాదు. ప్రజల నాల్క–లమీద, భావుకుల హృదయఫలకాలమీద.

కర్పూర తాంబూలం నములుతున్నప్పుడు, కన్నీళ్ళు చెక్కి–ళ్ళమీద చిందినప్పుడు, ఎవరినైనా ఎగతాళి చేసేటప్పుడు, ఎవరిపట్లనైనా సానుభూతి ప్రకటించేటప్పుడు, నిజం కళ్లగా డొల్లినప్పుడు, కళ్ల నిజమై పల్లవించినప్పుడు, ద్వేషం, హాసం, విషం, అమృతంలాంటి విభిన్నలక్షణాలున్న ప్రవృత్తి లెదురైనప్పుడు, సర్వసామాన్యంగా ఏమాత్రం తడివున్న మనస్సులోనైనా తళుక్కు–న స్ఫురించేది వేమన సృష్టించిన ఆటవెలదే.

మన నిత్యజీవితంలో వేమనలాగా కలిసిపోయిన కవి లేడు. అంతేకాదు- మనం నలుగురం కూచొని నవ్వేవేళల్లో వేమనపద్యాలు వింజామరల్లా ఉపకరిస్తాయి. పురుషార్థాల్లోని పొరల్ని విడదీసి చెప్పడానికి, అంతరంగానికీ, బహిరంగానికీ ఉన్న అంతరాలను విప్పి చూపడానికి వేమనపద్యాలు వెలలేని భాష్యాలుగా పనికినస్తాయి.

వేమనపద్యాలకు వస్తువు మనం బ్రతికి బట్టగట్టి తిరుగుతున్న సమాజంలోనే పుష్కలంగావుంది. ఆయనకు ఏ పురాణాల్లోనుంచో ఇతిహాసాల్లోనుంచో వస్తువరణం చేయవలసిన అవసరం లేకపోయింది. అంత మాత్రాన అతను పురాణాలనూ, ఇతిహాసాలనూ, అసలే స్పృశించలేదని కాదు. అక్కరగలిగినప్పుడు పౌరాణికాంశాల డొక్క చీల్చకుండా ఉండలే దితడు.

'కులము నీకుచేసి గురులను వధియింప
బాసగ నేనుగనుచు బొంకు బొంకె;
నేర ధర్మరాజు వెనుదేపవిత్తయా'

అని ధర్మరాజు శీలంమీదనే ధ్వజమెత్తాడు. అప్పుడప్పుడు ఇలా అక్షేపనిమిత్తం పురాణ విషయాలను తీసుకున్నా, వేమన గ్రహించిన వస్తువు ప్రధానంగా సాంఘికమే. సాంఘికమంటే మున్నూరేళ్ళ క్రిందటి సమాజానికి సంబంధించికదా! పాతవడిపోలేదా? నాటి న్యాయాలు నేడు చెల్లని నాణాలుకావా? వేమనకు సంబంధించినంతవరకూ ఈ ప్రశ్నలు వట్టి ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. వేమన నీతులూ, సూక్తులూ, దాదాపు అన్నీ ఇరవయ్యో శతాబ్ది సమాజాన్ని అక్షరాలా ప్రతిబింబిస్తాయి. ఆయన తీసుకున్న ఉపమానాలన్నీ ఈనాటికీ వర్తిస్తాయి. ఆయన చేపట్టిన వస్తువు ఈనాడూ సజీవంగా కనిపిస్తుంది. అంటే వేమన తీసుకున్న విషయాలూ, చెప్పినతీరూ, శాశ్వతత్వమువ్ర గ్గలనన్నమాట. ఇక మన నిత్యజీవితంలో వేమన పద్యాలు ఇంత సజీవంగా ఉండడానికి కారణమేమిటో చూద్దాం.

లోకంలోని మంచినీ, చెడునూ, ఎత్తునూ, పల్లాన్నీ చెప్పడానికి వేమన తమాషాపద్ధతిని అవలంబించాడు. లోకంలో పరస్పర విరుద్ధ గుణాలు కలిగివున్నా, బయటి కంత విభిన్నంగా కనిపించని పదార్థాలు కొన్నివుంటాయి. ఉప్పును తీసుకున్నాడు, కప్పురాన్ని తీసుకున్నాడు. రెంటిరూపంలో పోలికవుంది. నాల్క-మీద వేసిచూస్తే రెంటిరుచీ వేరు. ఇది సత్యం. శాశ్వతసత్యం. ఈ సత్యం వేదాంతానికి సంబంధించింది కాదు. వేదాంతంలో సత్యమంటే పరబ్రహ్మమే. మిగతా అంతా అసత్తు అంటే మిథ్య. వేమన ఇలాంటి సత్యాలజోలికి పోలేదు. అతడు చూసింది లౌకిక సత్యం. ఉప్పు, కర్పూరము ఒకేరకంగా కనిపించడం లౌకికసత్యం. అలాగే రుచిభేదం కూడా లౌకికసత్యమే. ఈ సత్యాన్ని తీసుకొని మళ్ళీ శాశ్వతసత్యాన్ని నిరూపించడానికి ప్రయత్నించాడు. 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అని నిరూపించడమది. లోకంలో అందరూ మనుషుల్లాగే కనిపిస్తారు. కాని వారిలో కర్పూర గుణమున్న పుణ్యాత్ములు వేరు. పురుషుల్లో పుణ్యపురుషులు వేరు అని బోధచేస్తే జనం వినరు. ఉప్పునకూ, కర్పూరానికీ ఉన్న సామ్యాన్నీ భేదాన్నీ విప్పిచెప్పి, మామూలు మనుషులకూ మానవోత్తములకూ ఉన్న తేడాను నిరూపిస్తే జనం వెంటనే తలూపుతుంది. రెండు పరస్పర భిన్నగుణాలుగల వస్తువుల్ని ఏరి వాటిద్వారా ఒక మహాసత్యాన్ని చెప్పడం వేమన ప్రత్యేకత. ఈ సూత్రం ఆధారంగానే వేమన రాయీ రత్నం, గంగిగోవూ ఖరమూ, కంచూ కనకం, మానూ మనసూ మొదలైన విభిన్న విషయాలను గ్రహించి, వాటిని విశ్లేషించి, సమన్వయించి, అప్రియమైన సత్యాలను గూడ హాయిగా అందించాడు. మన ఆరోగ్యం పెంచాడు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగా రన్నట్లుగా వేమన కవితాశక్తి రెండుప్రక్కలా పదునున్న చురకత్తి లాంటిది. దానిని ప్రయోగించే టప్పుడు అతనికి జంకు గొంకుల్లేవు. లోకం డబ్బుచుట్టూ గిరగిరా తిరుగుతుంది. గుణంతో నిమిత్తంలేకుండా ధనానికి పీటవేస్తుంది. ఈ నగ్నసత్యం అంచనాకెరిగినదే. దాన్నే వేమన ఎంతో పదునుగా ఇలా అభివ్యక్తీకరించాడు.

''కులము గలుగువారు గోత్రంబుగలవారు
విద్య చేత విర్రవీగువారు
పసిడిగల్గువాని బానిసకొడుకులు''

అలాగే

''చదువులందు పాడి మొదవులందును స్త్రీల
పెదవులందు రాజ్యపదవులందు
ఆశ లుడిగినట్టి అయ్యలుగల రొక్కో''

అని సూటిగా ప్రశ్నించాడు. కావనడానికి ఎన్ని గుండెలుండాలి. వేమన కాలంలోనే కాదు ఈ కాలంలోనూ వాటిమీద ఆశలుడిగిన వాళ్ళెనరు? ముఖ్యంగా 'రాజ్యపదవులందు' ఆశలు రోజురోజుకీ ముదిరి పోతున్న విషయం మనం నిత్యం గమనిస్తున్నదే.

వేమనకు విగ్రహారాధనమన్నా, అడవుల్లో తపస్సు చేయడమన్నా, మతంపేరిట వేషాలు వేయడమన్నా గిట్టదు. అసలు వాటిమీద ఈయనకు ప్రత్యయమే లేదు. అందువల్ల వాటిని తలచుకున్నప్పుడల్లా పరిహాసం స్ఫురిస్తుంది. ఏ కొండగుహల్లోనో తపస్సుచేసి మోక్షసిద్ధి పొందడం ఈయన దృష్టికి హాస్యాస్పదంగా కనిపించింది. అందుకే ఇలా అంటాడు:

'గుహలలోనజొచ్చి గురువుల వెదకంగ
క్రూరమృగ మొకండు తారసిలిన
ముక్తిమార్గ మదియే ముందుగా జూపురా.'

గ్రాసవాసోదైన్యాన్ని పొంది గుహల్లో తపఃక్లేశం అనుభవించే యోగుల్ని ఒక్క త్రోపుతో త్రోసివేశాడు. వాళ్లను ఏ మృగమో పొట్టబెట్టుకుని ముక్తిని ప్రసాదిస్తుందట.

వేమన విజ్ఞానం పుస్తకాలమీద ఆధారపడింది కాదు. లోకమే అతని పుస్తకం. లోకంలోని వివిధ సంఘటనలనూ, ప్రవృత్తులనూ సమీక

రించి అతడు నీతిని బోధించాడు. జారకాంతా సాంగత్యాన్ని నిరసించడానికి ఇతడు తీసుకున్న ఉపమానం చూడండి.

'ఇంటియాలి విడిచి యిల జారకాంతల
వెంట దిరుగువాడు వెర్రివాడు
పంటచేను విడిచి పరిగయేరినయట్లు.'

పరిగ అనేది వ్యవసాయసంబంధమైన పదం. ఎదిగిన పంటను కోసుకున్న తర్వాత అక్కడక్కడా రాలిపడివున్న గింజల్నిగానీ, మిగిలిపోయిన పంట మొక్కల్నిగానీ పరిగ అంటారు. పంట చేనుండగా దాన్ని విడిచి పరిగ ఏరుకోవడం ఎంత అవివేకమో, ఇల్లాలిని విడిచి వెలయాలి వెంట పడడం అంతే అని వేమన అందించిన వెచ్చనినీతి. ఈ నీతిని ప్రబోధించడానికి పంటచేనునూ, పరిగనూ ఉపమానాలుగా తీసుకోవడం అతని పరిశీలనశక్తికి నిదర్శనం. అలాగే మరోచోట ఇలా అంటాడు:

'పొట్లకాయ రాయి పొదిగి త్రాటనుగట్ట
లీల తోడ వంకలేక పెరుగు
కుక్కతోకగట్ట చక్కగా వచ్చునా.'

పొట్లకాయకు వంకరగా ఎదిగే గుణముంది. అందువల్ల దానికి వంకర లేకుండా చేయడానికి రాయి వేలాడగడుతారు. అది క్రమంగా చక్కగా ఎదుగుతుంది. మరి కుక్కతోకకు ఇలా చేసినా చక్కగా అవుతుందా అని వేమన ప్రశ్న. కాదని సమాధానం. కుక్కతోకంటే మూర్ఖుని చిత్తమన్నమాట. సూటిగా మూర్ఖుని చిత్త మనక కుక్కతోకను సంకేతంగా తీసుకోవడంలో ఉద్దేశమేమిటి? కుక్కతోక చక్కగరాచనే విషయం సుప్రసిద్ధం. అసలు కుక్కతోక వంకర అనే విషయం మూర్ఖుని వక్రబుద్ధికి పర్యాయంగా లోకంలో

నిలిచిపోయింది. దానికి ఉపమానంగా పొట్లకాయను తీసుకోవడంలో వేమన నిత్యజీవితంలోని వివిధాంగాలను ఎంత నిశితంగా పరిశీలించాడో తెలుస్తుంది.

ఈ భావాన్నే—

'ప్రాను దిద్దవచ్చు మరి వంక లేకుండ
దిద్దవచ్చు రాయి తిన్నగాను
మనసు దిద్దరాదు మహిమీద నెవరికి'

అనే పద్యంలోనూ బలపరిచాడు. నిత్యజీవితంలో సర్వసామాన్యంగా కనిపించే వస్తువుల్ని తీసికొని వాటినుంచి నీతిని పిండుకోవడంలో వేమన విశిష్టత యేమిటో స్పష్టమైన వినరించబడింది.

సామాన్య విషయాల్లోనుంచి తాత్వికమైన పారలౌకికమైన అభిప్రాయాలను తరచి తీయడంలోనూ వేమన అంతటి సమర్థుడే.

'ఆకు వక్క- సున్నమవి మూడు వన్నెలు
ఏకమైన చోట తాకు నెరుపు
సోకి త్రిగుణమట్లు శోభించు పరమాత్మ.'

తాంబూలాన్ని తీసుకున్నాడు వేమన. తాంబూలంలో ముఖ్య పదార్థాలు మూడు. ఆకు, వక్క, సున్నం. వీటి వన్నెలువేరు. ఈ మూడు వన్నెలు మేళనం పొందినప్పుడు ఒక కొత్తవన్నె - ఎరుపువన్నె - పుడుతుంది. తాంబూలరాగం అందరూ ఎరిగిందే. ఈ మామూలు సత్యాన్నిగ్రహించి వేమన చాలా ఎత్తు ఎగిరాడు. పారలౌకిక ప్రపంచంలోకి వెళ్లిపోయాడు. మానవుని మనస్సు త్రిగుణాత్మకం. సృష్టి త్రిగుణ హేతుకం. త్రిగుణ సమ్మేళనం పరమాత్మ దీప్తికి దారితీస్తుంది. ఇంతటి తాత్విక విషయం చెప్పడానికి వేమన తీసుకున్న తాంబూలోపమానం ఆశ్చర్యం కలిగిస్తుంది. మనం పూర్తిగా విస్మరించిన, గుర్తించక విసర్జిం

చిన సామాన్య విషయాలను పరిశీలించి వాటిద్వారా పరతత్వ నిర్దేశం చేయడం మాటలా? అలాంటి గారడి వేమన్నకు వెన్నతోపెట్టిన విద్య. అందుకే వేమన మన నిత్యజీవితానికి అంత సన్నిహితుడైనాడు. ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు ఆయన్ని స్మరించకుండా ఉండలేము. ఆంధ్రజాతి ఊపిరిలో ఊపిరిగా కలిసిపోయాడతడు. అందుకే అతణ్ణి మన వేమన అనాలనిపిస్తుంది.

రవీంద్రుని కవిత్వంలో విశ్వజనీనత

రవీంద్రుడు తన తొలిప్రాయంలో అచ్చమైన వంగకవి. ఆ రోజుల్లో రవీంద్రుడు వ్రాసిన గేయాల్లో ఇంగ్లీషు కాల్పనిక కవులైన షెల్లీకీట్సుల భావపరిమళం గుబాళిస్తూ ఉండేది. అందుకే ఆనాటి సాహిత్యకులు అతణ్ణి 'బెంగాల్ షెల్లీ'అని కీర్తించారు. క్రమంగా అతని సాహితీ వ్యక్తిత్వం బహుముఖాలుగా వికసించింది. గేయం, కథ, నవల, నాటకం, సంగీత రూపకం మొదలైన సాహితీ ప్రక్రియలన్నిటినీ సమప్రమాణంలో నడిపించి జాతీయకవిగా పేరుపొందాడు. ఇంగ్లీషు భాషలో రవీంద్రుని 'గీతాంజలి' వెలువడి, దానికి స్వీడెన్ దేశపు అకాడమీ నోబెల్ బహుమతి లభించడంతో ప్రపంచమంతా అతణ్ణి 'విశ్వకవి'గా గుర్తించి, అతని అమృత ప్రతిభకు నివాళులెత్తింది. రవీంద్రుడు ఇంగ్లండు వెళ్లినప్పుడు రాబర్ట్ బ్రిడ్జెస్, ఫ్రాపౌండు, డబ్ల్యూ. బి. ఏట్సు వంటి కవులు, బ్రూక్స్, బ్రాడ్లీ వంటి విమర్శకులు, వెల్స్, రస్సెల్ వంటి మేధావులూ అతణ్ణి కలుసుకుని అయన కవితాశక్తికి జోహారులర్పించారు. బ్రాడ్లీవంటి ప్రముఖ విమర్శకుడు రవీంద్రుని ఆంగ్లానువాదాలను చదివి 'సమకాలిక కవుల్లో మహాకవి' యని అతణ్ణి అభినందించాడు. ప్రపంచంలోని అగ్రరాజ్యాలన్నిటిలో పర్యటించి, వాటిని తన వాగమృత శీకరాలతో పల్లవింపజేసి 'విశ్వకవి' బిరుదం సార్థకం చేసుకున్నాడు రవీంద్రుడు.

రవీంద్రుడు మొదటినుంచి ప్రకృత్యుపాసకుడు. 'విశ్వమంతా ప్రాణ విభుని మందిర'మని భావించినవాడు. వైష్ణవ పదావళీ పరిమళాన్ని ఎద నిండా నింపుకొన్న మధురభక్తి ప్రవణుడు. అందువల్ల ఆయన కవిత్వంలో విశ్వజనీన దృష్టి వేరూది నిల్చినది. అయితే విశాలదృష్టివేన జాతీయతను విస్మరించలేదతడు. ఏకకాలంలో జాతీయతనూ, విశ్వజనీనతనూ ఇముడ్చుకొన్న సమన్వయశీలి ఆయన. వంగదేశ విభజనతోనూ ఈ కవీంద్రుడు తన

•గుండెను రెండుగా చీల్చివేసినట్లు బాధపడ్డాడు. 'బంగ్లాక్ మాటీ బంగ్లాక్ జల్' అనేగేయంలో భగవంతుణ్ణి ఉద్దేశించి 'నా దేశంలో పుట్టిన కొడుకుల కూతుళ్ల జీవితాలూ హృదయాలూ ఒకటిగా ఉండేట్లు చూడు ప్రభూ' అని ఆక్రోశించాడు. మకోగేయంలో ఏ పూర్వపుణ్యం వల్లనో తానీ పోతుగడ్డమీద పుట్టానని సగర్వంగా చెప్పుకున్నాడు. ఇంకోగేయంలో ఇలా అన్నాడు.

'ఇవాళ నిన్ను వాళ్లు వెర్రివాడంటున్నారు
నీ తలమీద దుమ్ము చల్లుతున్నారు
రేపటిదాకా ఓపికపట్టు తమ్ముడూ!
వాళ్లే నిన్ను పూలదండలతో పూజిస్తారు.
ఇవాళ వాళ్లు ఎత్తు గడ్డెలమీద కూర్చున్నారు
రేపటిదాకా ఓపికపట్టు తమ్ముడూ!
వాళ్లే దిగివచ్చి నీ పాదాలమ్ము ప్రణమిల్లుతారు.'

ఈ విధంగా పాలకుల్ని ధిక్కరించి దేశీయుల్ని ఓదార్చాడు మహాకవి. అయితే రవీంద్రుని జాతీయాభిమానం తనచుట్టూ గోడలు కట్టుకున్నది కాదు. ఆయన దేశభక్తి పేర గత వైభవాన్ని గూర్చి డిండిమం మ్రోగించి వర్తమానాన్ని విస్మరించలేదు. నవ్యమాన సమస్యలు కన్నుగప్పగా ముందుచూపు కోల్పోలేదు. వర్తమానంలో నిటారుగా నిల్చొని, బారసాచి భవిష్యత్తును కౌగిలించుకున్న మహాద్రష్ట రవీంద్రుడు. భవిష్యత్తు మీద అంతటి ప్రగాఢ విశ్వాసమున్న వాడు కాబట్టే అతడు సంకుచితమైన జాతీయతకు అతీతంగా ఉండిపోయాడు. ఏనాటికైనా విశ్వమంతా ఒక పందిట్లోకూచొని విందారగించే పర్వదినం వస్తుందని ప్రగాఢంగా విశ్వసించాడు. అందుకే గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వరాజ్యోద్యమంలో పాల్గొనడానికి నిరాకరించాడు. విదేశవస్తు దహనంపట్ల నిరసన ప్రకటించాడు. స్వరాజ్యప్రాప్తికి చర్కా ఒక్కటే సాధనం కాజాలదని. కుటీర పరిశ్రమలే ఆర్థిక సమస్యలను తీర్చజాలవని జంకుగొంకులేకుండా తన అభిప్రాయాలను వెల్లడించాడు. స్వరాజ్యోద్యమంలో పాల్గొనవల

సిందిగా గాంధీజీ తనను ఆహ్వానింపగా 'మనం పాశ్చాత్య దేశాలనుంచి వారి విజ్ఞాన శాస్త్రాభివృద్ధినుంచి చాలా నేర్చుకోవలసివుం'దని సమాధాన మిచ్చాడు. ఈ అభిప్రాయాల్ని వట్టి మాటలతోకాక ఆచరణలో సాధించి చూపాడు. తూర్పు పడమరల్లోని విభిన్న సంస్కృతి సంపదల నిగ్గులను చూసి, ఏకసూత్రంలో చేరదీసి, సమస్తలోకానికి సమర్పించే విశాల వేది కగా 'విశ్వభారతి' అనే సంస్థను నెలకొల్పాడు. ఈ సంస్థ రానురాను 'యత్రవిశ్వం భవత్యేక నీడమ్' అన్న సూక్తికి సుందర నిదర్శనంగా నిలిచి పోయింది.

రవీంద్రుడు స్వరాజ్యోద్యమంలో పాల్గొనడానికి నిరాకరించినంత మాత్రాన ఆయన దేశభక్తిని శంకించవలసిన పనిలేదు. వంగదేశ విభజ నకు వ్యతిరేకంగా ఆయన నడుముకట్టి కార్యరంగంలోకి దూకాడు. స్వయంగా పాటలు పాడుతూ ఊరేగింపుల్లో తిరిగి ప్రజల్లో నూతనోత్తే జానికి ఏతాములెత్తాడు. జలియన్‌వాలాబాగ్‌లో ఇంగ్లీషు ప్రభుత్వం జరిపిన ఘాతుక చర్యలకు నిరసనగా 'సర్' బిరుదాన్ని పరిత్యజించాడు. ఆ సందర్భంలో రవీంద్రుడు ప్రభుత్వానికి వ్రాసిన లేఖ ఆయన ప్రగాఢ దేశభక్తికి చెరిగిపోని చిహ్నం.

రవీంద్రునికి స్వదేశంపట్ల, స్వజాతిపట్ల యెంతటి అభిమానమున్నా ఇతర దేశాలపట్ల ఎన్నడూ చిన్నచూపులేదు. ప్రపంచ మానవ ప్రగ తియే తన ప్రగతిగా భావించుకొన్న పరిణద్ధ హృదయుడాయన. అంతటి విశాలహృదయంకలవాడు కాబట్టే అమెరికా, ఇంగ్లండు, జపాన్, జర్మనీ, స్విట్జర్లాండ్, రష్యా మున్నగు దేశాల ఆహ్వానాలను పురస్కరించుకుని పర్య టించి, ఆ యా దేశాల్లోని మంచిని అభినందించాడు; చెడుని నిరసించాడు. జపాన్‌లో పర్యటిస్తూనే జపాన్ దేశం పాశ్చాత్యులను గుడ్డిగా అనుక రించడం ప్రమాదకరమని హెచ్చరించాడు. ఇటలీ ప్రభుత్వం తనకు చేసిన ఘనసన్మానాలకు పొంగిపోయి లొంగిపోక, ఫాసిజం మేకవన్నె పులి అనే సత్యాన్ని గమనించి క్రమంగా దాని బండారం బయటపెట్టాడు. లండన్‌లో

పర్యటిస్తూన్నప్పుడు భారతదేశంలో ఆంగ్లప్రభుత్వం అవలంబిస్తున్న దమన నీతిని తీవ్రంగా నిరసిస్తూ పత్రికా ప్రకటన చేశాడు. సోవియట్ రష్యాను సందర్శించి, ఆర్థిక సామాజికరంగాల్లో ఆదేశం సాధించిన అపూర్వ విజయాలను గుర్తించి, 'తాను చిరకాలంనుంచి కంటున్న కలలకు ఈ దేశం వాస్తవరూపం కల్పించిం'దని జోతలర్పించాడు. ప్రపంచమంతా ఒక కుటుంబంగా భావించే విశాల మనస్కుడు కాబట్టే వివిధ దేశాలను సందర్శించి, వాటి లోపాలోపాలను ముక్కుసూటిగా ప్రకటించ గలిగాడు.

రవీంద్రుడు ప్రభుని చరణాలమ్రోల సమర్పించిన 'గీతాంజలి' వ్యక్తిగతమైన భక్తిప్రపత్తికి మాత్రమే పరిమితమైందికాదు. విశ్వమానవుల హృదయ కుహరాల్లో ప్రతిధ్వనిస్తున్న భావాలకది అక్షర సంపుటి.

''మనస్సు భయముక్తమై, శిరస్సు శిఖరంలా నిల్చినచోట
జ్ఞానం స్వేచ్ఛగా విహరించే చోట
జాతిభేదాల యిరుకు గోడలతో ముక్కచెక్కలు కాకుండా
లోకం నాకంగా వెలిగే చోట
క్షుద్రమైన ఆచారాల యెడారులలో
హేతు స్రోతస్విని ఇంకిపోనిచోట
ఓ ప్రభూ! నా మాతృదేశాన్ని మేల్కొల్పవూ'

అని గానంచేసిన నిర్వేల మానవప్రేమ రవీంద్రునిది. ప్రపంచంలోని ప్రతి దేశం సగర్వంగా పాడుకోదగిన గేయమిది. ప్రతి మానవుడు వాంఛించే పరమ లక్ష్యాలకు ప్రతీక యిది.

రవీంద్రుడు ప్రథమ ప్రపంచయుద్ధంవల్ల కలిగిన దుష్ఫలితాలను కండ్లారా చూశాడు. ప్రపంచానికి యుద్ధం ఎంత భయంకరవ్యాధియో అనుభవ సాక్షికంగా తెలుసుకున్నాడు. రెండో ప్రపంచయుద్ధం రాక ముందే లోకం విద్వేషాగ్ని తాపంతో ఎలా తుకతుక ఉడికిపోతున్నదో ఆయన గమనించాడు. సమస్త దేశాల పరస్పర సహకారాన్ని మానవ

ప్రేమనూ మనసారాకోరే రవీంద్రుడు ప్రపంచం నలుమూలలా రగులు కొంటున్న వైమనస్యాన్ని చూచి భరింపలేకపోయాడు. 'నటీర్ పూజ' అనే శీర్షికతో బుద్ధుణ్ణి సంబోధిస్తూ ప్రవాసిన గేయంలో ప్రపంచమంతా ద్వేషోన్మాదంతో చిందులు త్రొక్కుతున్నదని, క్రోధం లోభం నలు వైపులా బుసకొడుతున్నవని, అనశ్వరమనుకోశంగల ప్రేమపద్మం బుద్ధ భగవానుని చరణాల వెలుగులో వికసించాలని నివేదించుకున్నాడు.

'ఫాలంమీద ద్వేషరక్తం పులుముకుని
ప్రళయతాండవం చేస్తున్న దేశాలను
ప్రభూ! నీ దక్షిణ కరంతో స్పృశించు
వాటి బ్రతుకళ్లో అమృతశాంతి నింపు
ప్రవిమల సౌందర్యచ్ఛందాన్ని పలికింపు'

అని బుద్ధుణ్ణి ప్రార్థించాడు. 'విశ్వహృదయంలో అంటుకున్న కారుచిచ్చులను నిస్తులమైన నీ కరుణతో తుడిచివేయి ప్రభూ' అని వేడుకున్నాడు.

రెండో ప్రపంచయుద్ధం ప్రారంభంకాగానే రవీంద్రుని లేఖిని అసిధారా తీవ్రమై విజృంభించింది. యుగయుగాలుగా పెరిగిన పచ్చని మానవసంస్కృతి పరమాణువు గుప్పిట్లో బందీయై పడివున్నదని ఆయన గమనించాడు. యుద్ధంవల్ల మానవజాతికి ఎంతటి ఉపద్రవం కలుగనున్నదో ఎలుగెత్తి చాటాడు. ఆ మహాకవి సింహగర్జన ఇలా మార్మ్రోగింది.

'నాగరకతా శిఖరాలు తుత్తునకలై ధూళిపాలు కానున్నవి
తరతరాలుగా మానవు డార్జించిన సభ్యతా సంపద
నరహంతకుల ఊకు-్ర కాళ్లకింద నలిగిపోతున్నది
తరుణ దేశాల్లారా! రండి రండి
ద్వేషంతో ముక్కచెక్కలైన విశ్వానికి
స్నేహ సేతువులు నిర్మించండి
చెక్కుచెదరని విశ్వాసంతో విజయధ్వజా లెగ చేయండి
పరాభవాన్ని భరించకండి
పదండి; స్వేచ్ఛగా ముందుకు పదండి.'

వ్యాసవాహిని

మానవుని భవిష్యత్తుపట్ల అచంచల విశ్వాసం, సమర విముఖత, శాంతి కాముకత, కారుణ్యదృష్టి, కులమత వర్ణవర్గ భేదాలకు అతీతమైన మానవ ప్రేమ, రవీంద్రుని విశ్వజనీన దృక్పథాన్ని వేనోళ్లచాటే అంశాలు. ఈ అంశాలన్నీ ఆయన కవిత్వంలో శతపత్ర సుందరంగా భాసిస్తుంటాయి. ముఖ్యంగా 'గీతాంజలి' ప్రపంచ మానవుల మధుర వేదనలను వ్యక్తీకరించే మహాకావ్యం. రవీంద్రుని విశ్వజనీన దృష్టికి ఈ కావ్యంలోని ప్రతి ఖండం మచ్చుతునక. అంతటి విశాల రమణీయ దృక్పథమున్నందువల్లనే రవీంద్రుడు మహాకవిగా విశ్వకవిగా ప్రపంచ సాహిత్యరంగంలో పసిడి గద్దెమీద ఆసీనుడైవున్నాడు.

నాయుడు బావ

'గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
కూకుండ నీదురా కూసింత సేపు'

అన్న పాటతో ఎంకి తెలుగు దేశంలో అవతరించింది. ఎంకి బాల్యంగురించీ కౌమారం గురించీ యెవ్వరికీ తెలియదు. ఆవిడ మిసిమి వయసులోనే రసజగత్తులో కాలుమోపింది. ఎంకి అవతరించిన క్షణంలోనే నాయుడు బావ రంగంమీద ప్రత్యక్షమయ్యాడు. ఇప్పుడా - అప్పుడా? 1917-18 ప్రాంతంలో. చెన్నపట్టణంలో. నిగనిగలాడే పచ్చికచేలో కాదు - పొగ బండిలో. నండూరి సుబ్బారావుగారి నవనీత గళరవంలో. నాటినుంచి నేటిదాకా ఎంకీ నాయుడు బావలు తులలేని శృంగారమూర్తులుగా తెలుగు నాట స్థిరపడిపోయారు. కొసచూపు దూసినప్పుడు, కులుకునడక చూసినప్పుడు, సంయోగ శర్వరిలో, వియోగ విభావరిలో, శృంగార సంబంధమైన సమస్తావస్థల్లో సరసులందరికీ ఎంకిపాటలు తళుక్కున స్ఫురిస్తాయి. ఎంకి ఒక్క పల్లెపిల్లగా కాదు యెలుతురు పిల్లగా కలకలనవ్వుతూ కనిపిస్తుంది.

ఎంకిపాటల్లో నాయిక యెంకి. నాయకుడు నాయుడుబావ. ఈ పాటలు నాయికా ప్రధానమైనవే అని అందరికీ తెలుసు. నాయుడుబావే ఒక పాటలో అన్నాడు.

'రాసోరింటికైన రంగు తెచ్చేపిల్ల
నా సొమ్మె - నా గుండె నమిలి మింగినపిల్ల'

అని. గుండెనేకాదు - నాయుడుబావనే నమిలి మింగేంతటి ఉజ్జ్వలకీర్తి యెంకికుంది. స్థూలదృష్టితో చూస్తే నాయుడుబావ వ్యక్తిత్వం ప్రత్యేక ముద్రలో కనిపించదు. 'ఎవరీతడు?' అని అడిగితే 'ఎంకి మగడు' అని

బదులు చెప్పవలసివస్తుంది. కాని కొంచెంలోతుగా చూస్తే తెలుస్తుంది నాయుడుబావ మరీ అంతగా తీసివేయదగిన నాయకుడు కాడని. ఈయన పేరు ఎంకి పేరులాగా పదేపదే ఆ పాటల్లో కనిపించకున్నా గొంతు మాత్రం చాలా వాటిల్లో స్ఫుటంగా వినిపిస్తూనేవుంది.

వేదం వేంకటరాయశాస్త్రిగారు ఓమాటన్నారు – రంభానలకూబరులు అలంకార శాస్త్రవిరుద్ధంగా శృంగార సల్లాపం చేసిన దోషంవల్ల కలియుగంలో ఎంకీ నాయుడుబావలుగా జన్మించారని. శాస్త్రిగారు విసిరిన చమత్కారంలో ఒక సత్యం ధ్వనిస్తుంది. వీళ్లు శృంగార రససృష్టిలో గంధర్వశ్రేణికి చెందినవారని; అలంకార శాస్త్రమర్యాదలంటని అమాయికులైన జానపద వంపతులని.

ఇంతకూ ఎంకీ నాయుడుబావలు రంభానలకూబరులు కారు; రతీమన్మథులూ కారు. ఉండడం నేలమీదైనా ఊహల్లో గంధర్వతా గంధాన్ని పులుముకున్న అలౌకిక పాత్రలూకారు. మనవాళ్లు, మనలోనివాళ్లు, మనసున్న మనుషులు. మనసున్న వాళ్లందరికీ సహజమైన విభిన్న తత్వాలు మేళవించుకున్న సరస వాస్తవిక పాత్రలు. నవలల్లో, కథల్లో కనిపించే నాయికా నాయకుల్లాగా అస్తమానం మనల్ని అంటుకుని ఉండరు. అప్పుడప్పుడు నేలనుంచి గాలిలోకి ఎగిసి పోతుంటారు. అయితే నేమి; మరు నిమిషంలోనే మనలో వచ్చి వాలుతారు.

ఇక నాయుడు బావను తీసుకుందాం. మొదటిదశలో ఎంకి తనను 'మందొ మాకోయెట్టి మరిగించినాదీ, పల్లకుందామంటె పాణమాగదురా' అని సొద వెళ్లబోసుకుంటాడు. ఎంకి లేకపోతే పండిన మామిడిపండు గూడా పచ్చి విషంలాగా ఉందంటాడు. ఎంత అమాయికుడు పాపం! క్రమంగా ఇలాంటివాడు గడుసుదేరిపోయాడు.

"ఎంకి గాలొకపాలి యిసిరినా సాలు
తోటంత రాజల్లె తొవ్వి పోసేను"

అనే దశ నందుకున్నాము. రానురాను ఈ చిలిపితనం చిగుళ్లు వేసి

'ఊరెల్తనని పలికి మారేశమేసుకొని
సకినాల పాటొచ్చు సకిన మడుగు'

మనోస్థితికి వెరిగాడు. మన నిత్యజీవితంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న కొత్త దంపతుల్లో - వాళ్లు పట్టణవాసులైనా, పామరులైనా సరే - ఈ క్రమ పరిణామం సహజంగా కనిపిస్తుంది.

నాయుడుబావలో ముగ్ధ ప్రేమికుని లక్షణాలు ముమ్మూర్తులా కనిపిస్తాయి. ఆయనకు ఎంకినిగూర్చి పాడుకోవడం సరదా. ఒంటిగా కాదు; పదిమందిలో. అయితే ఆపాట పాడుకోవడం తనకోసమే కాదు. తాను పాడుతుండగా 'గోడసాటున ఎంకి గుటకలేస్తూ' వింటూవుండాలి. అప్పుడు నలుగురమ్మలు తన పాటను మెచ్చుకుంటూ ఉండాలి. ఇలాంటి సందర్భాలలో మొలక వలపులు మూటగట్టుకున్న ముగ్ధ ప్రేమికుల లక్షణం ఎంతో చక్కగా వ్యక్తమవుతుంది.

ఎంకీ నాయుడు బావలకు పెళ్లయింది. పిల్లోడుగూడా కలిగాడు. ఇంకేం? "సంకలో పిల్లోడు సంబాలు పడుతుంటే" ఎంకితో తీర్థాని కెళ్తాడు నాయుడుబావ. కొత్త మడతలు కట్టుకుని, నెత్తిమూట లెత్తుకొని, 'బరువు మారుసుకుంటూ' పక్కన నవ్వుతూ వెళ్లాలంటాడు. బాగానేవుంది. కాని మధ్యలో

"తాతనాటి వూసు తలవాలి
దారి పొడుగున కీసులాడాలి
తప్పు నీదేయంట దెప్పాలి"

అంటాడు. ముగ్ధత్వం దాటిపోయి ముదురు సరసం చిలికే మురిపాలదశను చేరుకున్నాడు నాయుడుబావ. ఈ పాటలో సరదాగా తీర్థయాత్రలకు వెళ్లే పడుచు దంపతుల ఇచ్చకాలు ఎంతో వెచ్చగా కనిపిస్తుంటాయి.

నాయుడుబావ అచ్చమైన వైతు. తోట తొవ్వుతుంటాడు. పతాము లాగుతుంటాడు. మళ్లు తడుపుతుంటాడు. మంచె కాస్తుంటాడు. కమ్మని తూర్పు కాపువారి యాసలో ఘుమ్మైన పదాలు పాడుకుంటాడు. బాస యాసగావున్నంత మాత్రాన ఇతణ్ణి ఉత్త పల్లెటూరి బైతుగా జమకట్టడానికి వీల్లేదు. ఉత్తమ కావ్యాల్లోని నాయకుల ఉదాత్త గుణాలన్నీ ఈయనకున్నాయి. అలాగని మన ప్రబంధ నాయకుల్లో కొంచరిలాగా నాయికను నఖశిఖాపర్యంతం రకరకాల ఉత్ప్రేక్షలతో వర్ణించేంత బుర్ర బలం ఇతనికిలేదు. కాని పువ్వులాంటి హృదయముంది. పైరగాలికి తలలూపే పచ్చని వరిమొక్కల్లాంటి భావాలున్నాయి. ఎంకిలేనిదే తానుండలేడు. ఎంకి చూపులు తనకు కావాలి. ఎంకి 'కళ్లెత్తే సాలు కనకాబిసేకా'లంటాడు. అలాగే ఆవిడ 'వొక్క నవ్వేమేలు, వొజ్జిర వొయిడూరాలు'. ఈ రకంగా మెత్తగా భావించే చిత్తం నాయుడు బావది.

ఒకొక్కమాటు నాయుడుబావ చిత్తవృత్తి చిత్రంగా రసోత్తరంగా అగుపిస్తుంది. ఎంకితో అంటాడు

'ఆరిపేయవే దీపమూ
యెలుగులో నీమోద నిలపలేనే మనసు'

అని. ఎంకిని చూడడం తనకిష్టం కాదా! అదికాదు-ఆవిడ అతిలోక సౌందర్యాన్ని చూసి తట్టుకోలేని స్థితిలోవున్నాడు. ఆ మనఃస్థితినే 'యెలుగులో నీమోద నిలపలేనే మనసు' అన్న ఛోరణిలో వ్యక్తంచేశాడు. అంతటితోనే అయిపోలేదు. చీకట్లో ఆవిడ కళ్లు తళతళలు చూడాలనుకున్నాడు. క్రమంగా

"సూపులే ఆపేసి, రూపు వూసే మరిసి
వొకరెరుగ కింకొకరు వొరిగి నిదరోదాము"

అంటూ శృంగారభావనా శృంగాల నధిరోహించాడు. ఒక మహాకవి ఊహాను, ఒక లలిత భావుకుని రసప్రవృత్తిని మామూలుమాటల్లో మహా

ద్భుతంగా ప్రదర్శించాడు. సంయోగ శృంగారంలోని స్వచ్ఛమైన తాదాత్మ్య దృక్పథాన్ని స్వాదుమార్గంలో వెళ్లడించాడు. అయితే ఒక పల్లెటూరి నాయుడు బావకు ఇంతటి భావనాశక్తి ఉంటుందా అనే ప్రశ్న ఉంది. పల్లీయుడై తేమాత్రం భావనకు కొరత ఉంటుందా? ఒక్కొక్కని సంస్కారాన్ని బట్టి సరసతా, చతురతా ఏర్పడుతాయి. నాయుడుబావ సరసుడు; చతురుడు. అతనిలాగా భావించేవాళ్లు సామాన్య మానవులలో అనేకులున్నారు. అయితే ఆ భావనే కవి ముఖశుక్తిలో పడి ముత్యపు నిగ్గులను సంతరించుకుంది.

వయసు గడిచినకొద్దీ నాయుడుబావ మతిలో, జీవనగతిలో మార్పు వచ్చింది. అది సహజం. పడుచుదనంలోని గడుసుదనం పరిణత ప్రాయంలో ఉంటుందా? గలగలపారే బుద్ధికి నిలకడ ఏర్పడుతుంది. తనకూ ఎంకికీ ఉన్న అచ్చిన్న బంధాన్ని తలచుకుని

'పగలు రేయెడ బాటెరుగ రెవ్వగోయీ
శంకరుడు సతి యాచట, ఇంకెవ్వరిచట'

అంటూ సతీశివుల దాంపత్యంతో పోల్చుకుంటాడు. బింబ ప్రతిబింబాల్లాగా విడిపోకుండా ఉన్నామని ఉగ్గడిస్తాడు. చిత్రంలోని ఎంకిని సంభోధిస్తూ ఆ చిత్రానికి ఎంకి చక్కదనమే మెరుగు పెట్టిందనీ, తన చిత్తానికి ఎంకితనమే వెలుగునిచ్చిందనీ పరిణత బుద్ధిని ప్రకటిస్తాడు. నాయుడు బావకు కలిగిన ఈ మతిపరిణతి ప్రాయం మీరినవారి ప్రధానగుణం. అయితే సంస్కారమంటూ ఇంకా బతికి ఉన్నవాళ్లకే ఇది వర్తిస్తుంది. అది కొరవడిన వాళ్లనుచూస్తే కొడుకును యవ్వనం బదులు అడుగుకున్న యయాతి జ్ఞాపకంవస్తాడు. నాయుడుబావ ఇలాంటివాడు కాడు. మెట్లు మెట్లుగా శృంగారరస శిఖరా లందుకున్నవాడు. పవిత్ర దాంపత్య ధర్మానికి ప్రతీకగా నిల్చినవాడు. మనలో అనేకుల అభిరుచులకు ప్రతినిధిగా ఎంకిపాటల్లో ఊపిరి పోసుకొని నిల్చిన మధుర శృంగార నాయకుడు.

REH01C320

Vyasa Vahini

(Literary Essays)

By

Dr. C. NARAYANA REDDY

Sole Distributors :

Andhra Pradesh Book Distributors

Secunderabad, Masulipatam.

124

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RETOZ C320
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	9/10/23
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	131
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	1, 17, 122, 123
లేని పేజీలు	No
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	[illegible] prathyusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	Good